


ప్రతి అక్షరం ప్రజల కోసం

www.prajapaksham.in

# ప్రజాపక్షం

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 312 | సోమవారం | 12-10-2026 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## దేశంలో 1975 తర్వాత మళ్లీ ఎమర్జెన్సీని చూస్తున్నాం

● ఢిల్లీని ఒక కంటోన్మెంట్‌గా మార్చేశారు ● జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు ఆగవు ● దేశమంతటా విస్తరింపజేస్తాం : సిజెపి



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా తమ ఆందోళనను కొనసాగిస్తామని, ఈ నిరసన దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నాయకులు ఉద్ఘాటించారు. శనివారం ఢిల్లీ విమానాశ్రయంలో నిర్బంధంలోకి తీసుకున్న సిజెపి నేతలు అభిజీత్ దీప్కే, అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను ఆదివారం ఉదయం విడుదల చేశారు. అనంతరం వారు మీడియా సమావేశం నిర్వహించారు. దేశంలో 1975 తర్వాత మళ్లీ ఎమర్జెన్సీని చూస్తున్నామని సౌరవ్ దాస్ అన్నారు. ఢిల్లీని ఒక కంటోన్మెంట్‌గా మార్చేశారని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా ప్రజలకు లేదా? అని ఆయన ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని సృష్టించి, దేశాన్ని తమ సొంత పౌరులకు వ్యతిరేకంగా మార్చిందని సౌరవ్ దాస్ ఆరోపించారు. నిర్దేశిత ప్రదేశంలో నిరసన తెలియజేయాలనుకుంటున్న వారిని నిరోధించే బదులు, అధికారులు చర్చల కోసం ఒక ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించి ఉండవచ్చు కదా అని ఆయన సూచించారు. పోలీసులు ఎలాంటి అధికారిక నోటీసు లేకుండా తమను అక్రమంగా నిర్బంధించారని, తమ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారని, న్యాయవాదిని సంప్రదించడానికి అనుమతించలేదని దాస్ ఆరోపించారు. తమ విడుదలకు విధించిన షరతును ప్రస్తావిస్తూ ఒక సంవత్సరం పాటు తరువాయి 8లో

# నిర్బంధాలు.. దాడులు

## ఢిల్లీలో కొనసాగిన సమరం

● ఆదివారం కూడా నిరసన ప్రదర్శనలు
● ఆందోళనకారుల దుస్తులు పట్టి ఈడ్చుకెళ్లి వాహనాల్లో కుక్కిన పోలీసులు ● జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష, విద్యార్థి, యువజన సంఘాలు నినాదాల హోరు
● కన్నాట్ ప్లేస్ వద్ద సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా, సిపిఐ(ఎం) రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ● 200 మందికి పైగా ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఐసా విద్యార్థి నేతల అరెస్టు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో గత నాలుగైదు రోజుల నుంచి ప్రతిపక్షాలు, యువన, విద్యార్థి సంఘాల నిరసన ప్రదర్శనలతో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఆదివారం కూడా మరోసారి రాజధాని టెన్షన్ టెన్షన్‌గా మారింది. భద్రతా వలయంలో ఉండిపోయింది. ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఐసా, కెవైఎస్, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) మద్దతుదారులు నిరసన చేపట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో నిరసనకారులపై ఖాకీలు అమానుషంగా ప్రవర్తించారు. దుస్తులు పట్టి ఈడ్చుకెళ్లి బస్సుల్లో కుక్కారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. అయినా అదరకుండా, బెదరకుండా జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని నినాదాలను మారుమ్రోగించారు. ఖాకీల చర్యను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. బెదిరింపులకు భయపడేది లేదని హెచ్చరించాయి. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ తన పదవినుంచి తప్పుకునేవరకు ఆందోళనలు ఆగవని సిజెపి ఇప్పటికే స్పష్టం చేసింది. శనివారం ఢిల్లీలో తలపెట్టిన జంతర్‌మంతర్ ఆందోళనను ప్రభుత్వం భగ్నం చేసిన నేపథ్యంలో ఆదివారం కూడా నిరసనలు కొనసాగించనున్నట్లు సిజెపి ప్రకటించింది. పోలీసుల నిర్బంధాలు, ఆంక్షలు ఉన్నప్పటికీ వెనక్కి తగ్గేది లేదని స్పష్టంచేసింది. ఉదయం 10 గంటలకు జంతర్ మంతర్ వద్ద భారీ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే జంతర్ మంతర్ వైపు ర్యాలీగా బయలుదేరిన 200 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పలువురిని బలవంతంగా బస్సుల్లోకి లాక్కెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. రాజధానిలోని వివిధ ప్రాంతాల నుంచి జంతర్ మంతర్ వైపు ర్యాలీగా చేయడానికి ప్రయత్నించిన పలు విద్యార్థి సంఘాల సభ్యులతో పాటు సిజెపి మద్దతుదారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కన్నాట్ ప్లేస్‌లోని జంతర్ మంతర్ వైపు వెళ్తుండగా, వందలాది మంది ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ కార్యకర్తలతో పాటు ఎఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జిందర్ మహేశరి, ఎఐవైఎఫ్ అధ్యక్షుడు రౌషన్ కుమార్ సిన్హా, తరువాయి 8లో







**ఖాకీల వలయంలోనే ఢిల్లీ**



### అన్నీ రాజా, జాన్ బ్రిట్టాస్‌పై దాష్టీకం

ఎన్నికల సంఘం వివాదాస్పద ఓటర్ల జాబితా సవరణ (సర్)కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కఠినంగా వ్యవహరించడంతో సెంట్రల్ ఢిల్లీ యుద్ధభూమిగా మారింది. జంతర్‌మంతర్‌కు ర్యాలీగా బయలుదేరిన సిపిఐ, సిపిఐ(ఎం), ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులను కన్నాట్ ప్లేస్‌లో అదుపులోకి తీసుకున్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీ రాజాను కన్నాట్ ప్లేస్ ఇన్నర్ సర్కిల్‌లో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. భారీగా ఓటర్ల తొలగింపును వ్యతిరేకిస్తున్న విద్యార్థులకు మద్దతుగా నిరసనలో చేరిన అన్నీ రాజాను, పలువురు మహిళా కార్యకర్తలతో పాటు బలవంతంగా ఒక పోలీసు బస్సులోకి ఎక్కించారు. ఈ క్రమంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గుంపులను చెదరగొట్టడానికి అధికారులు రాజీవ్ చౌక్ చుట్టూ రోడ్లను మూసివేయగా, ఎన్నికల సంఘం ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తోందని ఆరోపిస్తూ నిరసనకారులు నినాదాలు చేశారు. ఢిల్లీలో కొనసాగుతున్న అణచివేత మధ్య విద్యార్థులను కలవడానికి వచ్చిన రాజ్యసభ ఎంపి డాక్టర్ జాన్ బ్రిట్టాస్‌ను, మీడియాతో మాట్లాడుతున్న సమయంలో పోలీసు సిబ్బంది తోసివేసి, పట్టుకుని, దాడి చేశారు. ఆ తర్వాత ఆయనను రోడ్డు పక్కన పడేసి వెళ్లారు. మాట్లాడుతున్న సమయంలో, అధికారులు ఆయనను తోసివేసి, బట్టలు పట్టుకుని, అదుపులోకి తీసుకుని, పోలీసు వాహనంలోకి బలవంతంగా ఎక్కించారని స్థానికులు ఆరోపించారు. సిట్టింగ్ పార్లమెంట్ సభ్యుడి పట్ల ఈ దురుసు ప్రవర్తన ప్రతిపక్ష నాయకులలో తక్షణ ఆగ్రహాన్ని రేకెత్తించింది. వారు ఈ పోలీసు చర్యను ప్రజాస్వామ్య హక్కులపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించారు.

**నిర్బంధాలకు భయపడేది లేదు**
ఇంతటి కర్కశత్వాన్ని ఎన్నడూ చూడలేదు : డి.రాజా
దేశమొత్తం జంతర్‌మంతర్ కాగలదు : సందోశ్‌కుమార్ 07

**యువతపై పోలీస్ జులుం** 07

## ‘ఓట్ చోరీ’పై నేడు సిజెఐని కలుస్తాం

● సాయంత్రం 4-5 గంటల మధ్య సమయం కోరాం
● నాతో పాటు రాహుల్‌గాంధీ కూడా వస్తారు
● ఇప్పటికే సిజెఐకి ఇద్దరమూ లేఖలు రాశాం : ఖర్గే



**న్యూఢిల్లీ :** ‘ఓట్ల చోరీ’ వ్యవహారంలో జోక్యం కోరుతూ, సోమవారం సాయంత్రం 4 నుండి 5 గంటల మధ్య భారత ప్రధాన న్యాయమూర్తిని (సిజెఐ) కలవడానికి తాను, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సమయం ఖరారు చేసుకున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఆదివారం బెంగళూరులో ఖర్గే విలేకరులతో మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా దేశవ్యాప్తంగా అరాచకాన్ని సృష్టించారని ఆరోపించారు. శనివారం జరిగిన తరువాయి 8లో

**ప్రతిఘటన కాదు... హక్కుల పోరాటం**

● నేడు ఢిల్లీలో కాంగ్రెస్, ఇండియా కూటమి, యువజన సంఘాలు నిరసన ప్రదర్శనలు ● ఇది రెండవ స్వాతంత్ర్య పోరాటం : కెసి వేణుగోపాల్ 07

## బతికేదెలా?

నింగికి చేరిన నిత్యావసరాలు - ప్రతికూల వాతావరణంతో ప్రబలుతున్న వ్యాధులు

ప్రజాపక్షం/ఖమ్మం

భిన్న పరిస్థితుల మధ్య పేద, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడింది. పాలకుల వైఫల్యం సానుకూలంగా లేని ప్రకృతి నడుమ ఈ పరిస్థితి దాపురించింది. పాలకులు పేద, సామాన్య ప్రజలను వదిలి సంపన్నుల కొమ్ము కాస్తున్న వేళ ప్రకృతి సైతం ప్రజలపై తన ప్రకోపాన్ని ప్రదర్శిస్తుంది. పాలకులు ధరలను అదుపుచేయలేని కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు నింగిని తాకుతున్నాయి. మునుపెన్నడు లేనంతగా పెరిగిన ధరలు సామాన్య జనజీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అది ఇది అనే తేడా లేకుండా అన్నింటి ధరలు విపరీతంగా పెరిగాయి. ఏ వస్తువు ధర చూసినా గడిచిన ఏడాది కాలంలో పెరిగిందే తప్ప నిలకడగా ఉండడం లేదా తగ్గడం జరగలేదు. ఉదాహరణకు చూస్తుండగానే బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. ఇటీవల వరకు క్వింటా ఆరున్నర వేలు పలికిన బియ్యం ధర ఇప్పుడు ఎనిమిది వేల నుంచి ఎనిమిదిన్నర వేలకు చేరుకుంది. ధాన్యం ధర పెరుగుతుండటం వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి సాగు తగ్గిపోవడంతో వ్యాపారులు ముందే బియ్యం ధరలను పెంచేశారు. ఈ ఏడాది క్వింటా బియ్యం ధర పదివేలు దాటే అవకాశం ఉందన్న భావన కలుగుతుంది. పప్పు, ఉప్పు, నూనెల ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. సంచుల్లో డబ్బులు తరువాయి 8లో



### వేసవిని తలపించేలా మండుతున్న ఎండలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో వేసవి కాలాన్ని తలపించేలా ఎండలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. గాలిలో తేమ శాతం గణనీయంగా పడిపోవడంతో వేడి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా పగటి పూట వాతావరణం నిప్పుల కొలిమిలా మారుతుండగా, తరువాయి 8లో

## రియాద్ విమానాశ్రయంపై హౌతీల దాడి

**12 మంది మృతి**

● 309 మందికి గాయాలు : కొందరి పరిస్థితి ప్రమాదకరం ● ఐక్యరాజ్యసమితి సహా భారత్, ఖతార్, బ్రిటన్, ఇయు ఖండన
● సౌదీకి అండగా హౌతీలపై యుద్ధానికి ట్రంప్ యోచన



**రియాద్ :** సౌదీ అరేబియా విమానాశ్రయంపై హౌతీలు శనివారం రాత్రి పొద్దుపోయాక చేసిన దాడిలో వివిధ దేశాలకు చెందిన 12 మంది ప్రయాణికులు మరణించారు. మరో 309 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది.మరణించినవారిలో ఒక అమెరికా పౌరుడుతోపాటు ఈజిప్ట్,జోర్డాన్,సిరియా,పాలస్తినాలకు చెందిన పౌరులు ఉన్నారు. ఈ దాడులు,బాంబు పేలుళ్ళతో రియాద్ విమానాశ్రయ గగనతలం దట్టమైన పొగలతో నిండిపోయింది. రాజధాని నగరంలోని ఆసుపత్రులు క్షతగాత్రులతో నిండిపోయాయి.ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్‌పై అమెరికా యుద్ధం ప్రారంభమైన తర్వాత గల్ఫ్‌లోని ఒక అరబ్ దేశంపై జరిగిన అత్యంత ఘోరమైన దాడి ఇదే.సౌదీ సంకీర్ణ యుద్ధ కూటమి దీనిని యుద్ధనేరంగా పేర్కొంది.కాగా ప్రపంచంలోనే తరువాయి 8లో



## ఓటు కోల్పోయిన బాధితులను తీసుకొస్తా

తేదీ, సమయం చెప్పండి

రాంచందర్‌రావుకు మంత్రి పొన్నం సవాల్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఓటు హక్కు కోల్పోయిన బాధితులను ఆధారాలతో సహా తీసుకొస్తానని, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తేదీ, సమయం ప్రకటించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఓట్ల తొలగింపుపై జరుగుతున్న ఆందోళనలను తప్పుబట్టడం కాకుండా, బాధితుల సమస్యలను పరిశీలించి న్యాయం చేయాలని సూచించారు. ఓటు హక్కు కోల్పోయినవారు ఎవరైనా ఉన్నారా తరువాయి 12లో

## నేపాల్ గోర్ఖా జిల్లాలో మెరుపు వరదలు

కొట్టుకుపోయిన ఇళ్లు, వంతెనలు : 10 మంది గల్లంతు



08



## డ్రగ్స్ అడ్డా గోవా

రాష్ట్రంలో నషా ముక్త్ భారత్ నినాదం వర్తించదా?
‘గోయ్ రాఖోన్ యాత్ర’లో నిలదీసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపి పాలనలో గోవా యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చారని, గోవాను ‘డ్రగ్స్ సోర్స్’గా మారిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నషా ముక్త్ భారత్ అని మాట్లాడుతున్న ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఇక్కడ ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ‘గోవా భూములు, పర్యావరణం, సంస్కృతి, వారసత్వం, స్థానిక గుర్తింపును కాపాడుకునే ప్రధాన ఉద్దేశం, బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకు’ కాంగ్రెస్ గోవా విభాగం ‘గోయ్ రాఖోన్ యాత్ర’ చేపట్టింది. ఈ యాత్రలో భాగంగా ఆదివారం జరిగిన గోవా బహిరంగ సభలో సిఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ఇది రావణ్, రాముడికి మధ్య జరుగుతున్న పోరాటమని, రావణ్ అంటే బిజెపి,రాముడు అంటే కాంగ్రెస్ పార్టీ అని, రావణ్‌ను ఓడించాలంటే ‘మీరంతా’ రాముడికి మద్దతుగా నిలబడాలని కోరారు. రెండుసార్లు గోవా ప్రజలు మోసపోయారని, మూడోసారి బిజెపిని నమ్మి మోసపోవద్దని సూచించారు. గోవాను డ్రగ్స్ పెడ్లర్స్ అడ్డాగా మార్చారని, ఇది గోవాకు కీర్తిని తెచ్చి పెడుతుందా? గోవా పేరును చెడగొడుతుందా? తరువాయి 12లో

## రూ.8.98 కోట్ల బంగారం పట్టివేత!

కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా – ఇద్దరి అరెస్టు 03

### కవిత్వపు హద్దులు చెరిపిన

# అసాధారణ కలం 'అన్నే కార్సన్'

సమకాలీన ప్రపంచ సాహిత్యంలో కొన్ని పేర్లు ఒక ప్రక్రియకు, ఒక శైలికి, ఒక సాహిత్య ఉద్యమానికి మాత్రమే పరిమితం కావు. అదే చట్రంలో ఇరుక్కోవు. అవి సాహిత్య ప్రక్రియల మధ్య ఉన్న గోడలనే కూల్చివేస్తాయి. కెనడాకు చెందిన కవి, వ్యాసకర్త, క్లాసిక్స్ అధ్యాపకురాలు, అనువాదకురాలు అన్నే కార్సన్ అలాంటి అరుదైన సాహిత్య వ్యక్తిత్వం. కవిత్వం, గద్యరచన, వ్యాసం, నాటకం, అనువాదం, లిబ్రెట్టో, విమర్శ వంటి ఏ రూపంలో రచన చేసినా, దానిని మరో రూపంతో కలిపి కొత్త సాహిత్య అనుభవాన్ని సృష్టించడం ఆమె ప్రత్యేకత. 'న్యూయార్క్ టైమ్స్'లో ఒక పుస్తక సమీక్షలో డాఫ్నీ మెర్కిన్ ఒకసారి కార్సన్ గురించి రాస్తూ, సమకాలీన కవిత్వాన్ని గమనించే చిన్న ప్రపంచంలో ఆమె అసూయనూ, అభిమానాన్నీ ఏకకాలంలో రేకెత్తించేంత ప్రభావాన్ని చూపుతున్నారని ప్రశంసించాడు. కార్సన్ రచనలకు విమర్శకుల ప్రశంసలతో పాటు విస్తృత పాఠకాదరణ కూడా లభించింది. ఆమె రచనా ప్రపంచాన్ని ఒకే సాహిత్య ప్రక్రియలో బంధించడం దాదాపు అసాధ్యం. ఈ విశిష్ట సాహితీ సృష్టి ఆమెకు ఈ ఏడాది ప్రతిష్టాత్మకమైన నోబెల్ శాంతి బహుమతిని అందించింది. సాఫో, యూరిపిడిస్ వంటి ప్రాచీన గ్రీకు రచయితల అనువాదాల నుంచి 'యాన్ అరెస్టియా' వంటి ప్రయోగాత్మక రచనల వరకు ఆమె ప్రయాణం విస్తరించింది. ప్రేమ, ఆకాంక్ష, శారీరక కోరిక, విరహం, నిరాశ, హృదయవేదన తదితర అంశాలు ఆమె కవిత్వంలో ప్రధానంగా కనిపిస్తాయి. అదే సమయంలో ఆమె రచనల్లో పాండిత్యం, చరిత్ర, పురాణం, తత్వశాస్త్రం కూడా సమాన స్థాయిలో ప్రవహిస్తాయి. 1950, జూన్ 21వ తేదీన, కెనడాలోని టొరంటోలో జన్మించిన కార్సన్‌కు ప్రాచీన గ్రీకు సాహిత్యంతో పరిచయం యాదృచ్ఛికంగానే ఏర్పడింది. పాఠశాల రోజుల్లో లాటిన్ బోధించే ఒక ఉపాధ్యాయుడు భోజన విరామ సమయంలో ఆమెకు ప్రాచీన గ్రీకు భాష నేర్పడానికి ముందుకు రావడం ఆమె జీవితాన్ని మలుపుతిప్పింది. ఆ పరిచయం క్రమంగా గ్రీకు, హెల్లెనిక్ సాహిత్యంపై జీవితాంతం కొనసాగే మక్కువగా మారింది. టొరంటో విశ్వవిద్యాలయంలో చదువుకున్న కార్సన్, రెండుసార్లు చదువు మధ్యలో ఆపేసినా చివరకు క్లాసిక్స్‌లో బిఎ, ఎంపి తదుపరి పిహెచ్‌డి పూర్తి చేసింది. అనంతరం, అమెరికా, కెనడాల్లోని అనేక విశ్వవిద్యాలయాల్లో, బోధనా విభాగంలో పని చేసింది. మెక్గిల్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో ఆమె అధ్యాపకురాలిగా సేవలు అందించింది. 1986లో వెలువడిన 'ఎరోస్ ది బిట్టర్‌స్వీట్: యాన్ ఎస్సే' ఆమె సాహిత్య జీవితానికి బలమైన ప్రారంభం. ప్రేమ, ఆకర్షణ, దూరం వంటి భావాలను ప్రాచీన గ్రీకు సాహిత్యంతో అనుసంధానిస్తూ ఆమె రాసిన ఈ గ్రంథం, కార్సన్ ప్రత్యేకమైన రచనా శైలికి పునాది వేసింది. ఆమె తర్వాతి రచనలు 'గ్లాస్, ఐరనీ అండ్ గాడ్', 'ప్లెయిన్ వాటర్', 'మెన్ ఇన్ ది ఆఫ్ అవర్స్' ఆమెను సమకాలీన కవిత్వంలో ఎవరికీ సరితూగని స్వరంగా నిలబెట్టాయి. అయితే కార్సన్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన రచనల్లో 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్' ఒకటి. 1998లో వెలువడిన ఈ కవితాత్మక గ్రంథం ప్రాచీన గ్రీకు పురాణాన్ని ఆధునిక జీవితంలోకి తీసుకొచ్చింది. హెరాక్లెస్ పది కార్యాల్లో ఒకటైన ఎర్రని రెక్కల రాక్షసుడు గెర్యాన్‌ను సంహరించే కథను కార్సన్ పూర్తిగా కొత్త కోణంలో పునర్నిర్మించింది. పురాణంలో హెరాక్లెస్ గెర్యాన్‌ను చంపి అతని ఎర్ర పశువులను దోచుకుంటాడు. కార్సన్ రచనలో మాత్రం కథ శరీర హింస నుంచి భావోద్వేగ హింస వైపు మళ్లుతుందిహెరాక్లెస్ గెర్యాన్ హృదయాన్ని, అతని అమాయకత్వాన్ని దోచుకుంటాడు. ఇద్దరూ కౌమార దశలో కలుసుకుంటారు. రెక్కలతో, ఎర్రని శరీరంతో ఉండే సున్నితమైన గెర్యాన్‌కు విరుద్ధంగా హెరాక్లెస్ తిరుగుబాటు స్వభావం కలిగిన ఆకర్షణీయ యువకుడు. వారి ప్రేమ చివరకు గెర్యాన్‌కు తీవ్రమైన హృదయవేదనగా మారుతుంది. కొన్నేళ్ల తరువాత బ్యూనస్ ఎయిర్స్‌లో వారి పునఃసందర్శనం కథను మరో సంక్లిష్టమైన దిశలోకి తీసుకెళ్తుంది. ప్రేమ, అసూయ, ఆకాంక్ష, స్వాధీనతమానవ సంబంధాల్లోని అంతర్గత సంఘర్షణలను కార్సన్ పురాణపు ప్రతీకలతో మేళవించింది. విమర్శకుడు బ్రూస్ హైన్లీ ఆమెను 'హృదయవేదనకు తాత్వికురాలు'గా అభివర్ణించడం ఈ రచన స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. 'కవిత్వం అంటే తప్పనిసరిగా ఛందస్సు, ప్రాస, నిర్దిష్ట పంక్తి నిర్మాణం ఉండాలి' అనే సంప్రదాయ భావనను ఆమె ప్రశ్నించడం ప్రశ్నించడం కార్సన్ రచనల్లో కనిపించే మరో ముఖ్యమైన లక్షణం.'ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్'ను కవితా నవలగా పిలిచినా, దాని భాష గద్యానికి దగ్గరగా ఉంటుందని కొందరు విమర్శకులు అభిప్రాయపడ్డారు. అయితే అదే అస్పష్టత కార్సన్ సాహిత్య ప్రయోగానికి కేంద్రబిందువుగా మారింది. ఆమెకు ప్రక్రియ కంటే భావం, రూపం కంటే అనుభవం ముఖ్యం. 2001లో వచ్చిన 'మెన్ ఇన్ ది ఆఫీస్ అవర్స్' కాలం, జీవితం, లైంగికత, ప్రేమ, మరణం వంటి అంశాలను విభిన్న రూపాల్లో పరిశీలించింది. ఎపిటాఫ్లు, ప్రేమకవితలు, వ్యాసాత్మక కవితలు, జ్ఞాపక గద్యాలు, చిత్రాలను ఉద్దేశించి రాసిన కవితలుఅన్నీ ఒకే పుస్తకంలో సహజీవనం చేశాయి. అదే ఏడాది వెలువడిన 'ది బ్యూటీ ఆఫ్ ది హస్బెండ్' వివాహబంధం విచ్ఛిన్నమవుతున్న సందర్భంలో కోరిక, ద్రోహం, దాంపత్య విరక్తిని పరిశీలించింది. 29 'టాంగోలు'గా నిర్మించిన ఈ రచనకు ప్రతిష్ఠాత్మక టిఎస్ ఇలియట్ అవార్డు లభించింది. 2005లో వచ్చిన 'డీక్రియేషన్'లో కార్సన్ సాహిత్యం, తత్వశాస్త్రం, ఆధ్యాత్మికతలను మరింత దగ్గర చేసింది. తత్వవేత్త సిమోన్ వెయిల్ ఆలోచనల నుంచి తీసుకున్న 'డీక్రియేషన్' భావనమనలోని 'నేను'ను కరిగించి, స్వీయకేంద్రిత అస్తిత్వాన్ని అధిగమించడంఈ రచనకు ఆధారం. విమర్శకుల దృష్టిలో ఇది సమకాలీన సాహిత్యంలో అత్యంత ప్రత్యేకమైన మేధస్సు పనిచేస్తున్న తీరుకు ఉదాహరణ. ప్రాచీన గ్రీకు నాటకాల అనువాదకురాలిగా కూడా కార్సన్ తన ప్రత్యేకతను చాటుకుంది. 'గ్రీఫ్ లెస్సెన్స్'లో యూరిపిడిస్‌కు చెందిన నాలుగు విషాద నాటకాలను ఆమె కొత్త భాషలో పరిచయం చేసింది. 2009లో వెలువడిన 'యాన్ అరెస్టియా'లో, 'అగమెమ్‌నన్' (ఎస్కిలస్), 'ఎలెక్ట్రా' (సోఫోక్లిస్), 'అరెస్టెస్' (యూరిపిడిస్) గ్రంథాలను ఒకే సమాహారంగా మలిచింది. ఈ అనువాదాల్లో ఆమె స్వేచ్ఛా ప్రయోగాలు కొంత విమర్శకు గురైనప్పటికీ, ప్రాచీన నాటకాలను ఆధునిక పాఠకుడికి చేరువ చేయడంలో ఆమె ప్రయత్నం విశేషమైనది. కార్సన్‌కు గుగ్గెన్‌హైమ్ ఫౌండేషన్, మాక్ఆర్థర్ ఫౌండేషన అమెరికన్ అకాడెమీ ఇన్ బెర్లిన్ వంటి సంస్థల ఫెలోషిప్‌లు లభించాయి. లానన్ లిటరరీ అవార్డు, పుష్కార్ట్ ప్రైజ్, గ్రిఫిన్ పోయెట్రీ ప్రైజ్ వంటి అనేక ప్రతిష్టాత్మక పురస్కారాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. 'నాక్స్', 'రెడ్‌డాక్', 'ఫ్లోట్' వంటి రచనలను కూడా ఆమె సాహిత్య ప్రయోగాలకు కొనసాగింపుగానే చూడాలి. తాజాగా నోబెల్ బహుమతి లభించడం ఆమె కీర్తి కిరీటంలో మరో కలికితురాయి. అయితే కార్సన్‌ను అర్థం చేసుకోవడానికి ఆమె పురస్కారాల జాబితా సరిపోదు. ఒకసారి కవివిమర్శకురాలు స్టెఫానీ బర్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తనను తాను మాటల కంటే దృశ్యాలను ఇష్టపడే కళాకారిణిగా కార్సన్ పేర్కొంది. చిన్నతనంలో తాను ఎక్కువగా చిత్రాలు గీసేదాన్నని, తనను తాను రచయిత్రిగా ఎప్పుడూ ఊహించుకోలేదని ఆమె చెప్పడం విశేషం. బహుశా ఇదే కార్సన్ సాహిత్య రహస్యం. రచన అనేది ఆమెకు ఆలోచనలను, అనుభవాలను, చిత్రాలను, భాషను ఒకచోట ఉంచే ఒక సాధనం. కవిత్వం ఎక్కడ ముగుస్తుంది? గద్యం ఎక్కడ మొదలవుతుంది? పురాణం ఎక్కడ ముగిసి, ఆధునిక జీవితం ఎక్కడ ప్రారంభమవుతుంది? ప్రేమ ఎప్పుడు ఆనందం నుంచి బాధగా మారుతుంది? వ్యక్తి తన 'నేను'ను దాటి వెళ్లగలడా? వంటి అనేకానేక ప్రశ్నలను ఒక వైపు సంధిస్తూనే, ఆమె రచనలు సులభమైన సమాధానాలను మాత్రం ఇవ్వవు. బదులుగా, ఆ ప్రశ్నలతోనే పాఠకుడిని ఒంటరిగా వదిలేస్తాయి. అదే ఆమె సాహిత్య శక్తి. ఇప్పటి ప్రపంచ సాహిత్యంలో ప్రక్రియల సరిహద్దులు వేగంగా చెదిరిపోతున్న తరుణంలో కార్సన్ రచనలు మరింత ప్రాసంగికతను సంతరించుకున్నాయి. సాహిత్యానికి నిర్వచనాలు అవసరం కావచ్చుగానీ, గొప్ప సాహిత్యానికి సరిహద్దులు అవసరం లేదని ఆమె రచనలు స్పష్టం చేస్తున్నాయి.

\- సత్యశ్రీ





జీన్ పాల్ సాత్రే

> అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ బహుమతిని తిరస్కరించిన వారు కూడా లేకపోలేదు. 1958లో సాహిత్య నోబెల్ బహుమతి గ్రహీత బొరిస్ పాస్టెర్‌నాక్ తొలుత బహుమతిని అంగీకరించాడు. కానీ, తరువాత తన దేశం (నాటి సోవియట్ యూనియన్) అధికారుల ఒత్తిడి కారణంగా బహుమతిని తిరస్కరించాల్సి వచ్చింది. కాగా, అన్ని అధికారిక గౌరవాలను నిరంతరం తిరస్కరిస్తూ వచ్చినందున జీన్ పాల్ సాత్రే 1964 సాహిత్య నోబెల్ బహుమతిని కూడా తిరస్కరించాడు.

సాహిత్యంలో నోబెల్ పొందిన అత్యంత పిన్న వయస్కుడిగా రుడ్యార్డ్ కిప్లింగ్ పేరిట రికార్డు ఉంది. 1907లో ఈ బహుమతిని అందుకున్నప్పుడు అతని వయసు 41 సంవత్సరాలు. సృష్టిలో కనిపించే పరిశీలనా శక్తి, ఊహాశక్తి వైవిధ్యం, ఆలోచనల ఉత్సాహం, అసాధారణ కథన ప్రతిభకు గుర్తింపుగా అతనికి ఈ బహుమతి దక్కింది. కాగా, ఎక్కువ వయసులో అవార్డు అందుకున్న ఘనత డోరిస్ లెస్సింగ్ దక్కించుకుంది. 2007లో అవార్డును స్వీకరించినప్పుడు ఆమె వయసు 87 సంవత్సరాలు స్త్రీ అనుభవాలను మహాకావ్య స్థాయిలో చిత్రించిన రచయిత్రిగా, సందేహవాదం, అగ్ని వంటి తీవ్రతగల విభజిత నాగరికతను దూరదృష్టితో పరిశీలించినందుకుగాను ఆమె ఈ పురస్కారానికి ఎంపికైంది. సాహిత్యంలో ఇంత వరకు 18 మంది మహిళలకు నోబెల్ బహుమతి లభించింది. ఈ బహుమతి అందుకున్న తొలి మహిళ సెల్మా లాగెర్ఫ్ (1858–1940). స్వీడన్‌కు చెందిన ఆమెకు 1909లో నోబెల్ సాహిత్య పురస్కారం దక్కింది. సాహిత్యంలో నోబెల్ బహుమతి గ్రహీతలను ఎంపిక చేసే సంస్థ 'స్వీడిష్ అకాడమీ'కి ఎన్నిక కావడానికి ఐదు సంవత్సరాల ముందు , ఉన్నత ఆదర్శవాదం, సజీవమైన ఊహాశక్తి, ఆధ్యాత్మిక అవగాహనకు ప్రశంసగా ఆమెకు ఈ బహుమతి లభించింది.



రుడ్యార్డ్ కిప్లింగ్

## చదవాల్సిన పుస్తకం

### ప్రేమకు కొత్త భాష్యం

'ఎరోస్ ది బిట్టర్‌స్వీట్: యాన్ ఎస్సే' (1986)ను ఒక సాధారణంగా ప్రేమ కథ నుంచి ప్రేమలోని ఆనందం, బాధ, ఆకాంక్ష, దూరం, అసంపూర్ణత వంటి అనుభవాల వరకూ తీసుకెళుతుంది రచయిత్రి అన్నే కార్సన్. ఇది ప్రాచీన గ్రీకు సాహిత్యం, తత్వశాస్త్రం, మనస్తత్వశాస్త్రం ఆధారంగా పరిశీలించిన ఒక విశిష్టమైన మేధో రచన. ఇది ఆమె డాక్టరల్ థీసిస్ ఆధారంగా రూపొందింది. తరువాత 'మోడ్రన్ లైబ్రరీ' ఎంపిక చేసిన అత్యుత్తమ నాన్‌ఫిక్షన్ పుస్తకాల జాబితాలోనూ చోటు సంపాదించింది. కార్సన్ తన ఆలోచనలను ప్రాచీన గ్రీకు కవయిత్రి సాఫో దగ్గర నుంచి ప్రారంభిస్తుంది. సాఫో ప్రేమను గ్లుకుపిక్రోన్ అనే పదంతో అభివర్ణించింది. దాని అర్థం సుమారుగా తీపిచేదు. అంటే ప్రేమ ఒకేసారి ఆనందాన్ని, బాధను కలిగిస్తుంది. మనం కోరుకున్న వ్యక్తి గురించి ఆలోచించినప్పుడు కలిగే ఆనందంలోనే, అతను లేదా ఆమె మనకు పూర్తిగా అందుబాటులో లేరనే బాధ కూడా దాగి ఉంటుంది. ప్రేమ మనకు ఆనందాన్ని ఇస్తుందా, లేక మనకు దొరకనిదాన్ని కోరుకునే స్థితే ప్రేమా? అనే ప్రశ్నను లేవనెత్తుతుంది కార్సన్. అందుకు తామె చ్చిన సమాధానం రెండో వ్యాఖ్యకు దగ్గరగా ఉంటుంది. సాధారణంగా ప్రేమ అంటే ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధంగా మనం భావిస్తాం. అందులో ప్రేమించే వ్యక్తి, ప్రేమించబడే వ్యక్తి ఉంటారు. కానీ, కార్సన్ దృష్టిలో ప్రేమకు మూడో కోణం కూడా ఉంది. అది ఆ ఇద్దరి మధ్య ఉన్న దూరం లేదా ఖాళీ. ఈ దూరమే కోరికను సజీవంగా ఉంచుతుంది. ఒక వ్యక్తి పూర్తిగా మనకు లభించి, కోరికకు ఎలాంటి అడ్డంకీ లేకుండా పోతే, మనం కోరుకున్న అందుకోవడం పూర్తవుతుంది. అప్పుడు కోరిక స్వభావమే మారుతుంది. అందుకే కార్సన్ దృష్టిలో 'ఎరోస్' అనేది స్వాధీనం చేసుకోవడం కంటే, అందుకోవడానికి నిరంతరం ముందుకు సాగడం. 'లేకపోవడం' లేదా 'అందుబాటులో ఉండకపోవడం' అనే విషయానికి కార్సన్ దృష్టిలో అత్యంత ప్రాధాన్యత ఉంది. అంటే లోటు లేదా అసంపూర్ణత. మనకు ఇప్పటికే పూర్తిగా లభించిన దానిని మనం సాధారణంగా అదే తీవ్రతతో కోరుకోము. కోరికకు ఇంధనం ఇంకా దొరకలేదు అనే స్థితి. అందుకే 'ఎరోస్' అనేది ఒక స్థిరమైన భావోద్వేగం కాదు. అది ఒక చలన స్థితి. మనసు ఒక దిశగా పరుగెత్తడం, ఎదుటివారిని చేరుకోవాలని ప్రయత్నించడం, అర్థం కానిదాన్ని అర్థం చేసుకోవాలని తపించడంఇవన్నీ 'ఎరోస్'కు ఉన్న విస్తృత రూపాలే. ఈ భావనను కార్సన్ కేవలం ప్రేమకు మాత్రమే పరిమితం చేయలేదు. జ్ఞానం, సృజన, పఠనం వంటి మేధో ప్రక్రియలకు కూడా విస్తరింపచేస్తుంది. ఒక రచయిత అర్థాన్ని వెతుకుతాడు.. పాఠకుడు రచయిత ఆలోచనను అందుకోవడానికి ప్రయత్నిస్తాడు... అక్కడ కూడా ఒక దూరం ఉంటుంది. అది ప్రేమకు, పఠనానికి మధ్య సంబంధం. ఇదే కార్సన్ చేసిన అత్యంత ఆసక్తికరమైన చారిత్రక పరిశీలన. ప్రాచీన గ్రీకులు ప్రేమను ఇంత లోతుగా ఆలోచించడం, అదే సమయంలో వారు విస్తృతమైన లిఖిత సంస్కృతివైపు అడుగులు వేయడం యాదృచ్ఛికం కాదని ఆమె సూచిస్తుంది. అందుకే 'ఎరోస్ ది బిట్టర్‌స్వీట్: యాన్ ఎస్సే' ఒక గొప్ప క్లాసిక్ రచనగా నిలుస్తుంది.




## ఇప్పటి వరకూ 119 మంది...



ఆల్ఫ్రెడ్ నోబెల్ 1895 నవంబర్ 27న తన చివరి వీలునామా, ధ్రువీకరణపై సంతకం చేశాడు. తన సంపదలో అత్యధిక భాగాన్ని 'నోబెల్' పేరుతో పిలిచే పలు బహుమతులకు కేటాయించాడు. వీలునామాలో పేర్కొన్నట్లుగా, అందులో ఒక భాగం సాహిత్య రంగంలో ఆదర్శ దిశలో అత్యుత్తమ రచనను సృష్టించిన వ్యక్తికి ఇవ్వాలని నిర్ణయించారు. 1901 నుంచి 2026 వరకు సాహిత్యంలో 119 నోబెల్ బహుమతులను, 123 మందికి ప్రదానం చేశారు. 'పరిశీలనలో ఉన్న రచనల్లో ఏదీ మొదటి పేరాలో సూచించిన ప్రాముఖ్యతను కలిగి లేదని తేలితే, బహుమతి మొత్తాన్ని తదుపరి సంవత్సరం వరకు అలాగే ఉంచాలి. ఆ సమయంలో కూడా బహుమతిని ఇవ్వడం సాధ్యం కాకపోతే, ఆ మొత్తాన్ని ఫౌండేషన్ యొక్క పరిమిత నిధులకు జమ చేయాలి' అని నోబెల్ ఫౌండేషన్ నియమావళిలో స్పష్టంగా ఉంది. ఈ నిబంధన కింద, 1914, 1918, 1935, 1940, 1941, 1942 మరియు 1943 సంవత్సరాల్లో (మొత్తం ఏడు సందర్భాలలో) ఈ బహుమతి ఇవ్వలేదు. ఇతరత్రా రంగాల్లో ఇద్దరు లేదా అంతకు మించి వ్యక్తులకు నోబెల్ ప్రకటించడం కొత్తకాదు. కానీ, సాహిత్యంలో మాత్రం ఇలాంటి సందర్భాలు అరుదు. అందుకే, ఇప్పటి వరకూ కేవలం నాలుగు సందర్భాల్లో (1904, 1917, 1966 మరియు 1974) మాత్రమే నోబెల్ సాహిత్య బహుమతిని ఇద్దరేసి రచయితలకు సంయుక్తంగా ప్రదానం చేశారు. 1904లో, ఫ్రెడ్రిక్ మిస్ట్రాల్, జొస్ ఎచెగరే వై. ఇజగురే, 1917లో కార్ల్ అడాల్ఫ్ గెల్లెరప్, హెన్రిక్ పాంటొపిడాన్, 1966లో శామ్యూల్ యోసెఫ్ అగ్నాన్, నెల్లీ సాచ్, 1974లో హ్యారీ మార్టిన్‌సన్, యెవింద్ జాన్సన్ సాహిత్యంలో నోబెల్ బహుమతి పంచుకున్నారు.

> వివిధ రంగాల్లో ఒకసారి కంటే ఎక్కువ పర్యాయాలు నోబెల్ బహుమతి పొందిన వారు ఉన్నారు. కానీ, సాహిత్యంలో మాత్రం నోబెల్ బహుమతిని ఒకటి కంటే ఎక్కువసార్లు ఎవరూ పొందలేదు. సాహిత్యంలో కొంత మం దికి మరణానంతరం నోబెల్‌ను ప్రకటించారు. 1931లో ఎరిక్ యాక్సెల్ కార్ల్‌ఫెల్డ్‌కు నోబెల్ బహుమతి మరణానంతరం దక్కింది. 1961లో డ్యాగ్ హమ్మార్క్‌కు కూడా మరణానంతరం నోబెల్ శాంతి బహుమతి ప్రదానం జరిగింది. కాగా, 1974లో మార్చిన నిబంధనలను అనుసరించి, నోబెల్ బహుమతిని మరణానంతరం ప్రదానం చేయడానికి వీల్లేదు. అయితే, బహుమతి ప్రకటించిన తర్వాత వ్యక్తి మరణిస్తే ఈ నియమానికి మినహాయింపు ఉంటుంది.

సాహిత్యంలో నోబెల్ బహుమతి సాధారణంగా ఒక రచయిత జీవితకాల సాహిత్య కృషికి గుర్తింపుగా అందిస్తారు. అయితే తొమ్మిది మంది సాహిత్య బహుమతి గ్రహీతల విషయంలో, స్వీడిష్ అకాడమీ ఒక నిర్దిష్ట రచనను ప్రత్యేకంగా గుర్తించింది. మిఖాయిల్ అలెగ్జాండ్రోవిచ్ షొలోఖోవ్‌కు 1965లో సాహిత్యంలో నోబెల్ బహుమతి, రష్యన్ ప్రజల జీవితంలోని ఒక చారిత్రక దశను తన 'డాన్' మహాకావ్యంలో వ్యక్తీకరించిన కళాత్మక శక్తి, నిజాయితీకి గుర్తింపుగా లభించింది. ఎర్నెస్ట్ మిల్లర్ హెమింగ్వేకు 1954లో సాహిత్యంలో నోబెల్ బహుమతి, కథన కళపై ఆయనకున్న పట్టు, ముఖ్యంగా 'ది ఓల్ మాన్ అండ్ ది సీ'లో మరింత స్పష్టంగా కనిపించిన ప్రతిభకు, అలాగే సమకాలీన రచనా శైలిపై ఆయన చూపిన ప్రభావానికి లభించింది. రోజర్ మార్టిన్ డు గార్డ్‌కు 1937లో సాహిత్యంలో నోబెల్ బహుమతి, తన 'లెస్ థిబాల్ట్' నవలల పరంపరలో మానవ సంఘర్షణను, సమకాలీన జీవితంలోని కొన్ని ప్రాథమిక అంశాలను కళాత్మక శక్తి, నిజాయితీతో చిత్రించినందుకుగాను లభించింది. జాన్ గాల్సర్‌వర్తీకి 1932లో సాహిత్యంలో నోబెల్ బహుమతి, 'ది ఫోర్సైట్ సాగా'లో అత్యున్నత రూపాన్ని పొందిన ఆయన విశిష్ట కథన కళకు లభించింది. థామస్ మాన్‌కు 1929లో సాహిత్యంలో నోబెల్ బహుమతి, ఆయన గొప్ప నవల 'బుడెన్‌బ్రూక్స్' లభించింది. ఇది సమకాలీన సాహిత్యంలోని క్లాసిక్ రచనల్లో ఒకటిగా క్రమంగా మరింత గుర్తింపు పొందింది. వ్లాడిస్లావ్ స్టానిస్లావ్ రేమోంట్‌కు 1924లో సాహిత్యంలో నోబెల్ బహుమతి, ఆయన గొప్ప జాతీయ మహాకావ్యమైన 'ది పీజంట్స్'కు లభించింది. క్నూట్ పెడెర్సెన్ హామ్సన్‌కు 1920లో సాహిత్యంలో నోబెల్ బహుమతి, ఆయన మహత్తర రచన 'గ్రోత్ ఆఫ్ ది సాయిల్'కు దక్కింది. కార్ల్ ఫ్రెడ్రిక్ జార్జ్ స్పిట్టెలర్‌కు 1919లో సాహిత్యంలో నోబెల్ బహుమతి, ఆయన మహాకావ్యమైన 'ఒలింపియన్ స్ప్రింగ్'కు ప్రత్యేక గుర్తింపుగా లభించింది. క్రిస్టియన్ మాథియాస్ థియోడర్ మోమ్సెన్‌కు 1902లో సాహిత్యంలో నోబెల్ బహుమతి, చారిత్రక రచనా కళలో జీవించి ఉన్న వారిలో అత్యుత్తమ గురువుగా, ముఖ్యంగా ఆయన మహత్తర రచన 'ఎ హిస్టరీ ఆఫ్ రోమ్'కు ప్రత్యేక గుర్తింపుగా లభించింది.

## కలం పేర్లతో ప్రసిద్ధి చెందిన సాహిత్య బహుమతి గ్రహీతలు

| | |
|---|---|
| రెనే ఫ్రాంకోయిస్ ఆర్మాండ్ ప్రుధోమ్ | (కలం పేరు సల్లీ ప్రుధోమ్) |
| జాక్వెస్ అనటోల్ థిబాల్ట్ | (కలం పేరు అనతొలె ఫ్రాన్స్) |
| రేజ్మెంట్ | (కలం పేరు వ్లాడిస్లావ్ రేయ్మాంట్) |
| గ్రాజియా మడెసాని, నీ డెలెడ్డా | (కలం పేరు గ్రాజియా డెలెడ్డా) |
| పెర్ల్ వాల్ష్, నె సైడెన్‌స్ట్రికర్ | (కలం పేరు పెర్ల్ బక్) |
| లూసిలా గోడోయ్ వై అల్కయాగా | (కలం పేరు గాబ్రియేలా మిస్ట్రాల్) |
| అలెక్సిస్ లెజార్ | (కలం పేరు సెయింట్‌జాన్ పెర్స్) |
| జార్జోస్ సెఫెరియాడిస్ | (కలం పేరు జార్జోస్ సెఫెరిస్ |
| నెఫ్తాలీ రికార్డో రేయెస్ బసోఆల్తో | ( కలం పేరు పాబ్లో నెరూడా) |
| ఒడిసియస్ అలెపౌధెలిస్ | (కలం పేరు ఒడిసియస్ ఎలిటిస్) |
| గువాన్ మోయే | (కలం పేరు మో యాన్). |

## రాజకీయల్లో కాదు.. సాహిత్యంలో!



యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌కు 'నోబెల్ శాంతి' బహుమతి లభిస్తుందని అంతా అనుకున్నారు. కానీ, అత్యంత ఆశ్చర్యకరంగా, ఆయనకు 1953లో సాహిత్యంలో నోబెల్ బహుమతి లభించింది. 1945 నుంచి 1953 మధ్య చర్చిల్‌కు సాహిత్య బహుమతి ఇవ్వాలని 21 నామినేషన్లు వస్తే, నోబెల్ శాంతి బహుమతి కోసం వచ్చినవి కేవలం రెండు నామినేషన్లు.

ఈ వారం కవితలు

## తేటతెల్లం

ప్రసంగాల వరకే పరిమితం
ప్రజాస్వామ్యం అనే నినాదం
ప్రజలను దేవుళ్ళుగా కొలవడం
ప్రశ్నిస్తే లాఠీలతో మొత్తడం

'సర్' చిమ్ముతున్న విషం
బ్రతికుండగానే చంపడం
ఓటరు లంటే తృణప్రాయం
భోగ లాలసలే రాజ్య పాలనం

అధికారులు రాజులమని విర్రవీగడం
నాయకుల అండదండలేగా పుష్కలం
న్యాయం ధర్మం నీతి అరణ్యరోదనం
నియంతల పోకడే ఆధునిక మకుటం

తిరిగి జన్ జీల మరో పోరాటం
డిల్లీ జంతర్ మంతర్ లో కలకలం
సోయి కదలిక లేని నాయక యంత్రాంగం



గారికి కల్పించిన రక్షణే తేటతెల్లం

ఓటరు మహాశయులారా కనండి భారతదేశం
మానవత్వం మరచి ప్రాచీనుల కంటే కడు హీనం
ప్రేమగా నటిస్తూ గోతులు తీస్తూ ఆడేనాటకం
ఆకర్షణలకు. లొంగి శలభంగా మాడి పోతున్నాం

\- నమిలి కొండ నాగేశ్వర్ రావు
8688553470

## కొత్తదనం

కొత్తదనం ఉండాలి
కమ్మదనం ఇవ్వాలి,
కొత్త కోర్కెలు పుట్టాలి
కొత్త బాటలు వెతకాలి!
కొత్త మాటలు చెప్పాలి
కుతూహలం కలిగించాలి,
కొత్త రుచులు తగలాలి
కడుపులు నిండాలి!

కొత్త ఆలోచనలు పారాలి
కలం ముందుకు సాగాలి,
కొత్త భావాలు పుట్టాలి
కాగితాలు నిండాలి!
కొత్త కవులు రావాలి
కోకొల్లలుగా కవితలు రాయాలి,
కొత్త సంస్థలు రావాలి
కవి సమ్మేళనాలు నిర్వహించాలి!

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

## 'బడి'

బడి అంటే గోడల మధ్య జైలు కాదు,
ఆలోచనలకు ఆకాశం కావాలి.
బడి అంటే మార్కుల ఫ్యాక్టరీ కాదు,
కలను తీర్చిదిద్దే శిల్పశాల కావాలి.

బడి అంటే శోధనాలయం కావాలి,
బరువెక్కిన బ్యాగుల గోదాం కాకూడదు.
విద్యార్థి అంటే పరిశోధకుడు కావాలి,
ర్యాంకుల యంత్రం కాకూడదు.

గురువు అంటేదారి దీపం కావాలి,
సందేహాలు తీర్చే జెమిని కాకూడదు.
బడి గంట మోగేది జ్ఞానం కోసం కావాలి,
సైరన్ లా భయపెట్టడానికి కాదు.
పిల్లల నవ్వు వినిపించే చోటు బడి,
ఫీజుల రసీదులకు చోటు కాదు.

ఎం.రాంప్రదీప్
9492712836

## 'బొద్దింకలు' రోడ్డెక్కితే

బొద్దింకల బెడదకు
ముడుసుకుంటున్న ఛాతులు...
ప్రపంచంలో నియంతలందరూ
ఫోబియా గ్రస్తులంటుంటే విని
నమ్మలేకపోయాను కానీ
నీకున్న 'కట్సరిడాఫోబియా' చూస్తే
నమ్మకుండా ఉండలేకుంటున్నాము

తీరొక్క పూల తోట ఇది
లేత కుసుమాలు విచ్చుకుంటుంటే
చూసి మురిసిపోతావనుకున్న కానీ
ఇంతగా దడుసుకుంటావనుకోలే
కలువలనే చూసి చూసున్న నీ కనులకు
ఏ పువ్వులను చూసినా ఏవగింపు రావడం
మమ్మేమీ ఆశ్చర్య పరచలేదు కానీ

నీవు ఈ దేశపు భిన్న పూల తోటకు
ఏకైక తోటమాలివి కదా
పూవులను చిదిమేస్తున్నా కూడా
చలించకుండా నీవుంటున్నావు చూడు
అదే నీపైన మాకు తిరస్కృతికి కారణమవుతుంది
బొద్దింకలు రోడ్డెక్కితే నీవు
నీ అధికార కలుగులో దాక్కుంటున్నావు
గుంపుగా వాళ్ళు వీధుల్లో
ప్రశ్నల పెంట వదులుతుంటే

సమాధానాలతో నీవు సాపు చేస్తావనుకుంటే
సాటు సాటుకు తప్పించుకు
తిరుగుడేందుకు తనను తాను
బోనులో బంధించుకున్న పులి
గాండ్రింపులకు ఇన్నేళ్లు
జడుసుకున్నాము కానీ
బొద్దింకలొచ్చాక ఆ అరుపులన్నీ
భయంతో నీవు పిచ్చిగా కూసే కూతలని తేలింది
ఈ దేశ ప్రజాస్వామ్య దేహానికి!!
నీవెంతో ఘనమైన వాడివని
గణతంత్ర దేశపు ఘనతను
ప్రపంచ పటంలో వెలిగిస్తావనుకుంటే
ఖాకీల కాపలాతో ఇట్లా కాటకలుపుతావనుకోలే!
దిలీప్.వి 8464030808

# ఊరూవాడా బతుకమ్మ సంబరాలు

- ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మకు భారీ ఏర్పాట్లు!
- అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. నగరాలు, పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా ఊరూవాడా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటేలా ఏర్పాట్లు చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రత్యేక ఆకర్షణగా నిలిపేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థంగా నిర్వర్తించాలని, ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాలు విజయవంతమయ్యేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతి సంప్రదాయాలకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ పండుగ విశిష్టతను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఉత్సవాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రముఖులు, సినీ ప్రముఖులను భాగస్వాములను చేసి బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని, కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, వారసత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## రాజీనామా చేసే వరకూ పోరాడతాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓట్ల తొలగింపు అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం కొనసాగుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు రాహుల్ గాంధీ పోరాటం ఆపబోరని పేర్కొన్నారు. ఈ పోరాటంలో తాను కూడా భాగస్వామిని కావాలని ఢిల్లీకి వెళ్తున్నట్లు వెల్లడించారు. బిజెపి ఓట్లను తొలగించి తిరిగి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందన్నారు. దళితులు, ముస్లింలు, క్రైస్తవులకు చెందిన 13 కోట్ల ఓట్లు తొలగించారని విమర్శించారు. కొన్ని రాష్ట్రాల్లో బిజెపి దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రధాని మోదీ ఎన్నికల సంఘం, ఇడి, సిబిఐ వంటి సంస్థలను అడ్డుపెట్టుకొని పాలన కొనసాగిస్తున్నారని కోమటిరెడ్డి విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.

# విద్యారంగంలో ఎఐ విప్లవం

- బ్రిలియన్స్ ఎఐని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు
- ప్రశ్నాపత్రాల తయారీ నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం వరకు కృత్రిమ మేధస్సు సేవలు
- డేటా భద్రత, విద్యార్థుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యారంగంలో కృత్రిమ మేధస్సు (ఎఐ) సరికొత్త మార్పులకు నాంది పలుకుతోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు విద్యాసంస్థల నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో రూపొందించిన విద్యాసంస్థలకు ఉపయోగపడే ఎఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ సూట్ 'బ్రిలియన్స్ ఎఐ'ను బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో ఆయన ప్రారంభించారు. విద్యా కార్యకలాపాల్లో ఎఐ వినియోగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రూపొందించిన ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రశ్నాపత్రాల తయారీ, జవాబుపత్రాల మూల్యాంకనం వంటి కార్యకలాపాలను నిర్వహించవచ్చు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు టెక్స్ట్, వాయిస్ ఆధారిత సదుపాయాలు అందుబాటులో ఉండగా, విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని విశ్లేషించి తల్లిదండ్రులకు నివేదికలు అందించే సాంకేతికత కూడా ఇందులో పొందుపరిచారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విద్యారంగంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకమైన మార్పులు తీసుకొస్తోందని పేర్కొన్నారు. సంప్రదాయ విద్యా విధానాలకు ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు సాధన, అభ్యాసం కోసం ఎడ్యుటెక్ పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం సంతోషకరమని తెలిపారు. విద్యాసంస్థల్లో ఎదురవుతున్న సమస్యలకు ఆచరణాత్మకమైన సాంకేతిక పరిష్కారాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ఎడ్యుటెక్ 2025 సర్వే ప్రకారం విద్యా సాంకేతికతను ఉపయోగిస్తున్న పిల్లల్లో 77 శాతం మంది సాధన, అభ్యాసం కోసం దాన్ని వినియోగిస్తున్నారని మంత్రి ప్రస్తావించారు. ఎఐ ఆధారిత పరిష్కారాలు విద్యార్థుల అభ్యాస ప్రక్రియను మరింత మెరుగుపరిచే అవకాశముందని వివరించారు.

**డేటా భద్రతే కీలకం..**

సాంకేతిక పరిజ్ఞానం అందించే ప్రయోజనాలతో పాటు దాని వినియోగంలో ఎదురయ్యే సవాళ్లపైనా దృష్టి సారించాలని మంత్రి సూచించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనల నేపథ్యంలో డేటా భద్రత, సమాచార గోప్యతను కాపాడుకోవాల్సిన అవసరం మరింత ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. డిజిటల్ వ్యవస్థలను సురక్షితంగా నిర్వహించడం, సమాచారాన్ని బాధ్యతాయుతంగా వినియోగించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.డేటా సెంటర్ల ఏర్పాటు నుంచి డిజిటల్ వ్యవస్థల నిర్వహణ వరకు సమాచార భద్రత, గోప్యతకు పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. డేటా విశ్లేషణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని, అయితే వ్యక్తిగత సమాచారాన్ని రక్షించడంలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. ఎఐ సాధనాలు ఎంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నాయో నిరంతరం పరిశీలించాలని, వాటి వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని అన్నారు. విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే సాంకేతిక పరిష్కారాలను ప్రోత్సహిస్తూనే, డిజిటల్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. విద్యారంగంలో ఎఐ వినియోగం అభ్యాసాన్ని సులభతరం చేయడంతోపాటు విద్యాసంస్థల పనితీరును మెరుగుపరిచే దిశగా ఉపయోగపడాలని ఆకాంక్షించారు.



## తెలంగాణ భాషలోని మాధుర్యాన్ని భవిష్యత్ తరాలకు అందించే కృషి

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ భాష జీవభాష అని, తెలంగాణ భాషలో సృజించిన సాహిత్యం పండిత పామరులను ఒకే విధంగా ఆనందింపజేస్తోందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆ మాధుర్యాన్ని తరతరాలకు అందించేందుకు మరింత కృషి చేయాలన్నారు. 'సరస్వతీరాజ్ హరిదా అంతర్జాతీయ ఉత్తమ తెలంగాణ కథా పురస్కారం–2026' పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయం శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ భాషలోని సోయగాన్ని, పదబంధాలను, నుడికారాలను, సామెతలను కథల ద్వారా ముందు తరాలకు అందించడం మంచి ప్రయత్నమన్నారు. హరిదా రచయితల సంఘం అధ్యక్షులు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ భాష, సంస్కృతుల వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించే ఉద్దేశంతోనే ఈ అంతర్జాతీయ స్థాయి కథల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో టిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి రంగు నవీనాచారి, నాయకులు రూప్ సింగ్, శరత్ పాల్గొన్నారు.

# ఆర్‌టిసిలో ఇయు జెండా రెపరెపలు

- ఐదు వేల మెజారిటీతో రాష్ట్ర గుర్తింపు.. కార్మికుల ఐక్యతకు నిదర్శనం
- కార్మిక లోకానికి ఎస్.బాబు, ఈదురు వెంకన్న కృతజ్ఞతలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) ఘనవిజయం సాధించింది. జెఎసి కూటమి మద్దతుతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఐదు వేల ఓట్ల మెజారిటీతో ఇయు రాష్ట్ర గుర్తింపు సంఘంగా నిలిచింది. ఈ విజయంతో ఆర్‌టిసిలో కార్మిక సంఘాల ఐక్యత మరోసారి చాటిచెప్పినట్లయిందని ఇయు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న పేర్కొన్నారు. ఇయును గెలిపించిన కార్మిక లోకానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఇయు, టిఎంయు, ఎన్‌ఎంయు సంఘాలు జెఎసి కూటమిగా కలిసి పోటీ చేశాయి. టిఎంయు ఆదిలాబాద్, సికింద్రాబాద్, హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్ రీజియన్‌లలో స్థానిక గుర్తింపు కోసం భారీ మెజారిటీతో విజయం సాధించిందని తెలిపారు. మరో మిత్రపక్షమైన ఎన్‌ఎంయు ఖమ్మం, వరంగల్ రీజియన్‌లలో పోటీ చేసి ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చిందన్నారు. మిత్ర సంఘాల సమష్టి కృషి ఇయు రాష్ట్రస్థాయి విజయానికి దోహదపడిందని పేర్కొన్నారు.

**ప్రలోభాలకు లొంగని కార్మికులు..**

ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ మద్దతుతో పోటీ చేసిన టిడబ్ల్యుయు భారీగా ఖర్చు చేసి, హంగులు, ఆర్భాటాలతో ప్రచారం నిర్వహించిందని వారు విమర్శించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా కార్మికులను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, కార్మికులు వాటికి లొంగలేదని పేర్కొన్నారు. డబ్బు, అధికార బలంతో ఓట్లు సాధించవచ్చన్న భావనకు కార్మికులు తమ తీర్పుతో సమాధానం చెప్పారని వ్యాఖ్యానించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ బకాయిల సాధన, వేతన సవరణ, ఉద్యోగ భద్రత వంటి సమస్యల పరిష్కారం కోసం పోరాడే సంఘానికే కార్మికులు మద్దతుగా నిలిచారని తెలిపారు. ఈ విజయం కార్మికుల విజయమని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**కూటమి నేతలకు కృతజ్ఞతలు..**

ఇయు విజయానికి కృషి చేసిన జెఎసి కూటమి సంఘాల రాష్ట్ర, జోనల్, రీజినల్, డిపో స్థాయి నాయకులకు, కార్యకర్తలకు, మహిళా కార్మికులకు ఎస్. బాబు, ఈదురు వెంకన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎఐటియుసి నాయకులకు, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్మికుల ప్రయోజనాలే లక్ష్యంగా జెఎసి కూటమి ఐక్యంగా ముందుకు సాగుతుందని వారు పేర్కొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సిఎంకు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటి. రామారావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విజ్ఞప్తి చేశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉందని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంథేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో కళాశాల ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పనులను వేగవంతం చేయాలని, కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని సిఎంను కెటిఆర్ కోరారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు కళాశాల ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు.



## సింగరేణి నైపుణ్య శిక్షణ కేంద్రం నుంచి 112 మందికి ఉద్యోగాలు

- ఫాక్స్‌కాన్‌లో 87 మంది మహిళలకు అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్జీ–1 నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా 112 మందికి ఉద్యోగాలు లభించాయి. ఇందులో 87 మంది మహిళలు హైదరాబాద్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 25 మంది సోలార్ టెక్నీషియన్లుగా కొలువులు సాధించారు. ఫాక్స్‌కాన్‌కు ఎంపికైన మహిళల్లో తొలి విడతగా 55 మంది ఆదివారం గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. రామగుండం–1 ఏరియాలోని సింగరేణి జివిటిసి నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా ఇటీవల 154 మందికి ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 127 మంది మహిళలు ఫాక్స్‌కాన్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 87 మంది ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని కంపెనీ తయారీ కేంద్రంలో ఆపిల్ ఇయర్ పాడ్స్, ఎలక్ట్రానిక్ విడిభాగాల అసెంబ్లింగ్ విభాగాల్లో వీరు పనిచేయనున్నారు. మరోవైపు సోలార్ టెక్నీషియన్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలకు హాజరైన 27 మంది పురుష అభ్యర్థుల్లో 25 మంది ఎంపికయ్యారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో విధుల్లో చేరనున్నట్లు ఆర్జీ–1 జీఎం డి.లలిత్ కుమార్ తెలిపారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువత నైపుణ్యాలను పెంపొందించి, మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేయడమే లక్ష్యమని జీఎం డి.లలిత్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఒటు జిఎం ఎస్.కె.చంద్రశేఖర్, ఏఐటియూసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మద్దిఎల్లయ్య, టాస్క్ మేనేజర్ డాక్టర్ కౌసల్య, ఎల్ అండ్ ఎన్ డైరెక్టర్ కౌశల్, ఫాక్స్‌కాన్ హెచ్‌ఆర్ ప్రతినిధి ఆర్. శ్రీనివాస్, జివిటిసి మేనేజర్ మాధవరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## అరెస్టులతో ప్రజా ఉద్యమాలు అడ్డుకోలేరు

ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అరెస్టులు, పోలీసుల నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ స్పష్టం చేశారు. ఓటు చోరీ విధానానికి వ్యతిరేకంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆదివారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే అధికారం ఎవరికీ లేదన్నారు. ప్రధాని మోదీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ కలిసి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మోదీ నియంతృత్వ పాలన, పోలీసుల నిర్బంధాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని విమర్శించారు. ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం ప్రజల గొంతు నొక్కడమేనని, ప్రశ్నించే హక్కును అడ్డుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కలిసి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని బల్మూర్ వెంకట్ ఆరోపించారు. జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ఢిల్లీలో కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్య హక్కులు
# తెలంగాణలో బిజెపికి నిర్బంధాలా?

- కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఢిల్లీలో కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తూ, తెలంగాణలో మాత్రం బిజెపి నాయకులపై నిర్బంధాలు విధించడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నప్పటికీ, అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రతిపక్షాల పట్ల భిన్నంగా వ్యవహరిస్తోందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు నిరసనలు చేపట్టేందుకు పూర్తి స్వేచ్ఛ లభిస్తుండగా, తెలంగాణలో ప్రజా సమస్యలపై బిజెపి చేపట్టే కార్యక్రమాలకు అనుమతులు నిరాకరించడం, నాయకులను గృహనిర్బంధం చేయడం, అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన ఘనమైన చరిత్ర కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఢిల్లీలో కోరుతున్న ప్రజాస్వామ్య హక్కులను తెలంగాణలోనూ ప్రతిపక్షాలకు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

**దేశ రక్షణ, ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తున్న మోదీ**

ప్రధాని నరేంద్ర మోదీ దేశ రక్షణ, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా గన్‌ఫౌండ్రీలోని జిహెచ్‌ఎంసి కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను కిషన్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలను పరిశీలించిన ఆయన, చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ గత 25 ఏళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా దేశ సేవలో నిమగ్నమై ఉన్నారన్నారు. మోదీ క్రమశిక్షణ, పనితీరును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని తమ తమ రంగాల్లో సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతం రావు, మాజీ కార్పొరేటర్ బీష్వ సురేఖ ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

## రిజర్వేషన్లపై బాబు, పవన్ చిత్తశుద్ధి ఏదీ?

- 24 గంటల్లో 34 శాతం రిజర్వేషన్లు సాధించవచ్చు: జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల మేనిఫెస్టోలో బిసిలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ల హామీని అమలు చేయకుండా, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను తగ్గించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం బిసిలను మోసం చేస్తోందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బిసిలకు న్యాయం చేయాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవాలని, తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వేలాదిమందితో టిడిపి కేంద్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

హైదరాబాద్‌లోని బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యాలయంలో ఆదివారం బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. బిసిలే టిడిపికి వెన్నెముక అని చెబుతూనే, వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా రిజర్వేషన్లు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు, దానిని అమలు చేయలేకపోతే బిసిలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ప్రధాని మోదీతో సుదీర్ఘంగా సమావేశమైన చంద్రబాబు నాయుడు, బిసి రిజర్వేషన్ల అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని జాజుల ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్ల పెంపునకు న్యాయపోరాటం ఒక్కటే మార్గం కాదని, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించేలా కేంద్రం పై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే 24 గంటల్లోనే 34 శాతం రిజర్వేషన్ల సాధనకు మార్గం సుగమం చేయవచ్చని అన్నారు. ఈ సమావేశంలో బిసి జెఎసి నేతలు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్ కుర్మా, ఉప్పరి శేఖర్ సగరతో పాటు పలువురు బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రూ.8.98 కోట్ల బంగారం పట్టివేత!

- కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా
- విశాఖపట్నంలో డిఆర్‌ఐ అధికారుల ఛేజింగ్.. ఇద్దరి అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కారులో ప్రయాణిస్తున్న వారిని సాధారణంగా తనిఖీ చేసినా బయటపడని విధంగా ప్రత్యేకంగా రహస్య అరను ఏర్పాటు చేశారు. ఆ అరలో మూడు ప్యాకెట్లుగా 5.83 కిలోల విదేశీ బంగారాన్ని దాచిపెట్టి కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్‌ఐ) అధికారులు గుర్తించారు. విశాఖపట్నం సమీపంలో జాతీయ రహదారిపై సుదీర్ఘంగా కారును వెంబడించి పట్టుకున్న అధికారులు.. రూ.8.98 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో ఈ బంగారాన్ని భారత్–బంగ్లాదేశ్ సరిహద్దు మీదుగా అక్రమంగా దేశంలోకి తీసుకొచ్చినట్లు వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం మధ్య రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం అందడంతో డీఆర్‌ఐ విశాఖపట్నం విభాగం అధికారులు జాతీయ రహదారిపై నిఘా ఏర్పాటు చేశారు. కోల్‌కతా నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును గుర్తించి, కొంతదూరం వెంబడించిన అనంతరం అడ్డుకున్నారు. కారులో ఉన్న ఇద్దరిని ప్రశ్నించడంతోపాటు వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ముందు వైపు సహ ప్రయాణికుడి సీటు కాళ్లు పెట్టుకునే భాగం కింద ప్రత్యేకంగా తయారు చేసిన రహస్య అరను గుర్తించారు. అందులో దాచిన మూడు ప్యాకెట్లను బయటకు తీసి పరిశీలించగా, 5,832.90 గ్రాముల విదేశీ బంగారం లభ్యమైంది. ఇది 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 999 ఫైనెస్ బంగారమని, ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.8.98 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

**సరిహద్దు నుంచి హైదరాబాద్‌కు...**

భారత్–బంగ్లాదేశ్ సరిహద్దు ద్వారా అక్రమంగా దేశంలోకి తీసుకొచ్చిన బంగారాన్ని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు డీఆర్‌ఐ వర్గాలు తెలిపాయి. అయితే ఈ అక్రమ రవాణా వెనుక ఎవరున్నారు? బంగారాన్ని ఎక్కడి నుంచి సేకరించారు? హైదరాబాద్‌లో ఎవరికి అందజేయాల్సి ఉంది? ఈ వ్యవహారంలో మరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని కస్టమ్స్ చట్టం–1962 నిబంధనల ప్రకారం అధికారులు సీజ్ చేశారు. కారులో ఉన్న ఇద్దరినీ అరెస్టు చేసి సంబంధిత న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్, బంగారం రవాణాకు ఉపయోగించిన మార్గాలు, సంబంధిత వ్యక్తుల పాత్రపై అధికారులు మరింత లోతుగా విచారణ చేపట్టారు.



## చెట్ల కొమ్మలను తొలగించారు

'ప్రజాపక్షం' కథనానికి స్పందించిన విద్యుత్ అధికారులు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో వేపచెట్ల కొమ్మల మధ్య నుండి 11కెవి విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని శనివారం 'ప్రజాపక్షం' దినపత్రికలో ప్రచురితమైన విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం అనే కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం లైన్‌మెన్ శ్రీను నాయక్, జిలానీలు చెట్ల కొమ్మలను తొలగించారు. ప్రజాపక్షం ప్రతిక ద్వారా ప్రజా సమస్యలపై కథనం రాయడం పట్ల గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

## ప్రాణాలకు తెగించి.. కిడ్నాప్ నుంచి జంప్!

నకిరేకల్‌లో ఆటో నుంచి దూకేసిన మైనర్ బాలికలు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** దసరా సెలవులకు అమ్మమ్మ ఊరికి బయలుదేరిన ఇద్దరు మైనర్ బాలికలను ఓ ఆటో డ్రైవర్ కిడ్నాప్ చేయడానికి యత్నించగా..ప్రాణాలకు తెగించి రన్నింగ్ ఆటో నుంచి దూకి విద్యార్థినులు ప్రాణాలు కాపాడుకున్నారు. జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపాడుకు చెందిన ఇద్దరు బాలికలు హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్నారు.సెలవులకు శాలిగౌరారం మండలం ఊట్కూరులోని అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు వారు నకిరేకల్ చేరుకుని ఆటో ఎక్కారు.దారి మళ్లించి ఇనుపాముల గుట్ట వైపు తీసుకెళ్తుండగా డ్రైవర్ ఫోన్ సంభాషణతో బాలికలు అనుమానించారు. ఎటు తీసుకెళ్తున్నావని ప్రశ్నించగా..వేరే భాషలో ఎవరితో మాట్లాడడంతో ఆటో డ్రైవర్ కిడ్నాప్ చేయటానికి ప్రయత్నిస్తున్నారని బాలికలు అనుమానించారు.దీంతోవారు భయంతో గట్టిగా అరుస్తూ హైవేపై ఆటో నుంచే దూకేశారు.ఈ ప్రమాదంలో ఇద్దరు బాలికలకు తీవ్రంగా గాయాలయ్యాయి. అటుగా బైక్‌పై వెళ్తున్నవారు స్పందించి అమ్మాయిలు కాపాడి ఆసుపత్రికి తరలించారు ఆటో డ్రైవర్‌ను పట్టుకుని మందలించారు బాధితులు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విచారణ తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతుల ధర్నా



**ప్రజాపక్షం/అర్వపల్లి :** విద్యుత్ కోతల మూలంగా పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని కొమ్మాల గ్రామానికి చెందిన రైతులు ఆదివారం కోదూరు సబ్‌స్టేషన్ ముందు ధర్నా నిరసనను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆరు, ఏడు గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని ఒకవైపు ఓల్టేజ్ సమస్యలతో మోటార్లు కాలిపోతున్నాయని పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాల కోసం 12 గంటల పాటు విద్యుత్‌ను అందజేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు జనార్థన్, కుట్టయ్య, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవాది నర్సిరెడ్డి, శేఖర్ రెడ్డి, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## ఫాక్స్ కాన్ మెగా జాబ్‌మేళా



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నిరుద్యోగ యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, ఫాక్స్ కాన్ సంస్థ హైదరాబాద్ ప్లాంట్ హెడ్ నిక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో అర్బన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఎన్‌ఎన్‌జీ సోర్సింగ్ పార్ట్నర్ సహకారంతో ఫాక్స్ కాన్ సంస్థకు నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ప్రతిభ ఉంటే ఎక్కడైనా రాణించవచ్చన్నారు. సూర్యాపేట ఎడ్యుకేషన్ హబ్‌గా రూపాంతరం చెందుతుందని త్వరలోనే జాబ్‌హబ్‌గా కూడా మారుతుందన్నారు. మహిళలకు ఉపాధితో పాటు భద్రత కల్పిస్తున్న ఫాక్స్ కాన్ సంస్థ సేవలు మరింత విస్తరించాలన్నారు. మరో మారు మెగా జాబ్ మేళా నిర్వహించి ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంక్ ఎండి పెద్దిరెడ్డి గణేష్, ఫాక్స్‌కాన్ సంస్థ సభ్యులు వీర, మహేష్, ఎల్ఎన్‌జి సంస్థ సభ్యులు కౌశిక్, స్కూల్ చైర్మన్ విక్రమ్ పాల్గొన్నారు.

## సిఇసి రాజీనామా చేయాలి

**ప్రజాపక్షం/గుండాల :** భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసి, ఓటు చోరీకి పాల్పడిన సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బద్దుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘాన్ని బిజెపి తనకు అనుకూలంగా మార్చుకొని, అధికారం సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. భారత దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తికి రాజ్యాంగం కులమతాలు, లింగ బేధం లేకుండా ఓటు హక్కు కల్పించిందన్నారు. ఒక వ్యక్తి, ఒక ఓటు అనే ప్రాథమిక సూత్రం ప్రాతిపదికన హక్కులు కల్పించబడ్డాయని తెలిపారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసన పోరాటానికి వెళ్ళిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## పంటలు ఎండిపోతున్నాయి 'మహాప్రభో'!

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండలంలో పాలారంతండా గ్రామంలో పంటలు ఎండిపోతున్నాయని, దీనికి తోడు విద్యుత్ సరఫరాలో అధికారులు కోతలు విధిస్తుండటంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోతున్నారు. దీంతో మోటార్ స్టార్టర్ పెట్టెలు మరమ్మతులకు గురై నానా అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో రైతు తేజావత్ వీరన్న తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి వడ్డీలకు తీసుకవచ్చి ఎకరానికి 30వేల రూపాయల చొప్పున పెట్టుబడి పెట్టామని, పంట పొలాలు ఎండి పోవడం వల్ల మరణమే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు. పంట చేతి కొచ్చే సమయంలో రాత్రిపూట విద్యుత్ సరఫరా వల్ల సాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పగటిపూట నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా పంట పొలాలకు సాగునీరు అందించే 14బి కాలువను అధికారులు పట్టించుకోవడంలేదని, కాలువకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు నీటిని తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్, సాగునీటి సమస్యలతో రైతులు నష్టపోకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పంటలను కాపాడాలని ఆయన కోరారు.



# నీటి నిల్వలు కొండంత..
# ప్రజల దాహం తీరనంత

మూడు,నాలుగు రోజులుగా నీటి సరఫరా బంద్

దశాబ్దాలుగా ఇదే తంతు.. తీరని తాగునీటి సమస్య



**ప్రజాపక్షం/నందికొండ:** స్థానికంగా అపారమైన జలరాశి అందుబాటులో ఉన్నా దశాబ్దాలుగా తాగునీటి కష్టాలు ప్రజలను వెంటాడుతూనే ఉన్నా యి. ఏళ్లు గడుస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోగా, ప్రస్తు తం కొన్ని ప్రాంతాల్లో మూడు రోజులుగా,మరికొన్ని ప్రాంతాల్లో నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజల అవస్థలు మరింత తీవ్రమయ్యాయి.ఇళ్లలో బోర్లు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వేల రూపాయలు వెచ్చించి ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది.ప్రకృతి వనరులకు,విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి నెలవైన ప్రాంతంలోనే దశాబ్దాలుగా ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుండటం పాలనలోని వైఫల్యాలను ప్రశ్నిస్తోంది.

**అన్నీ ఉన్నా..ప్రజలకు అవస్థలే :** అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా నాగార్జునసాగర్ పరిస్థితి మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో తాగునీటి సమస్య ఇప్పటిది కాదు దశాబ్దాలుగా ప్రజలను వేధిస్తున్న సమస్య ఏళ్లు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా స్థానికంగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజల కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. పట్టణంలోని ఇళ్లలో బోర్లు కూడా లేకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చివరకు వేల రూపాయలు వెచ్చించి ప్రైవే టు వ్యక్తుల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దశాబ్దాలుగా తాగునీటి కష్టాలను భరిస్తున్నా తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి, వ్యక్తం చేస్తున్నారు. అపారమైన నీటి నిల్వలు కళ్లముందే కనిపిస్తున్నా.. తమ ఇళ్లలో గుక్కెడు నీటి కోసం అల్లాడాల్సి రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**నీటి కష్టాలు తీరేదెన్నడు :** ప్రపంచ పర్యాటక కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు కలిగిన నాగార్జున సాగర్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలని ప్రజలు కోరుతున్నారు. తాగునీరు విద్యుత్ రఫరాలో అంతరాయాలు లేకుండా చూడటంతోపాటు,దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యలను పరిష్కరించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని అందుకు పాలకులు సంబంధిత అధికారులు, శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## 2028 జూన్ నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పూర్తి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

జిల్లాలో ప్రతి గ్రామానికి డబుల్ రోడ్డు



**ప్రజాపక్షం/నల్లగొండ:** వచ్చే 2028 జూన్ నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పనులను పూర్తి చేయడమే తన జీవిత లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆదివారం నల్లగొండ జిల్లాలో 74 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కనగల్ మండలం తేలకంటిగూడెం వద్ద 41 కోట్లతో తేలకంటిగూడెం నుంచి తొరగల్లు, జంగమాయిగూడెం మీదుగా ముషంపల్లి వరకు, 33 కోట్లతోనల్లగొండ నిడమానూరు రోడ్డు నుంచి చెట్ల చెన్నారం,చిన్నమాదారం, తంగెళ్లవారిగూడెం మీదుగా ముషంపల్లి వరకు చేపట్టనున్న రోడ్ల విస్తరణ, పటిష్టపరిచే పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 1600 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపట్టామని, 900 కోట్లతో నల్లగొండ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు.రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు,రైస్ మిల్లులు వస్తాయని,రవాణా సౌకర్యాలు మెరుగై యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని అన్నారు.తేలకంటిగూడెంకు ఇప్పటికే 107 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మిగిలిన అర్హులకు కూడా ఇళ్లు మంజూరు చేస్తామని, ఎల్1, ఎల్3 లో సాంకేతిక సమస్యలున్నా అర్హులకు న్యాయం చేస్తామన్నారు. గ్రామంలో వడ్డెర కులస్తులకు ఇళ్ల పట్టాలు అందించామన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి కరువు పరిస్థితులు వచ్చే అవకాశం ఉందని,తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని,సాగర్ లో నీరు తక్కువగా ఉన్నా తాగునీటి అవసరాల కోసం చెరువులను నింపుతున్నామన్నారు.శ్రీశైలం సొరంగం పూర్తయితే రెండు పంటలకు సాగునీరు ఇవ్వవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,ఆర్అండ్‌బి ఎస్ఈ మోహన్,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి,ఈఈ శ్రీధర్ రెడ్డి,తహసీల్దార్ పద్మ,ఎంపీడీఓ వేద రక్షిత,మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,సర్పంచులు,ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

## చెప్పుల హోల్‌సేల్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

ఐదుగురిని కాపాడిన సిబ్బంది

బాధితులకు అండగా ఉంటాం- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఇస్లాంపురం ప్రాంతంలో ఉన్న ఒక చెప్పుల హోల్‌సేల్ గోదాంలో ఆదివారం ఉదయం 11:30 గంటలకు భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రెండో అంతస్తులో ఉన్న గోదాంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో పెద్ద ఎత్తున రబ్బరు, ప్లాస్టిక్ చెప్పులు దగ్ధమై సుమారు రూ.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. అదే భవనంలోని మూడో అంతస్తులో నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో 41 ఏళ్ల మొహమ్మద్ ఆయిషా, ఆమె కూతుర్లు 15 ఏళ్ల మొహమ్మద్ హసీనా, 13 ఏళ్ల మహమ్మద్ ఆఫ్నా, 8 ఏళ్ల మొహమ్మద్ రిల్లా, 65 ఏళ్ల అబూ మొహమ్మద్ కిందకు రాలేక గదిలోనే చిక్కుకుపోయారు.సమాచారం అందుకున్న వెంటనే మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ సిబ్బంది, అగ్నిమాపక శాఖ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భవనంలో చిక్కుకున్న ఆ ఐదుగురు కుటుంబ సభ్యులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. చెలరేగిన మంటల తీవ్రత కారణంగా భవనం నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు దట్టమైన పొగలు వస్తూనే ఉన్నాయి. అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడిన వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగభూషణం, ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వారి సిబ్బంది సేవలను స్థానికులు ఎంతో అభినందించారు.ఈ ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. పట్టణంలోని ఇస్లాంపురం ప్రాంతంలో ఉన్న చెప్పుల గోదాంలో ఆదివారం సంభవించిన భారీ అగ్నిప్రమాద ఘటనాస్థలికి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తక్షణమే చేరుకుని సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. అగ్నిప్రమాద సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన ఆయన ప్రమాద స్థలానికి వచ్చి పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసు అధికారులతో కలసి మంటలను త్వరగా అదుపులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టారు.

## ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి అత్యధిక ప్రవేశాలు రావాలి





**ప్రజాపక్షం/నల్లగొండ :** ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ,పీజీ కోర్సుల్లో గతంలో మాదిరిగానే ఈ విద్యా సంవత్సరం కూడా అత్యధిక సంఖ్యలో ప్రవేశాలు నమోదయ్యేలా కృషి చేయాలని యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి.ధర్మ నాయక్ సూచించారు. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ,పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీతో గడువు ముగియనుందని,గడువు పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు.అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆదివారం నల్లగొండ ప్రాంతీయ సమన్వయ కేంద్రంలో అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు,కౌన్సిలర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డాక్టర్ బి. ధర్మ నాయక్ మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ కోర్సులు, ప్రవేశాల వివరాలను వెల్లడించారు. ఉన్నత విద్యను అందరికీ చేరువ చేయడంతోపాటు విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, ఉద్యోగ,ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో బీఆర్ఏఓయూ పలు కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చిందని ధర్మ నాయక్ తెలిపారు. యూనివర్సిటీ ద్వారా బీఏ,బీకాం,బీఎస్సీతోపాటు ఎంఏ,ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని వివరించారు. ఉద్యోగాలు చేస్తున్నవారు, కుటుంబ బాధ్యతల కారణంగా సంప్రదాయ కళాశాలల్లో చదువుకోలేకపోతున్నవారు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమకు అనుకూలమైన సమయంలో విద్యాభ్యాసాన్ని కొనసాగించే వెసులుబాటు ఈ విధానం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో నల్లగొండ ప్రాంతీయ సమన్వయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్ బొజ్జ, మహిళా డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ భూక్యా వీరన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పెసర్ల ధరలు పైపైకి...

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో జాతీయ స్థాయిలో రికార్డు ధర

ఇతర రాష్ట్రాల ఎగుమతితో పెరుగుతున్న ధర

క్వింటాకు రూ. 9వేలకు పైగానే



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పెసర్ల ధరలు రోజురోజుకు పైపైకి పోతున్నాయి. ఈ ఏడాది పంట సాగు ఘననీయంగా దగ్గడమే ప్రధాన కారణమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీంతో పేదలు పెసర పప్పును కొనుగోలు చేసి తినలేని పరిస్థితి దాపురించింది. తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్లు అయిన వరంగల్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ల తరువాత రెండవ అతి పెద్ద మార్కెట్‌గా గుర్తింపు పొందిన సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో పెసర్లకు రికార్డు ధర పలుకుతుంది. జాతీయ స్థాయిలో కూడా పెసర్లకు ఇంత ధర పలకడం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం పెసర్లకు మద్ధతు ధర క్వింటా రూ.8,780 ప్రకటించగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో రైతులు విక్రయానికి తెచ్చిన పెసర్లకు దీనికి మించి ధర పలుకుతుంది. ఈనెల 6వ తేదీన క్వింటాకు ఏకంగా రూ. 9,200ల ధర పలకడం గమనార్హం. ఈ ధర దేశంలోని పెసర మార్కెట్లలో కంటే అధికమని చెబుతున్నారు. దేశంలోనే అతిపెద్ద పెసర మార్కెట్‌గా ప్రసిద్ధిగాంచిన మహారాష్ట్రలోని అకోలా మార్కెట్‌లో క్వింటాకు రూ. 9 వేల లోపే ధర పలుకుతుండగా, జాతీయ స్థాయిలో రెండవ అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన తమిళనాడులోని సేలం మార్కెట్‌లో క్వింటా రూ.6వేల నుండి రూ.8500కు మించి ధర పలకడం లేదు. రైతులు చెత్తచెదారం లేకుండా పరిశుభ్రమైన పెసర్లను మార్కెట్‌కి తీసుకొస్తుండడంతో ఈనామ్‌లో పోటీతత్వం పెరగడంతో ధర పలుకుతుందని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఫసియుద్దీన్‌లు తెలిపారు. ఈ ప్రాంత రైతాంగం పండించిన పెసర్లు దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. దీనితోనే సూర్యాపేట మార్కెట్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది.



## నార్కట్‌పల్లి డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి విజయోత్సవాలు

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి అఖండ విజయం సాధించడంతో నార్కట్‌పల్లి డిపో వద్ద ఆదివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు,కార్మికులు పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఎన్నికల్లో కూటమికి మద్దతుగా నిలిచిన కార్మికులకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగాజిల్లా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నో నిర్బంధాలు ప్రలోబాలను తట్టుకొని కార్మికులు నిజాయితీగా పని చేసే సంఘాలకు పట్టం కట్టారన్నారు. అధికార పార్టీ యూనియన్ ఎన్ని విధాలుగా ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని ఓడించాలని ప్రయత్నం చేసినా కార్మికులు వారి మాటలు నమ్మలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కేఎస్ రెడ్డి, ఎం.నందం,జిల్లా ఎస్‌సి,ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి పి.యాదయ్య, యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారి శ్రీను, సంపత్, నార్కట్‌పల్లి డిపో కార్యదర్శి కె. జంగయ్య,అధ్యక్షుడు వి. వెంకన్న,వర్కింగ్ ప్రెసిడెంట్ మంద మల్లయ్య, జాయింట్ సెక్రటరీ ఎస్.నరసింహ,కోశాధికారి వై.ఎన్.రెడ్డి, సహాయ కార్యదర్శులు బి.వెంకటయ్య,ఆర్. పరమేష్, బత్తుల సందీప్‌రెడ్డి జి. లింగమ్మ,బి.వరలక్ష్మి పాల్గొన్నారు.

## ఫ్లోరైడ్ బాధిత మునుగోడు ప్రజల తాగు,సాగునీటి విషయంలో రాజీ లేదు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు :** ప్రపంచంలోనే అత్యధిక ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బంది పడుతున్న మునుగోడు నియోజకవర్గ ప్రజల తాగు,సాగునీటి అవసరాలు తీర్చే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన డిండి ఎత్తిపోతల పథకానికి, దానికి కొనసాగింపుగా ఉన్న మునుగోడు నియోజకవర్గంలోని లక్ష్మణాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీటిని ఎక్కడి నుంచి తరలించాలనే విషయంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తన చొరవతో ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించాలని నిర్ణయించిందని, అందుకు 1800 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు.ఏదుల రిజర్వాయర్ నుంచి నీటి తరలింపు, మునుగోడులోని లక్ష్మణాపురం, శివన్నగూడెం ప్రాజెక్టుల హెడ్ వర్క్స్ పనులపై హైదరాబాద్ లోని తన నివాసంలో తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు.క్యాబినెట్ నిర్ణయానికి అనుగుణంగా భూసేకరణ, హెడ్ వర్క్స్ తో సహా అన్ని పనులు పూర్తయ్యేలా ప్రభుత్వంతో మాట్లాడుతానని ఇంజనీర్ల ఫోరం ప్రతినిధులకు తెలిపారు. ఏదుల నుంచి నీటి తరలింపుపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో మునుగోడు ప్రజల అవసరాల విషయంలో రాజీ లేదని తేల్చిచెప్పారు.ఈ సమావేశంలో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి తన్నీరు వెంకటేశం,సలహాదారులు వి.వెంకటరామారావు,ఎం.సత్తిరెడ్డి,ఇంద్రసేనారెడ్డి,జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో చైన్ స్నాచింగ్ కలకలం

సిగరెట్లు అడిగినట్లు నటించి మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ



**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలో చైన్ స్నాచర్లు మరొసారి తమ చేతివాటం ప్రదర్శించారు. సిగరెట్లు అడిగే నెపంతో కిరాణ దుకాణంలోకి వచ్చిన ఇద్దరు వ్యక్తులు, దుకాణంలో మహిళ ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని బైకుపై పరారయ్యారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం కోదాడ పట్టణంలోని సిరి అపార్ట్‌మెంట్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే సిరి అపార్ట్‌మెంట్ సమీపంలో సావిత్రి అనే మహిళ కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. ఆదివారం సాయంత్రం ఆమె దుకాణంలో ఒంటరిగా ఉన్న సమయంలో బైకుపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు సిగరెట్లు కావాలని అడిగారు. ఈ క్రమంలో దుకాణంలో మరెవరూ లేరని గమనించిన దుండగులు అదును చూసుకుని సావిత్రి మెడలో ఉన్న బంగారు గొలుసును ఒక్కసారిగా లాక్కొన్నారు. ఊహించని ఈ పరిణామంతో బాధితురాలు తెరుకునే లోపే నిందితులు బైకుపై అక్కడి నుంచి వేగంగా పరారయ్యారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో బాధితురాలు ఆందోళనకు గురైంది. అనంతరం బాధితురాలు కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. పట్టపగలు జనసంచారం ఉండే ప్రాంతాల్లోనూ మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఇటువంటి ఘటనలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

జములమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో సందర్భంగా జిల్లా కేంద్రంలోని జములమ్మ అమ్మవారి పరుశురాముడు దేవాలయంలో గద్వాల ఎమ్మెల్యే దంపతులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బండ్ల జ్యోతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భాగంగా మొదటిరోజు ఎమ్మెల్యే దంపతులు శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించి ఉత్సవ విగ్రహానికి అభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్‌రాములు, ఈవో పురేందర్, నాయకులు నరసింహారెడ్డి, ఆంజనేయులు, భాస్కర్ గౌడ్, రాముడు, వీరేష్, నారాయణరెడ్డి, బద్రి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## దసరా నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వాన పత్రికలు అందజేత

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఆలయ నిర్వహణ కమిటీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవి వనితా క్లబ్ సభ్యులు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డా.వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మని మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. అదేవిధంగా మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతుకి కూడా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇట్టి విశేష కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, మనసాని నాగరాజు, కొత్త సుజీత్ కుమార్ గుప్తా, మనసాని కిరణ్ కుమార్, ఓబుళశెట్టి ఉదయ్‌కుమార్, దొంత నరహరి, కల్వల ప్రసన్న, కట్టా వెంకటమ్మ, సిద్దం శెట్టి స్వాతి, తాళంపల్లి వాణి, వడ్డెవాటి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ చోరీ అంటూ ప్రజలను కాంగ్రెస్ తప్పుదోవ పట్టిస్తోంది

బిజెపి సీనియర్ నేత తల్లోజు ఆచారి విమర్శ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కాంగ్రెస్ పార్టీ పదేపదే ఓట్ చోరీ అంటూ ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని బిజెపి సీనియర్ నేత, జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి విమర్శించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ప్రధానమంత్రి కావాల్సిన సమయంలో నెహ్రూ ప్రధానమంత్రి ఎలా అయ్యారో దేశ ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు దొంగే దొంగ అని అరిచినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే ప్రారంభమైందని గుర్తుచేశారు. నిజంగానే ఓట్ల చోరీ జరుగుతోందని కాంగ్రెస్ భావిస్తే తెలంగాణ, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో ఆ పార్టీ ఎలా అధికారంలోకి వచ్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇవి ఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించినా, బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించినా ప్రజలు తమ పార్టీని తిరస్కరిస్తారనే భయంతోనే కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితాలో అక్రమ నమోదులపై ఫిర్యాదులు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగుతూ ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని, ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజల్లో గందరగోళం సృష్టించవద్దని కాంగ్రెస్ పార్టీ తల్లోజు ఆచారి హితవు పలికారు.

## వైభవంగా ప్రారంభమైన శ్రీజ్ఞానాంబికాదేవి నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్తదేవస్థానంలో శ్రీజ్ఞానాంబికాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదట అమ్మవారిని శ్రీబాలత్రిపుర సుందరీదేవిగా అలంకరణ చేసి, కలశస్థాపన చేసి, అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేసి, మహా మంగళహారతి సమర్పించడం జరిగింది. తర్వాత అమ్మవారి హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించి, కూష్మాండ బలి ఇచ్చి అనంతరం భక్తులకు ఆలయకమిటీ అన్నదానం చేశారు.

## ఆటో బోల్తా - ఒకరికి గాయాలు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** నవరాత్రి ఉత్సవాలకు దుర్గామాత విగ్రహాన్ని కొనుగోలు చేసి ఆటోలో తీసుకువస్తుండగా ఆటో బోల్తా పడి, ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం తూముకుంట గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథన ప్రకారం మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామానికి చెందిన కొందరు యువకులు నవరాత్రి ఉత్సవంలో భాగంగా దుర్గామత విగ్రహాన్ని ప్రతిష్టించడానికి కొల్లాపూర్ పట్టణంలో కొనుగోలు చేసి ఆటోలో తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఆటో తూముకుంట శివారుకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్క పడిపోయినట్లు తెలిపారు. ఆటోలో ఉన్న గ్రామానికి చెందిన రాజా వర్ధన్ రెడ్డి అనే యువకుడికి తీవ్ర గాయలు కాగా, 108 అంబులెన్స్‌లో కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

# ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ

ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో జడ్చర్ల శాసనసభ్యుడు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. ఆదివారంనాడు పట్టణ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఆయన సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన వాతావరణాన్ని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కనూ కాపాడుకున్నప్పుడే మనం ముందుకు సాగుతామని తెలిపారు. మొక్కలు పెరిగి పెద్దవైతే ఆక్సిజన్ విడుదల అవుతుందని, ఇటీవల కరోనా సమయంలో ఆక్సిజన్ అందక ఎంతోమంది మృత్యు వాత పడ్డారని తెలిపారు. అంతకు ముందు ఆయన మైనార్టీ సంఘ నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఈద్గాలకు రెండు లక్షల రూపాయలను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గిరిధర్, అనిల్ రెడ్డి, ధ్రువ, రమేష్, నరసింహ, రాజు, ఆనంద్ తదితరుల పాల్గొన్నారు.



## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టివేత

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట్ జిల్లా, మక్తల్ మండలం చిట్యాల గ్రామంలో పెద్దవాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు అన్న నమ్మదగిన సమాచారంతో మక్తల్ ఎస్సై రాజు తన సిబ్బందితో దాడులు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి

మహిళలకు సాధికారత

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

ఈనెల 13న ఆమనగల్లులో 25వ జాబ్ డ్రైవ్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలు ఆర్థికంగా స్వావలంబులుగా ఎదిగేందుకు తోడ్పడటం, ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయడమే ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ కూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యోగ కల్పన, స్వచ్ఛ జలధార కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈనెల 13వ తేదీ మంగళవారం ఆమనగల్లులో 25వ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా అర్హతలు కలిగి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగానికి బేసిక్ వేతనం, డిఎ కలిపి నెలకు రూ.15,000తో పాటు నివాస భత్యం రూ.2,000 హాజరు బోనస్ రూ.1,500 షిఫ్ట్ అలవెన్స్, ఉచిత రవాణా, ఉచిత భోజనం వంటి సౌకర్యాలు ఉంటాయని వివరించారు. పిఎఫ్, ఇఎస్ఐసి, వృత్తి పన్ను మినహాయింపుల అనంతరం నెలవారీ వేతనం రూ.12,937 ఉంటుందని తెలిపారు. జాబ్ డ్రైవ్ నిర్వహించడమే కాకుండా, ఎంపికైన అభ్యర్థులకు వాస్తవంగా ఉద్యోగాలు లభించాయా లేదా అనే అంశాన్ని కూడా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. కంపెనీల వివరాలు, ఉద్యోగ బాధ్యతలు, వేతనాలు, పనిప్రదేశం, విద్యార్హతలపై స్పష్టత తీసుకున్న తర్వాత అభ్యర్థులకు సమాచారం అందిస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతతో పాటు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడటమే తమ ఉద్దేశమన్నారు. మరోవైపు ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఐక్యత స్వచ్ఛ జలధార కార్యక్రమాన్ని తలకొండపల్లి, వెల్దండ మండలాల్లో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. తలకొండపల్లి మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో 65 గ్రామాల్లో, వెల్దండ మండలంలోని 32 గ్రామపంచాయతీల పరిధిలో 69 గ్రామాల్లో కలిపి మొత్తం 63 గ్రామ పంచాయతీల పరిధిలోని 134 గ్రామాల్లో నీటి ట్యాంకులను ప్రత్యేక యంత్రాల సహాయంతో శుభ్రపరిచినట్లు వెల్లడించారు. మరో రెండు రోజుల్లో కల్వకుర్తి మండలంలో మూడో విడత స్వచ్ఛ జలధార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే సేవా కార్యక్రమాలను మరిన్ని గ్రామాలకు విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, చంద్రశేఖర్, కొండల్, తల్లోజు రఘు, యాదవ్, యాదయ్య, కాలే మహేష్, శ్రీపతి, శేఖర్, విజయ్ కుమార్, నాగిళ్ల శివ, శ్రీను, మల్లేశ్, శ్రీను నాయక్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పట్టభద్రులకు ఎన్‌రోల్‌మెంట్ లక్ష్యం

**ప్రజాపక్షం/నర్వ :** ఆదివారం నర్వ మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు టి.అజిత్ సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి బంగ్ల లక్ష్మి కాంత్ రెడ్డి మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో పదివేల మంది అర్హులైన పట్టభద్రులకు ఎన్‌రోల్‌మెంట్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రైతుల గోస పట్టని రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రైతుల గోస పట్టని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు ప్రతి బిజెపి కార్యకర్త నడుం బిగించాలని, అందుకు ప్రతి మండల బిజెపి అధ్యక్షులు భూత్ అధ్యక్షులు, పదాది కారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎన్రోల్ మెంట్ ప్రక్రియను పూర్తిచేయాలని బంగ్ల లక్ష్మి కాంత్‌రెడ్డి సూచించారు. నారాయణపేట్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బలరాంరెడ్డి మాట్లాడుతూ బిజెపి బలపరచిన అభ్యర్థి గెలుపే మన లక్షమని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల సహా ఇన్‌చార్జీలు జయానంద్ రెడ్డి, జిందే జ్యోతి శ్రీనివాస్, మహిళామోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పేట లలితా వెంకట్ రెడ్డి, జిలాల కార్యదర్శి కనకరాజు, జిల్లా టెలికం మెంబెర్ పసుల నీరజ్, మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప, ప్రతాప్ రెడ్డి, మంగా లావణ్య, మల్లా రెడ్డి, మండ్ల సురేష్, అశోక్ భూపాల్, జిల్లా కౌన్సిల్ మెంబెర్ సాకలి బొజ్జన్న, మల్లేష్, మైనారిటీ మోర్చా నాయకులు, బిజెపి పదాది కారులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ కూడా కాదు...

# మారుమూల మండలంలో వసూళ్ల మోత

మానవపాడు బస్టాండ్‌లో చిన్న వ్యాపారుల ఆవేదన...

నెలకు రూ.2,200 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు

కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వ్యాపారుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని మానవపాడు మండలం ఓ మారుమూల గ్రామీణ ప్రాంతం. ఇక్కడి బస్టాండ్ ఆవరణలో చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని సుమారు 30 మంది నిరుపేద వ్యాపారుల జీవనోపాధి పొందుతున్నారు. అనారోగ్య సమస్యలు, పట్టణాల్లో ఉపాధి అవకాశాలు లేక సొంత ఊరిలోనే చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న తమపై ఆర్టీసీ అధికారులు అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. బస్టాండ్ ఆవరణలోని ఒక్కో దుకాణానికి ఎన్నో ఏళ్ల నుండి నెలకు ఫైన్లు, జీఎస్టీ పేరుతో రూ.2,200 వరకు వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఒక్కో దుకాణం నుంచి ఒక్కో విధంగా డబ్బులు తీసుకుంటున్నారని, వసూలు చేసిన మొత్తానికి తగిన రసీదులు ఇస్తున్నారే తప్ప బస్టాండ్ అభివృద్ధి లేదని పేర్కొంటున్నారు. ఈ వసూళ్లకు సంబంధించిన అధికారిక నిబంధనలు, రసీదులు, లెక్కలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. తాము పేద వ్యాపారులమని, నెలకు రూ.500 చొప్పున చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని లేదా ఆర్టీసీ యాజమాన్యమే 10*10 అడుగుల కొలతలతో షట్టర్లు నిర్మించి ఇస్తే నెలకు రూ.1,500 చొప్పున చెల్లిస్తామని అధికారులను వేడుకున్నా స్పందన లేదని వ్యాపారులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధుల ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని చెబుతున్నారు. ప్రతి నెలా అద్దెలు, ఇతర చార్జీలు చెల్లిస్తున్నప్పటికీ బస్టాండ్ ఆవరణలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో బురదలోనే వ్యాపారాలు నిర్వహించాల్సి వస్తోందని, తాగునీటి సౌకర్యం లేదని, టాయిలెట్స్ మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవని చెబుతున్నారు. బస్టాండ్ ఆవరణను అభివృద్ధి చేసి. వ్యాపారులకు కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు. మానవపాడు బస్టాండ్‌లో చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న సుమారు 30 మంది పేద కుటుంబాల సమస్యపై జిల్లా కలెక్టర్ స్పందించాలని వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు వసూలు చేస్తున్న అద్దెలు, ఫైన్లు, జీఎస్టీ మొత్తాలకు సంబంధించిన నిబంధనలు, అధికారిక రసీదులు, వసూళ్ల లెక్కలను పరిశీలించాలని కోరుతున్నారు. వసూళ్లలో ఏవైనా అక్రమాలు ఉన్నట్లు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, బస్టాండ్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, బురద సమస్య పరిష్కారం వంటి కనీస సౌకర్యాలు కల్పించి తమ జీవనోపాధిని కాపాడాలని మానవపాడు మండల వ్యాపారులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

# న్యాయవాదులకు క్రాస్ కోడ్ పుస్తకం ఉపయోగకరం

* హైకోర్టు అడ్వకేట్ ఆకుల వెంకట్రామ్ పటేల్

చండూరులో ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్ పుస్తక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చండూరు :** నూతన న్యాయవాదులకు న్యాయవృత్తిలో రాణించేందుకు క్రాస్ కోడ్ ది మోడరన్ ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని హైకోర్టు అడ్వకేట్ ఆకుల వెంకట్రామ్ పటేల్ అన్నారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలోని రచయిత ,హైకోర్టు అడ్వకేట్ బొమ్మరబోయిన కిరణ్ రచించిన పుస్తకాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకుల వెంకట్రామ్ పటేల్ మాట్లాడుతూ క్రాస్ ఎగ్జామినేషన్‌కు సంబంధించిన అంశాలను తెలుసుకోవడంలో ఈ పుస్తకం నూతన న్యాయవాదులకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. న్యాయవృత్తిలో నైపుణ్యాన్ని పొంపొందించుకోవడానికి ఇలాంటి పుస్తకాలు విలువైన మార్గదర్శకాలుగా నిలుస్తాయని చెప్పారు. చిన్న వయసులోనే రచయిత బొమ్మరగోని కిరణ్ న్యాయరంగానికి ఉపయోగపడే పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. జర్నలిజంలో గోల్డ్ మెడలిస్టుగా గుర్తింపు పొందడంతో పాటు ప్రతికల్లో నిరంతరం వ్యాసాలు రాస్తూ పుస్తక రచనలోనూ మందుకు సాగడం గొప్ప విషమని కొనియాడారు. భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే మరిన్ని మంచి పుస్తకాలను రచించి తన ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు కంచర్ల విశాంత్ , గద్వాల్ గోవింద్ , సీనియర్ పాత్రికేయులు కంచర్ల అంజయ్య , జేరిపోతులు ధనుంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## డాన్‌బోస్కో జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/చండూరు :** చండూరు మున్సిపాలిటీలోని డాన్‌బోస్కో జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు , విద్యార్థినులు వివిధ రకాలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ కార్లో , ఫాదర్ శౌరి ,ప్రిన్సిపాల్ ఫాదర్ అనూప్ , వైస్ ప్రిన్సిపాల్ వినోద్ కుమార్ , అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# హెల్ప్ డెస్క్ ద్వారా పట్టభద్రుల ఓటు నమోదు

కొర్ర చందునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియ ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది. జనసేవ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా పట్టభద్రులకు ఓటు హక్కు నమోదును సులభతరం చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సినియర్ నాయకులు కొర్ర చందునాయక్ మాట్లాడుతూ పట్టభద్రులు చట్ట సభల్లో తమ ప్రాతినిద్యాన్ని పెంచుకోవడానికి ఓటు హక్కు కీలకసాధనమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా పలువురు పట్టభద్రులు తమ వివరాలను నమోదు చేసుకొని పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు నల్లవెల్లి శ్రీనివాస్, నవీన్, అంజి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## జనప్రియ గార్డెన్‌లో నేడు జల్సాయే సీరతున్నబి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** నేడు మండల కేంద్రంలోని జనప్రియ గార్డెన్‌లో జమియతుల్ ఉలేమా ఆధ్వర్యంలో నిర్వహించే జల్సాయే సీరతున్నబి కార్యక్రమంలో ముస్లిం సోదర, సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జమియతే ఉలామా హింద్ మండల అధ్యక్షుడు మహమ్మద్ నజీరొద్దీన్ మౌలానా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జల్సాయే సీరతున్నబి మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవిత చరిత్ర, వారి బోధనలు, సమాజానికి వారు అందించిన సందేశాలను స్మరించుకుంటూ ఆయన గుణగణాలను కొనియాడుతూ నిర్వహించే ఒక పవిత్రమైన కార్యక్రమంగా నిర్వహించే ఒక ఆధ్యాత్మిక సభ అని అన్నారు.

## ఉపాధి అవకాశాలు కల్పించాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వినియోగదారుల నమ్మకానికి లోబడి వ్యాపారం చేస్తేనే గుర్తింపు లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. ఆదివారం స్థానిక మున్సిపల్ పరిధిలోని మెయిన్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శారదా స్వీట్స్ షాపును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపార రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప, గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, సంగెం గ్రామసర్పంచ్ వేణు గోపాల్, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, వెంకమ్మగూడ సర్పంచ్ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, శ్రీనునాయక్, ఉపసర్పంచ్ షకీల్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ అంబా భవాని మాత దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో మొదటి రోజు ఎమ్మెల్సీ కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. కార్యక్రమంలో ఎలికట్ట సర్పంచ్ వాకిటి నవకిరణి నర్సింహా, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, నాయకులు సాయి యాదవ్, కానుగు అనంతయ్య, పాలమాకుల చెన్నయ్య, నాగర్‌కుంట ఉమా ప్రవీణ్‌రెడ్డి, జెకే నర్సింహులు, అశోక్‌రెడ్డి, ఆలయ చైర్మన్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## శివారు కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్:** సాహెబ్ నగర్ డివిజన్ శివారు కాలనీల సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేస్తామని సాహెబ్ నగర్ డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్ అన్నారు. ఆదివారం సాహెబ్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ గాయత్రీ నగర్, గాయత్రీ నగర్ ఫేస్3, న్యూ మారుతీ నగర్, మహాలక్ష్మి నగర్ కాలనీలో కాలనీవాసులతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో సాహెబ్‌నగర్ ఎస్సీ సెల్ చైర్మన్ భవాని, నాయకులు నందకిషోర్, కొత్త శ్రీధర్‌గౌడ్, విజయ్, సౌభాగ్య నగర్ కాలనీ అధ్యక్షులు విష్ణు, పాపిరెడ్డి కాలనీ అధ్యక్షులు సోమయ్యగౌడ్, రాఘవేంద్ర, కోటి, సూర్య నాయక్, రాజు గౌడ్, శంకర్, గూగులోతు రవి నాయక్, విజయలక్ష్మి, నరసంహా, దేవి, చరణ్‌సింగ్, బాలాజీ పాల్గొన్నారు.

## వైద్యశిబిరానికి విశేష స్పందన



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** యశోద ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు సంగీత శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనంలో ప్రభుత్వ పాఠశాలలో శశిధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా యశోద ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు షాకీర్, శ్రీనివాస్, సాయిరాం రెడ్డి, చింతలపాటి ప్రసాద్, పరమేష్ యాదవ్, దినేష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజు గౌడ్, మేడి మహేష్, సమి, మల్లేష్, విష్ణు, కృష్ణ, రమేష్, వెంకటేష్, లక్ష్మణ్, మధుసూదన్,బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

## కేశంపేట సిఐగా శ్రీనివాస్



**ప్రజాపక్షం/కేశంపేట:** మండల నూతన సిఐగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం కేశంపేట మండల పోలీస్ స్టేషన్ సిఐగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. గతంలో విధులు నిర్వహించిన సిఐ నరహరి బదిలీపై వెళ్ళగా వారి స్థానంలో షాద్‌నగర్ రూరల్ సిఐగా పని చేస్తున్న శ్రీనివాస్‌ను మండల పోలీస్ స్టేషన్ సిఐగా బదిలీ చేస్తూ ఫ్యూచర్ సిటి పోలీస్ కమీషనరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

## సమాజ సేవ అభినందనీయం



**ప్రజాపక్షం/కేశంపేట:** సమాజంలో సేవ చేసేందుకు అధికారంతో పని లేదని, మంచి మనస్సు ఉంటే సరిపోతుందని మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ అన్నారు. ఆదివారం కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. మూడేళ్లుగా సొంత ఖర్చులతో బిఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్‌కుమార్ గౌడ్ మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పల్లె నర్సింగ్‌రావు, బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, సర్పంచ్‌లు మంజుల జంగయ్య, భాస్కర్‌నాయక్, ధనలక్ష్మి రామకృష్ణ, సులోచన శ్రీను, భారతి రవీందర్, ఉపసర్పంచులు నరేష్, దర్శన్, షకీల్, యాదగిరి రావు, వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, వెంకటేష్ యాదవ్, బీరప్ప, జగన్‌నాయక్ పాల్గొన్నారు.

# పాత కరెన్సీ నోట్ల పేరుతో రూ.7.93 లక్షలు స్వాహా!

70కి పైగా మ్యూల్ ఖాతాల సేకరణ..
ఇద్దరు సైబర్ నిందితుల అరెస్ట్
రూ.60–70 కోట్ల లావాదేవీలు జరిగినట్లు అనుమానం





**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాత కరెన్సీ నోట్లకు భారీ మొత్తంలో డబ్బులు చెల్లిస్తామంటూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్న సైబర్ ముఠాకు సహకరిస్తున్న ఇద్దరిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫేస్ బుక్ ద్వారా పాత రూపాయి నోటుకు రూ.45 లక్షలు ఇస్తామని నమ్మించి, ఒక బాధితుడి నుంచి రూ.7,93,351 కాజేసిన కేసులో నిందితులను పట్టుకున్నారు. ఈ ముఠా కోసం 70కి పైగా బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డులు సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగా ఈ మోసానికి సంబంధించి సుమారు 450 కేసులు నమోదైనట్లు, రూ.60–70 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అరెస్టయిన వారిని రామాంతపూర్‌కు చెందిన గుమ్మ రమేష్ (39), ముదాలె అనిల్(19)గా గుర్తించారు. రమేష్ విద్యార్థులు, డెలివరీ సిబ్బంది, ఇతర వ్యక్తులకు కమీషన్ల ఆశచూపి వారి బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డులను సేకరించి హర్యానాలోని వ్యక్తులకు కొరియర్ ద్వారా పంపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనిల్ సైతం కమీషన్ కోసం మూడు బ్యాంకు ఖాతాలను తెరిచి వాటి వివరాలను రమేష్‌కు అందించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఖాతాలను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు పలువురిని మోసగించినట్లు అనుమానిస్తున్నారు. సెప్టెంబర్ 25న బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, అక్టోబర్ 8న రామాంతపూర్–అంబర్‌పేట ప్రాంతంలో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తమకు కమీషన్లు వస్తాయనే ఆశతో బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులు అందించినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. సైబర్ క్రైమ్ ఎసిపి ఆర్.జి.శివమారుతి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎం.సురేందర్, ఆయన బృందం ఈచర్యలు చేపట్టింది. పాతనోట్లు ఉన్నాయని, వాటికి భారీమొత్తంలో డబ్బులు ఇస్తామనే ఆన్‌లైన్ ప్రకటనలను నమ్మవద్దని, కమీషన్ల కోసం ఇతరులకు బ్యాంకుఖాతాలు, సిమ్ కార్డులు అందించి చిక్కుల్లో పడవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

## విద్యార్థులకు ప్రశ్నించడం నేర్పించాలి

ప్రొఫెసర్ రామచంద్రయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించే విధంగా ప్రశ్నించడం నేర్పించాలని ప్రొఫెసర్ రాంచంద్రయ్య సూచించారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రెండో రోజు ఆదివారం జరిగిన దక్షిణాది ప్రాంతీయ శిక్షణా తరగతుల్లో 'శాస్త్రీయ ఆలోచన ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపైన ఆయన మాట్లాడారు. ప్రశ్నిస్తే హేతుబద్ధమైన ఆలోచనకు దారి తీస్తుందన్నారు. ప్రశ్నించడం ద్వారానే అనేక ఆవిష్కరణలు వచ్చాయని, కానీ ప్రశ్నించడాన్ని పాలకులు సహించలేకపోతున్నారని విమర్శించారు. ప్రశ్నించకుండా ఉండేందుకు అశాస్త్రీయ అంశాలను, సూడో సైన్స్ ను శాస్త్రీయ అంశాలుగా నమ్మించే అంశాలపైన దానిపై పాలకవర్గాలు దృష్టి పెడుతున్నాయని, ఇందులో భాగంగానే చరిత్రలో, సైన్సులో మార్పులను చేస్తున్నారని ఆరోపించారు. సి.రామకృష్ణన్ మాట్లాడుతూ వ్యక్తిగత విశ్వాసాల ఆధారంగా చెప్పే చరిత్రతో వర్తమానం, భవిష్యత్తుకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. అశాస్త్రీయ అంశాలను విద్యలో జోడించడం, వాస్తవాల ఆధారంగా చెప్పాల్సిన చరిత్రను విశ్వాసాల ఆధారంగా చెప్పడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. సమావేశంలో ఎస్టిఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ఉపాధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, కోశాధికారి టి ఏ కె.షఫీ కార్యదర్శులు మాయోవన్ అరుణకుమారి, ఎకె బీనా, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్–సికింద్రాబాద్ ప్రత్యేక రైలును..
## 'బతుకమ్మ ఎక్స్‌ప్రెస్'గా రెగ్యులరైజ్ చేయాలి

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా సికింద్రాబాద్– సిర్పూర్ కాగజ్ నగర్ మధ్య ప్రారంభించిన ప్రత్యేక రైలును శాశ్వతం చేసి, దానికి 'బతుకమ్మ ఎక్స్‌ప్రెస్'గా నామకరణం చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డిని కలిసి, ఇటీవల 17రోజుల పాటు ఈప్రత్యేక రైలు నడిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పండుగను పురస్కరించుకుని కేంద్రమంత్రికి బతుకమ్మను అందజేశారు. ఈ ప్రత్యేక రైలును శాశ్వతం చేయడం ద్వారా తెలంగాణ సంస్కృతికి తగిన గుర్తింపు లభించడమే కాకుండా, కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లి దీనిని సాధించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపి డి.కె.అరుణ మాట్లాడుతూ బతుకమ్మ పేరుతో ఈ రైలును నడపడం వల్ల తెలంగాణ పూల పండుగకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని, ఉత్తర తెలంగాణ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయన్నారు. ఈప్రత్యేక రైలు వెయిటింగ్‌లిస్ట్‌లో పూర్తి ఆదరణ పొందుతోందని, దీనిని డైలీ ట్రైన్‌గా మారిస్తే కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్ నగర్ ప్రాంతాల ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు, శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర సంస్థాగత కార్యదర్శి మధుకర్, సహ ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఏవిఎన్ రెడ్డి, అంజిరెడ్డి, మల్క కొమురయ్య పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో
## యంగ్ ఇండియా పోలీస్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి మొత్తం 9 పతకాలు సాధించారు. ఇందులో 3 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్య పతకాలు ఉన్నాయి. విద్యార్థుల విజయంతో పాఠశాలలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

**బాలికల విభాగంలో ...** అండర్10 బాలికల విభాగంలో సీహెచ్. లాస్య శ్రీ అద్భుత ప్రదర్శన కనబరిచింది. 60 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందాల్లో స్వర్ణ పతకాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇదే విభాగంలో లంక పార్వతి రెండు పరుగు పందాల్లో రజత పతకాలు కైవసం చేసుకుంది.ఫీల్డ్ ఈవెంట్లలోనూ విద్యార్థినులు సత్తా చాటారు. అండర్ 10 బాలికల లాంగ్‌జంప్‌లో సాన్విక గౌడ్ కాంస్య పతకం సాధించగా, అండర్12 బాలికల లాంగ్‌జంప్‌లో ఎం. అశ్విని రజత పతకాన్ని దక్కించుకుంది.అండర్14 బాలికల 60 మీటర్ల పరుగు పందెంలో సింధం వజ్ర వరుణవి కాంస్య పతకం సాధించింది.

**బాలుర విభాగంలో...** బాలుర విభాగంలో అండర్12 కేటగిరీ 300 మీటర్ల పరుగులో సిహెచ్. రితేష్ రజత పతకం సాధించగా,సిహెచ్.జీవన్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.బాలబాలికలు వివిధ విభాగాల్లో పతకాలు సాధిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు.

**పాఠశాల యాజమాన్యం అభినందనలు...** విద్యార్థుల కఠోర సాధన, క్రమశిక్షణతో పాటు తల్లిదండ్రులు, కోచ్‌లు, పాఠశాల యాజమాన్యం అందించిన ప్రోత్సాహం ఈ విజయానికి కారణమని పాఠశాల వర్గాలు తెలిపాయి. పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



యువతకు డిసిసి అధ్యక్షురాలు
చిగిరింత పారిజాత సూచన

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బడంగ్‌పేట్ మాజీ మేయర్, డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్‌పేట్ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా స్పోర్ట్స్ క్లబ్‌ను పారిజాత నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. యువత, క్రీడాభిమానులకు ఆధునిక వసతులు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ క్లబ్‌లో టెన్నిస్ కోర్టు, బ్యాడ్మింటన్ కోర్టుతో పాటు అధునాతన ఫిట్‌నెస్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని చెప్పారు. బడంగ్‌పేట్ ప్రాంతంలో ఆధునిక సదుపాయాలతో కూడిన స్పోర్ట్స్ క్లబ్ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, మర్రి హనుమంత్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, రవి గౌడ్, బొల్లపల్లి కుమార్, సుర్ణగంటి విజయ్, సామ భాస్కర్ రెడ్డి, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ పరిశీలన



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హస్తినాపురం డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారం మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటర్ల నమోదు ప్రక్రియను రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు వనస్థలిపురం శ్రీనివాస్‌రెడ్డి, మల్కాజిగిరి జిల్లా ప్రభారి ఇంచార్జ్ సామ రంగారెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా కోశాధికారి మరిపి ప్రసన్నలతో కలిసి బిజెపి ఎంఎల్‌సి మల్కా కొమరయ్య ఓటర్ల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా ఎంఎల్‌సి పట్టభద్రులు అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు పార్టీ ఆధ్వర్యంలో ప్రతి డివిజన్, కాలనీల్లో సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన గత ప్రభుత్వం చేసిన తప్పులను చూపడమే తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఇంచార్జి రాజేంద్ర ప్రసాద్, పార్టీ ప్రధాన కార్యదర్శులు బండారి భాస్కర్, నరేష్ యాదవ్, ఎస్పాల్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు పాశం జీవన్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, రవిశంకర్, బొమ్మిడి కిరణ్ రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

## 'ఎల్ నినో'పై అప్రమత్తంగా ఉండాలి

కల్వకుర్తి ఎంఎల్ఎ కసిరెడ్డి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో జల వనరుల సంక్షోభం తలెత్తే అవకాశాలున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కల్వకుర్తి ఎంఎల్ఎ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (చెక్కులు, ఎల్‌ఓసీ పత్రాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. భూగర్భ జల మట్టాలు పడిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం అయ్యే అవకాశాల నేపథ్యంలో నీటి లభ్యతను అంచనా వేసుకోకుండా రెండో పంట సాగు చేసి ఇబ్బందులు పడవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

## చెత్త డంపింగ్ యార్డుకు
## శాస్త్రీయ పరిష్కారాలు ఉన్నా..రాజకీయ కుట్రలు

వంద రోజులుగా ఆందోళనలు చేస్తున్నా..
పట్టించుకోరా : ప్రొఫెసర్ సతీష్



**ప్రజాపక్షం/కొత్తూరు:** చెత్త డంపింగ్ యార్డుకు శాస్త్రీయ పరిష్కారాలు ఎన్నో ఉన్నా..రాజకీయాలను అడ్డు పెట్టుకొని అనేక కుట్రలు చేస్తున్నట్లు తెలుస్తుందని ప్రొఫెసర్ సతీష్ పేర్కొన్నారు. ఆదివారం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో తీసుకువచ్చిన 641జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలకు ప్రొఫెసర్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సతీష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల పర్యావరణాన్ని రక్షించాల్సిన ప్రభుత్వం చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి రోగాల బారిన పడే విధంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భూమికి కేటాయిస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చెత్త డింపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు యత్నించి జీవో 641 తీసుకురావడం ఎంతవరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రశ్నించారు. చెత్త డంపింగ్ యార్డు వల్ల పర్యావరణం కాలుష్యం కావడంతోపాటు అక్కడి ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే అస్కారం ఉందని అన్నారు. సిద్దాపూర్‌లో చెత్త డింపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు దెబ్బతిని తాగునీరు కలుషితమయ్యే అస్కారం ఉంటుందని జెఏసి నేతలు రాంబల్‌నాయక్, పినపాక ప్రభాకర్ అన్నారు. డింపింగ్‌యార్డు చుట్టుపక్కల ఈగలు, దోమలు, క్రిమి కీటకాలు వంటి వ్యాధి కారకాలు పెరిగి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. సిద్దాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకుంటే బాగుంటుందని, ప్రజల ఆరోగ్యం, పర్యాతవరణం కంటే ఏ అభివృద్ధి ముఖ్యం కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాందాస్ నాయక్, జెఏసి కోకన్వీనర్ బిచ్యానాయక్, వి.గోపాల్‌నాయక్, నాగేష్ నాయక్, కుమార్ నాయక్, రాజు నాయక్, వెంకట్‌నాయక్, సూర్యనాయక్, విక్రమ్‌నాయక్, సంతోష్ నాయక్, భాస్కర్‌నాయక్, రమేష్ నాయక్, రాజేష్ నాయక్, సిద్దాపూర్ మహిళలు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీ
## గోల్డ్ మెడల్ సాధించిన విష్ణు చేతన



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్‌సి స్టాటిస్టిక్స్ కోర్సులో అత్యధిక మార్కులు సాధించి కరణం విష్ణు చేతన గోల్డ్ మెడల్ అందుకున్నారు. 2023–2025 విద్యా సంవత్సర బ్యాచ్‌కు చెందిన ఆమె, తన అసాధారణ ప్రతిభతో విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించి గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. జిల్లెలగూడ కార్పొరేషన్ పరిధిలోని ఓంసాయి నగర్ కాలనీ చెందిన కరణం శ్రీకాంత్‌రావు, కరణం నైంతార దంపతుల కుమార్తె అయిన విష్ణు చేతన ఈ ఘనత సాధించింది. ఆదివారం మాజీ కార్పొరేటర్ మేకల విజయలక్ష్మి, రవీందర్‌రెడ్డిలు తమ నివాసంలో కరణం విష్ణు చేతనను ఘనంగా సన్మానించారు. కష్టపడి చదివి అత్యధిక మార్కులు సాధించడం ద్వారా విద్యారంగంలో తన ప్రతిభను చాటుకున్న విష్ణు చేతనను అభినందించారు. ఉన్నత విద్యలో ప్రతిభకు గుర్తింపుగా లభించిన ఈ గోల్డ్ మెడల్ విష్ణు చేతన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రేరణగా నిలవనుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. విష్ణుచేతన కుటుంబసభ్యులు, విష్ణుప్రియ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ కమల్ మిత్రా మృతి



**న్యూఢిల్లీ:** ప్రముఖ విద్యావేత్త, ఎఐఎస్ఎఫ్ పూర్వ నాయకుడు, సిపిఐ జాతీయ సమితి మాజీ సభ్యుడు, ప్రొఫెసర్ కమల్ మిత్రా చెనోయ్ మరణం బాధాకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం వేరొక ప్రకటనలో సంతాపం ప్రకటించింది. జేఎన్‌యూఎస్‌యూ ఉపాధ్యక్షుడిగా స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్‌కు ఆయన అమూల్యమైన సేవలు అందించారని శ్లాఘించింది. జెఎన్‌యూ టీచర్ల అసోసియేషన్ (జెఎన్‌యుటిఎ) అధ్యక్షుడిగానూ గణనీయమైన సేవలు అందించారని కొనియాడింది. ఢిల్లీలోని మేధావి, అభ్యున్నతవాదుల్లో ఆయన ప్రముఖుడని... చర్చల్లో చురుకుగా పాల్గొనేవారని, తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించేవారని గుర్తుచేసింది. కమల్ మిత్రా మరణం ఢిల్లీ టీచర్లు, విద్యార్థి వర్గానికి తీరని లోటని సిపిఐ పేర్కొంది. తన ప్రగతిశీలఅభ్యుదయ విలువులకుగాను ప్రొఫెసర్ కమల్ మిత్రా ఎప్పటికీ గుర్తుండిపోతాయని వెల్లడించింది. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి అనీరాజా ఆదివారం కమల్ మిత్రా ఇంటికి వెళ్లి ఆయన భార్య, ప్రొఫెసర్ అనురాధతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించినట్లు తెలిపింది. కమల్ మిత్రా బంధుమిత్రులకు, విద్యార్థులకు, సహచరులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని సిపిఐ ప్రకటించింది.

# నిర్బంధాలకు భయపడేది లేదు

- ఇంతటి కర్కశత్వాన్ని ఎన్నడూ చూడలేదు: డి.రాజా
- దేశం మొత్తం జంతర్ మంతర్ కాగలదు: సందోశ్ కుమార్
- డి.రాజా, అనీరాజా అరెస్టుకు సిపిఐ ఖండన







**న్యూఢిల్లీ:** ఢిల్లీలో సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనపై మోదీ సర్కారు ఉక్కుపాదం మోపడాన్ని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తీవ్రంగా ఖండించారు. సిఇసిని కాపాడటం కోసం ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ఏం చేయడానికి వెనుకాడటం లేదని విమర్శించారు. ఢిల్లీని అష్టదిగ్బంధనం చేసి, నిర్బంధాల పర్వం కొనసాగించడాన్ని ఆక్షేపించారు. శాంతియుత నిరసన చేసే హక్కును హరిస్తూ... నిరంకుశత్వం ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. 'నిర్బంధాలకు భయపడబోం. మా పార్టీ చాలా చూసింది. బ్రిటిష్ పాలన, ఫ్రెంచ్ పాలన, పోర్చుగీస్ పాలనను ఎదుర్కొన్నది. వలసవాద విధానాలనుక వ్యతిరేకించింది. దేశానికి విముక్తి కల్పించింది' అని డి.రాజా అన్నారు. అరెస్టులకు బెదరబోమని డి.రాజా వక్కాణించారు. ఢిల్లీ పోలీసులు నిర్బంధించిన ప్రతి ఒక్కరిని తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరసనకారులపై ఒక్క ఎఫ్ఐఆర్ కూడా ఉండకూడదన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు, ఎంపి పి.సందోశ్ కుమార్ మాట్లాడుతూ, రోజూ అరెస్టులు, నిర్బంధాలు చేస్తూ ఉద్యమాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. 'మా నిరసన ఆగదు. నిరసనలు తెలియజేయడానికి మాకు నిర్దిష్ట స్థలాన్ని కేటాయించకపోతే, ఢిల్లీ నగరం మొత్తాన్నే అనేక జంతర్ మంతర్లుగా మారుస్తాం' అని హెచ్చరించారు. అధికార దురహంకారాని కి తాజా పరిణామాలు నిదర్శనమన్నారు. సిపి ఐ కార్యదర్శి అనీరాజా మాట్లాడుతూ నిర్బంధ ంలో ఉన్న వారిని కలిసేందుకు తనకు అనుమతి ఇవ్వలేదన్నారు. మహిళా నిరసనకారులతో పోలీసులు చాలా క్రూరంగా ప్రవర్తించారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. బెదిరింపులతోనో, క్రూరమైన బలప్రయోగంతోనో శాంతియుత నిరసన తెలిపే హక్కును అణచివేయలేరని నాయకులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం, రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కు పరిరక్షణ కోసం సిపిఐ తన పోరాటాన్ని కొనసాగిస్తుందన్నారు. డి.రాజా, అన్నీ రాజాను నిర్బంధించడమే కాకుండా ఏఐఎస్ఎఫ్‌ఏఐవైఎఫ్ కార్యకర్తలపై ఢిల్లీ పోలీసుల దమనకాండను సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. కన్నాట్ ప్లేస్‌లో నిరసన తెలిపేందుకు, జంతర్ మంతర్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన అన్నీ రాజాతో పోలీసులు దురుసుగా వ్యవహరించారని పేర్కొంది. ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జిందర్ మహేశరి, ఏఐవైఎఫ్ అధ్యక్షుడు రౌషన్ కుమార్ సిన్హా, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్‌పై పోలీసులు దాడి చేయడం, నిర్బంధించడం దారుణమని పేర్కొంది. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ కార్యకర్తలు వందల మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు సమాచారం అందిన వెంటనే డి.రాజాతో పా టు పి. సందోశ్ కుమార్, కె. ప్రకాశ్ బాబు, అన్నీ రాజా ఘటనా స్థలానికి చేరుకున్నారని వెల్లడించింది. అరెస్టయిన కార్యకర్తలను కలిసే ందుకు వెళుతున్న నాయకులు పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపింది. ప్రజాస్వామ్య హక్కులపై, శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగ హక్కుపై జరిగిన ఈ దాడుల ను సిపిఐ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటన పేర్కొంది. నరేంద్ర మోదీ, అమిత్ షా ఆదేశాల మేరకే ఢిల్లీ పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని నాయకులు ఆగ్రహం వ్యక్తంచేసినట్లు వెల్లడించింది.నిరసనకారులపై కేసులు కొట్టివేయాలని, వారిని తక్షణమే విడుదల చేయాలని, ఢిల్లీ పోలీసుల తీరుపై తగిన చ ర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది.

## యువతపై పోలీస్ జులుం

- 200 మందికిపైగా అరెస్టు
- నిర్బంధంలో వేలాది మంది
- ఎఐవైఎఫ్ ఖండన
- తక్షణమే విడుదల చేయాలని డిమాండ్

**న్యూఢిల్లీ:** విద్యార్థులు, యువజనులతో ఢిల్లీ పోలీసులు దుర్మార్గంగా ప్రవర్తించారని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విమర్శించింది. కన్నాట్ ప్లేస్ వద్ద నిరసనలో పాల్గొన్న 200 మందికిపైగా విద్యార్థులు, యువజన నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. ఏఐవైఎఫ్‌ఏఐఎస్ఎఫ్ సభ్యుల అరెస్టులను ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. బలం ప్రయోగించి వేలాది మందిని నిర్బంధించాంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఎన్నికల విధానంలో సంస్కరణలు, పారదర్శకతకు హామీ ఇవ్వడం కోసం ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ప్రజాస్వామ్య హక్కులు, స్వేచ్ఛపారదర్శక ఎన్నికల పరిరక్షణ కోసం గొంతు వినిపించకుండా అణచివేసేందుకు జరిగిన ప్రయత్నంగా పోలీసుల చర్యలను దుయ్యబట్టింది. నిర్బంధంలోకి తీసుకున్న ఏఐఎస్ఎఫ్‌ఏఐవైఎఫ్ సభ్యులు అందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జిందర్ మహేశ్వరి, అధ్యక్షుడు రౌషన్ కుమార్, కార్యదర్శి హరీశ్ బాలా, ఏఐఎస్ఎఫ్ దినేశ్ శ్రీరంగరాజ్, ఎన్‌డబ్ల్యూసీ సభ్యులు రఘునందన్ సోని, లక్కీ జైశ్వాల్‌తో పాటు ఏఐఎస్ఎఫ్ సభ్యులు అనికేత్ మద్కే, మోహిత్, గులాబ్, విశాల్ తదితరులు అరెస్టు అయినట్లు ప్రకటన తెలిపింది. వీరందరినీ వేర్వేరు ప్రాంతాలకు పోలీసులు తరలించారని పేర్కొంది. తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు పోరాటం ఆగబోదని విద్యార్థి సంఘాలు పునరుద్ఘాటించినట్లు వెల్లడించింది.

### ఢిల్లీ నిరసనల్లో శాంతియుతంగా గుమిగూడే...

# ప్రజలను చట్టవిరుద్ధంగా నిర్బంధించొద్దు

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో నిరసనల కారణంగా మెట్రో, రైలు సేవలను పూర్తిగా నిలిపివేయకూడదన్న తన ఆదేశాలను ఉల్లంఘించినట్లు ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రానికి నోటీసు జారీ చేసిన సుప్రీం కోర్టు, శాంతియుతంగా గుమిగూడే ప్రజలను చట్టవిరుద్ధంగా నిర్బంధించకూడదని ఆదివారం ఆదేశించింది.ఒక ప్రత్యేక విచారణలో, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, శాంతిభద్రతల పరిస్థితులకు లోబడి, ఢిల్లీ మెట్రో దాని సాధారణ షెడ్యూల్ ప్రకారం పనిచేసేలా, ఇంటర్నెట్ సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరింది. అక్టోబరు 9, 2026 నాటికి మా మునుపటి ఉత్తర్వును ఉల్లంఘించారని ఆరోపిస్తూ, అలాగే, అక్టోబరు 10, 2026న ఢిల్లీలో పెద్ద సంఖ్యలో వ్యక్తులను అక్రమంగా నిర్బంధించారని ఆరోపిస్తూ దాఖలైన అత్యవసర దరఖాస్తు దృష్ట్యా ఈ న్యాయస్థానం అత్యవసర విచారణ కోసం సమావేశమైంది. నిర్దేశాలను ఘోరంగా ఉల్లంఘించారని సీనియర్ న్యాయవాదులు వాదించారు. మెట్రో రైల్వే పనిచేయడం లేదు. న్యూఢిల్లీ, నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లు మూసివేయబడ్డాయి. ఎలాంటి ట్రాఫిక్ హెచ్చరికలు జారీ చేయలేదు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్),2023లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞల పరిధిలోకి వచ్చే ప్రాంతం దాటి కూడా పెద్ద సంఖ్యలో వ్యక్తులు అనవసర వేధింపులకు, చట్ట విరుద్ధ నిర్బంధాలకు గురయ్యారు' అని ధర్మాసనం పేర్కొంది. న్యాయవాదులు, పాత్రికేయులు, ఇతరులు తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తించడంలో ఎలాంటి ఆటంకాలు ఎదుర్కోకుండా చూడాలని కూడా సుప్రీంకోర్టు తుషార్ మెహతాను కోరింది. విచారణ సందర్భంగా అక్టోబరు 10న, మెట్రో నెట్‌వర్క్‌లోని 303 స్టేషన్లలో కేవలం 45 స్టేషన్లలో మాత్రమే ప్రవేశం, నిష్క్రమణను నియంత్రించారని మెహతా సమర్పించారు. విచారణ ప్రారంభం కాగానే, కోర్టు నిబంధనలను అధికారులు బహిరంగంగా ఉల్లంఘించారని ఆరోపిస్తూ, వారిపై కోర్టు ధిక్కార చర్యలు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరుపుతూ, న్యాయవాదులందరి వాదనలు వింటామని సుప్రీంకోర్టు తెలియజేసింది.రాజకీయ నాయకుల నిర్బంధానికి వ్యతిరేకంగా సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి దాఖలు చేసిన హెబియస్ పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు విచారిస్తోంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ధిక్కార పిటిషన్‌లో కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డి. తారాలను ప్రతివాదులుగా చేర్చారు. నిరసనల దృష్ట్యా 57మెట్రో స్టేషన్లను మూసివేయడం, ఢిల్లీకి రైళ్లను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన వేరొక పిటిషన్‌పై విచారణ సందర్భంగా,అక్టోబరు 9న సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వును ఈ పిటిషన్‌లో ప్రస్తావించారు. ఎన్నికల సంఘం పనితీరులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి), కొన్ని విద్యార్థి సంఘాలు నిరసనకు పిలుపునిచ్చాయి. సిజెపి నాయకుడు అభిజీత్ దీప్కే, పలువురు ప్రతిపక్ష నాయకులు, యూ ట్యూబర్ ధ్రువ్ రాథీతో సహా 7,000మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకోవడం, అపూర్వమైన భద్రతా నిర్బంధం తర్వాత శనివారం జంతర్‌మంతర్ వద్ద జరగాల్సిన భారీ సమీకరణను ప్రభుత్వం అడ్డుకుంది.




### ఢిల్లీలో నిరసనలపై... 'సుప్రీం' దిశానిర్దేశాలు

**న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిరసనల కారణంగా ఢిల్లీలో మెట్రో రైలు సేవలకు సంబంధించి కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారన్న ఆరోపణలపై ధిక్కార చర్యలు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రానికి నోటీసు జారీ చేసిన సుప్రీం కోర్టు, ఆదివారం ఒక ప్రత్యేక సిట్టింగ్‌లో పలు కీలక ఆదేశాలను జారీచేసింది. జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కింది ఆదేశాలను ఆమోదించినవి జారీచేసింది.

* చట్టం ద్వారా నిర్దేశించబడిన విధానానికి అనుగుణంగా తప్ప, శాంతియుతంగా సమావేశమైన ప్రజలను చట్టవిరుద్ధంగా నిర్బంధించరాదు.
* సాధారణ ఢిల్లీ మెట్రో, రైల్వే సేవలను పునరుద్ధరించడం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (2) ప్రకారం సమర్థనీయమైనప్పుడు మాత్రమే ఆంక్షలు అనుమతించబడతాయి.
* శాంతిభద్రలకు లోబడి ఇంటర్నెట్ సేవల నిబంధనలను పునరుద్ధరించాలి.
* ట్రాఫిక్ నిబంధలనకు లోబడి ప్రలజ స్వేచ్ఛా సంచారం ; బారికేడ్ల అవసరాన్ని సమీక్షించాలి.
* న్యాయవాదులు, పాత్రికేయులు, ఇతరులు, తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తించడంలో ఆటంకాలు ఎదుర్కోకూడదు.
* ముఖ్యంగా బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలులో ఉన్న ప్రాంతాల వెలుపల శాంతియుత సమావేశాలను చట్టానికి అనుగుణంగా అనుమతించాలి.
* సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలకు నిరాటంకమైన ప్రదేశాన్ని నిర్ధారించడానికి, సుప్రీంకోర్టు సమీపంలో సెక్షన్ 163 ఆంక్షలను ప్రకటించే ఏదైనా నోటీసు బోర్డు ఇంకా ఉన్నట్లయితే, దానిని తప్పనిసరిగా తొలగించాలి.
* సామూహిక నిర్బంధాలు, ఇతర సంబంధిత విషయాలను ఆరోపిస్తూ, దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్లను అక్టోబరు 13న ప్రధాన కేసులతో పాటు విచారిస్తారు.
* నిరసనలు శాంతియుతంగా ఉండాలని, ఇతరులను రెచ్చగొట్టకూడదని నిరసనకారులు గుర్తుచేశారు.
* అక్టోబరు 32 ప్రకారం ప్రాథమిక హక్కులను పరిరక్షించి, అమలుపర్చడం సుప్రీంకోర్టు విధి.

# షరతులపై సిజెపి నేతల విడుదల

- ఏడాది పాటు శాంతికి భంగం కలిగించొద్దని షరతు
- రూ. 50 వేల పూచీకత్తు బాండ్ సమర్పణ



**న్యూఢిల్లీ :** జంతర్ మంతర్ నిరసనకు ముందు ఢిల్లీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నాయకులు అభిజీత్ దీప్కే, అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను ఆదివారం ఉదయం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అనంతరం వారిని విడుదల చేశారు. సంవత్సరం పాటు శాంతికి భంగం కలిగించకూడదనే షరతుపై వారిని విడుదల చేసినట్లు సిజెపి న్యాయ వ్యవహారాల అధిపతి రత్న సింగ్ తెలిపారు. ఈ ముగ్గురు నాయకుల విడుదలను సిజెపి ఒక భారీ న్యాయ విజయంగా అభివర్ణించింది. 'ఢిల్లీ పోలీసులు దాదాపు 24 గంటల పాటు చట్టవిరుద్ధంగా ముందుజాగ్రత్తగా నిర్బంధించిన సిజెపి నాయకులు అభిజిత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ఢిల్లీ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు విడుదల చేసింది అని సిజెపి ఆ ప్రకటనలో పేర్కొంది. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, జవాబుదారీతనం కోరుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేస్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాజధాని అంతటా జరుగుతున్న నిరసనల నేపథ్యంలో, ఈ ఏకపక్ష అరెస్టులు తీవ్ర విమర్శలకు, చట్టపరమైన సవాళ్లకు దారితీశాయి అని సిజెపి ఎక్స్‌లో పేర్కొంది. చివరకు అభిజీత్ దీప్కే, అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను విడుదల చేయక తప్పని పరిస్థితి ఢిల్లీ పోలీసులకు ఏర్పడిందని, బొద్దింకలు ఎప్పటికీ చావవు అని స్పష్టం చేసింది. అంతకుముందు ఎక్స్‌లో చేసిన ఒక పోస్ట్‌లో అన్ని చట్టపరమైన ప్రక్రియలను అనుసరించి ఈ అరెస్టులు జరిగాయని, వారిని ఆదివారం ఢిల్లీ కంటోన్మెంట్‌లోని ఎస్ఇఎం కోర్టు ముందు హాజరుపరిచామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఒక సంవత్సరం పాటు శాంతిభద్రతలు, సత్ప్రవర్తనగా మెదిలేందుకు గానూ రూ. 50,000 పూచీకత్తుపై బెయిల్ బాండ్ దాఖలు చేయగా, వారిని ఎస్ఇఎం కోర్టు విడుదల చేసింది అని అది పేర్కొంది. ఢిల్లీలో అపూర్వమైన భద్రతా చర్యల మధ్య శనివారం సిజెపి నాయకులను నిర్బంధించారు. అక్కడ 7,000 మందికి పైగా నిరసనకారులను పలుచోట్ల నిర్బంధించడంతో, వారు జంతర్ మంతర్ వద్దకు చేరుకోలేకపోయారు.

**యూట్యూబర్ ధ్రువ్ రాఠీ రిలీజ్**

జంతర్ మంతర్ వద్ద సిజెపి నిరసన కార్యక్రమానికి ముందు ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న యూట్యూబర్ ధ్రువ్ రాఠీని శనివారం అర్ధరాత్రి విడుదల చేసినట్లు ఆదివారం ఒక అధికారి తెలిపారు. 'నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ ఆయన జంతర్ మంతర్ వద్దకు వెళ్లడానికి ప్రయత్నిస్తే, మళ్లీ అదుపులోకి తీసుకోవచ్చు లేదా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు' అని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. శనివారం గురుగ్రామ్‌లోని సెక్టార్ 56లో ఉన్న తన నివాసం వద్ద రాఠీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలో అపూర్వమైన భద్రతా ఆంక్షల మధ్య ఈ అదుపులోకి తీసుకునే చర్యలు చేపట్టారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో 7,000 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి. కాగా, నిరసన కార్యక్రమానికి ముందు, సాధారణ దుస్తుల్లో ఉన్న వ్యక్తులు తన నివాసం నుండి తనను అపహరించారని యూట్యూబర్ ధ్రువ్ రాఠీ ఆదివారం ఆరోపించారు. శనివారం ఉదయం 7 గంటల సమయంలో తాను నిద్రిస్తుండగా సాధారణ దుస్తుల్లో ఉన్న సుమారు 20 మంది వ్యక్తులు తన ఇంట్లోకి ప్రవేశించారని రాఠీ ఎక్స్‌లో తెలిపారు. వారు ఎవరో అడిగే లోపే వారు తనను తీసుకెళ్లారని ఆయన పేర్కొన్నారు. తనను వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లారని, సుమారు 22–23 గంటల పాటు తన న్యాయవాదిని సంప్రదించడానికి లేదా ఫోన్ వాడటానికి అనుమతించలేదని రాఠీ చెప్పారు. తన పడకగది నుండి బయటకు తీసుకెళ్తున్నప్పుడు తనకు గాయాలయ్యాయని కూడా ఆయన ఆరోపించారు. 'నన్ను అదుపులోకి తీసుకోలేదు, నన్ను అపహరించారు,' అని ఆయన తన అనుభవాన్ని వివరిస్తూ, తన నివాసం నుండి తనను తీసుకెళ్లిన తీరును ప్రశ్నించారు. తన పౌరసత్వం గురించి వస్తున్న వదంతులపై స్పందిస్తూ, రాఠీ వీడియోలో తన పాస్‌పోర్ట్‌ను చూపించి, తాను భారతీయ పౌరుడినని స్పష్టం చేశారు. నిరసనలో పాల్గొనే ఉద్దేశం తనకు లేదన్న వాదనలను కూడా ఆయన తోసిపుచ్చారు.

## సిఎం విజయ్‌తో కలిసి తమిళనాడును ముందుకు తీసుకెళ్తాం: నరేంద్ర మోదీ

**చెన్నై :** తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఒకే వేదికను పంచుకున్నారు. రాష్ట్రాల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని తెలిపిన ప్రధాని మోదీ.. సిఎం విజయ్‌తో కలిసి తమిళనాడు అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. చెన్నై ట్రేడ్ సెంటర్, ఐఐటి మద్రాస్ ఆవరణలోని కేంద్రీయ విద్యాలయ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో రూ. 13,000 కోట్లకు పైగా విలువైన పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఫేజ్2 కింద కారిడార్4లోని పూనమల్లి వడపళని మార్గాన్ని (సుమారు 15 కిలోమీటర్లు, 11 స్టేషన్లు) ప్రధాని మోదీ, సిఎం విజయ్‌తో కలిసి ప్రారంభించారు. పూనమల్లి బైపాస్ నుంచి పోరూర్ వరకు ఇరు నేతలు కలిసి మెట్రో రైలులో ప్రయాణించి, విద్యార్థులు, పౌరులతో ముచ్చటించారు. ప్రధాని మోదీ యుపిఐ ద్వారా మెట్రో టికెట్ కొనుగోలు చేయడం విశేషం. భారత తయారీ రంగం పెరగడంలో తమిళనాడు పాత్ర కీలకమని ప్రధాని ప్రశంసించారు.2014 నుంచి భారతదేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్ నిలిచిందని పేర్కొన్నారు. వేగవంతం చేస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు.

### న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని

# 'సుప్రీం' పునరుద్ధరించింది

స్వాగతించిన రాజ్యసభ ఎంపి, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో నిరసనలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు, దిశానిర్దేశాలను రాజ్యసభ ఎంపి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఆదివారం స్వాగతించారు. ఈ ఉత్తర్వుదేశ న్యాయవ్యవస్థపై ప్రజలు, నిపుణులలో విశ్వాసాన్ని పునరుద్ధరించిందని తెలిపారు. 'ఈ దేశ న్యాయవ్యవస్థపై ప్రజలు, అలాగే నిపుణుల విశ్వాసాన్ని పునరుద్ధరించే ఉత్తర్వును జారీచేసినందుకు భారత సుప్రీంకోర్టుకు మేం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం'అని సిబల్ పేర్కొన్నారు. శాంతియుతంగా గుమిగూడిన ప్రజలను చట్టవిరుద్ధంగా నిర్బంధించకూడదని, శాంతిభద్రతల పరిస్థితులకు లోబడి ఢిల్లీ మెట్రో సేవలు, షెడ్యూల్ ప్రకారం పనిచేసేలా, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని కేంద్రాన్ని కోరుతూ సుప్రీంకోర్టు ఆదివారం ఆదేశించింది.న్యాయవాదులు, పాత్రికేయలు, ఇతరులు తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తించకుండా అడ్డుకోకూడదని కూడా న్యాయమూర్తులు జస్టిస్‌జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి), కొన్ని విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన నిరసన దృష్ట్యా ఢిల్లీలో మెట్రో, రైలు సేవలపై ఆంక్షలకు సంబంధించి , అక్టోబరు 9న జారీచేసిన ఉత్తర్వులను అధికారులు ఉల్లంఘించారని ఆరోపిస్తూ, వారిపై ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసు జారీ చేసింది. అక్టోబరు 10న మెట్రో సేవలకు అంతరాయం కలిగిందని,న్యూఢిల్లీ, నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లు మూసివేయబడ్డాయని, పెద్ద సంఖ్యలో ప్రజలు వేధింపులకు, అక్రమ నిర్బంధాలకు గురయ్యారని కోర్టులో దాఖలైన దరఖాస్తులలో ఆరోపించబడింది. ఎన్నికల పనితీరులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఈ నిరసన చేపట్టారు.

# ఉద్రిక్తంగానే మణిపూర్

రెండవ వర్గాల మధ్య ఘర్షణలు : 9కి చేరిన మృతుల సంఖ్య



**ఇంఫాల్ :** మణిపూర్‌లోని హింసాత్మక పరిస్థితులు నెలకొన్న కొండ ప్రాంత జిల్లాల్లో ఆదివారం ఉద్రిక్తత కొనసాగింది. రెండు వర్గాల మధ్య జరిగిన తాజా ఘర్షణల్లో మరణించిన వారి సంఖ్య తొమ్మిదికి చేరింది. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి వై. ఖేమ్‌చంద్ సింగ్ శాంతి, సంయమనం పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేయడంతో పాటు, పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్ర, శనివారాల్లో కామ్‌జోంగ్, ఉఖ్రుల్, కాంగ్‌పోక్పి జిల్లాల్లో ఈ తాజా హత్యలు జరిగాయి. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ముఖ్యమంత్రి, 'నిరపరాధులైన పౌరుల హత్యలను, హింసను ఖండిస్తున్నాను... పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి, శాంతిభద్రతలను పునరుద్ధరించడానికి, పౌరులందరి భద్రతను కల్పించడానికి తక్షణ, సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాను' అని పేర్కొన్నారు. పరిస్థితిని సద్దుమణిగేలా చేయడానికి సంయమనం పాటించాలని, అలాగే శాంతి, చర్చలు, సామరస్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సింగ్ అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు హింస తీవ్రంగా ఉన్న కాంగ్‌పోక్పి, కామ్‌జోంగ్ జిల్లాలకు అదనపు భద్రతా బలగాలను పంపినట్లు అధికారులు తెలిపారు. నాగాల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న కామ్‌జోంగ్ జిల్లాలోని కుకీప్రాబల్య గ్రామం 'చస్సాద్'లో, శుక్రవారం రాత్రి ఐదుగురు పిల్లల తల్లి అయిన 22 ఏళ్ల మహిళను గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపడంతో ఈ తాజా హింసాకాండ మొదలైంది. ఆమె హత్యతో కుకీ, నాగా సాయుధ వర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి, ఇవి శనివారం ఉదయం వరకు కొనసాగాయి. ఈ ఘర్షణల్లో 42 ఏళ్ల వ్యక్తి మరణించగా, 10 ఇళ్లకు నిప్పు పెట్టారు. తదుపరి హింసను నివారించడానికి ఆ గ్రామంలో సెక్షన్ 162 కింద నిషేధాజ్ఞలు విధించారు. చస్సాద్ ఘటన తర్వాత, శనివారం నాడు కాంగ్‌పోక్పి జిల్లాలోని టపోన్, మకుయ్ గ్రామాలపై అనుమానిత మిలిటెంట్లు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు నాగా గ్రామ రక్షకులు (విలేజ్ గార్డ్స్) ఎం. డైమై, ఆర్. గంగ్మెయ్ అలాగే రింగ్‌కాంగ్‌మై అనే మరో వ్యక్తి మరణించినట్లు అధికారులు తెలిపారు. అజిన్‌బోయు ఆర్ అనే 52 ఏళ్ల గ్రామస్తుడిని మిలిటెంట్లు తల నరికి చంపారని వర్కింగ్ కమిటీ జెటిసి మణిపూర్ అనే నాగా పౌర సమాజ సంస్థ ఆరోపించింది. గౌరవప్రదమైన అంత్యక్రియల కోసం నరికివేసిన తలను తిరిగి అప్పగించాలని ఆ సంస్థ డిమాండ్ చేసింది. శనివారం కామ్‌జోంగ్ జిల్లాలోని భారత్‌మయన్మార్ సరిహద్దు సమీపంలో ఉన్న 'టాంగ్‌ఖుల్ నాగా' నివాస ప్రాంతమైన నింగ్‌చౌ గ్రామంలోకి చొరబడిన అనుమానిత మిలిటెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 35 ఏళ్ల నాచాన్సో నింగ్‌షెన్, 48 ఏళ్ల లీషిషాన్ లీషాడాంగ్ అనే ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన తర్వాత భద్రతా దళాలు గ్రామానికి చేరుకున్నాయి. కాల్పులు జరిపిన అనంతరం దాడి చేసిన వారు మయన్మార్ వైపు పారిపోయారని స్థానికులు చెబుతున్నారు. ఉఖ్రుల్‌లో, శనివారం నాడు చెపు యావోలెన్ గ్రామం సమీపంలో సందీప్ రాయ్ (40) అనే వ్యక్తి కారుపై అనుమానిత మిలిటెంట్లు కాల్పులు జరపడంతో అతను మరణించాడు. ఇంఫాల్ లోయకు చెందిన మైతేయిలు, సమీప కొండ ప్రాంతాలకు చెందిన కుకీల మధ్య గతంలో జరిగిన జాతి ఘర్షణల్లో 300 మందికి పైగా మరణించగా, 49 మంది అదృశ్యమయ్యారు, వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

# ప్రతిఘటన కాదు... హక్కుల పోరాటం

- 'నేడు' ఢిల్లీలో కాంగ్రెస్, ఇండియా కూటమి, యువజన సంఘాలు నిరసన ప్రదర్శనలు
- ఇది రెండవ స్వాతంత్ర్య పోరాటం : కెసి వేణుగోపాల్



**కన్నూర్ :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నేడు (ఈనెల 12న) ఢిల్లీలో నిరసన ప్రదర్శన కొనసాగిస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడేందుకు 'రెండవ స్వాతంత్ర్య పోరాటం'గా ఆయన అభివర్ణించారు. ఆదివారం కేరళలోని కన్నూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు, దేశంలోని యువత నిరసనలో పాల్గొంటాయని చెప్పారు. పార్టీ కార్యకర్తలు ఢిల్లీకి చేరుకోకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వారు బస చేసిన ప్రదేశాలలో సోదాలు నిర్వహిస్తున్నారని వేణుగోపాల్ ఆరోపించారు. 'ఇవన్నీ చేసినప్పటికీ, ఈ పోరాటం విఫలం కాదు. ఢిల్లీలో మరింత శక్తివంతమైన పోరాటం జరగబోతోంది. ప్రతిపక్షం ఏకమై, ఒకే శక్తిగా నిలబడింది' అని ఆయన అన్నారు. కొనసాగుతున్న ఈ ఆందోళనను దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం జరుగుతున్న పోరాటంగా అభివర్ణించిన వేణుగోపాల్, ఇది కేవలం నిరసన లేదా ప్రతిఘటన మాత్రమే కాదని, పౌరుల ఓటు హక్కులను కాపాడే పోరాటమని పేర్కొన్నారు. 'దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఇది అత్యంత శక్తివంతమైన పోరాటం. ఇది దేశ ఓటర్ల ఓటు హక్కులను కాపాడే పోరాటం' అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో పౌరుల ఉనికికి ఓటు హక్కు ప్రాథమికమైనదని పేర్కొన్న వేణుగోపాల్, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనపరచబడుతున్నాయని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ బిజెపి ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. 'భారతదేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమయ్యాయి, అన్ని సంస్థలు ఒక్కటయ్యాయి. దీనిని రెండవ స్వాతంత్ర్య పోరాటంగా పిలవదగిన స్థాయి పోరాటం జరుగుతోంది' అని ఆయన అన్నారు. ఈ ఆందోళనను అడ్డుకునేందుకు ఢిల్లీలో భారీ సంఖ్యలో పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించారని, వివిధ రాష్ట్రాల నుండి బలగాలను రప్పించారని వేణుగోపాల్ ఆరోపించారు. 'ఇదంతా దేనికోసం? యుద్ధం కోసమా? ఎవరితో యుద్ధం? భారతదేశ పౌరులతో, సామాన్య ప్రజలతోనా?' అని ఆయన ప్రశ్నించారు. గతంలో ఇండియా కూటమి నిరసన సందర్భంగా ప్రతిపక్ష నాయకులను అదుపులోకి తీసుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, పోలీసులు, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది వారి పట్ల అనుచితంగా ప్రవర్తించారని వేణుగోపాల్ ఆరోపించారు. ప్రజలు నిరసనలో పాల్గొనకుండా నిరోధించడానికి ఢిల్లీలోని హాస్టళ్లు, ప్రైవేట్ నివాసాలపై దాడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఓటు హక్కులను పరిరక్షించే తమ పోరాటాన్ని ఓడించలేవని వేణుగోపాల్ స్పష్టం చేశారు.

# ట్రంప్‌కు స్వదేశంలో రష్యా డీజిలు మంట

## ఒప్పందం అడ్డుకునేందుకు బిల్లు




**వాషింగ్టన్:** రష్యా నుండి డీజిలు దిగుమతికి ఒప్పందం చేసుకున్న డోనాల్డ్ ట్రంప్ వైఖరిపై అమెరికాలో తీవ్ర ఆగ్రహం పెల్లుబుకుతోంది. ట్రంప్ సొంతపార్టీలోని రిపబ్లికన్లు ఆయనపై మండిపడుతున్నారు. ట్రంప్ సొంత పార్టీకి చెందిన రిపబ్లికన్ సభ్యుడు బ్రియాన్ ఫిట్జ్ ప్యాట్రిక్ ఈ డీజిలు ఒప్పందాన్ని అడ్డుకునేందుకు ఒక బిల్లు కాంగ్రెస్‌లో ప్రవేశపెడతానని చెప్పారు. త్వరలో పదవినుండి వైదొలగనున్న మరో రిపబ్లికన్ సభ్యుడు డాన్ బేకన్ ఆయన ప్రకటనకు మద్దతు ప్రకటించారు.కానీ అమెరికా ప్రతినిధుల సభ పదవీకాలం జనవరిలో ముగియనున్నది.అందువల్ల ఈ బిల్లును ఆమోదానికి పెట్టాలంటే వారికి చాలా తక్కువ సమయం మాత్రమే ఉంది. అందువల్ల ఇది ఆచరణాత్మకంగా కనిపించడంలేదు. ఐతే రష్యాతో డీజిలు ఒప్పందం ట్రంప్ ఆపద్ధర్మంగా మరోదారి లేక చేసుకున్నప్పటికీ,దేశంలో దిగ్భ్రాంతితోపాటు తీవ్ర వ్యతిరేకత సర్వత్రా వ్యక్తమవుతోంది.పైగా ఈ డీజిలు ఒప్పందం ద్వారా ప్రపంచదేశాలను ఆశ్చర్య పరచిన ట్రంప్,మరునాడే ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని సాగనంపేందుకు సమయం ఆసన్నమైందని ప్రకటించి మరో షాక్ ఇచ్చారు. పుతిన్‌తో యుద్ధంలో జెలెన్‌స్కీ గెలవలేకపోయారని,యుద్ధాన్ని ముగించడంలో అసమర్ధుడయ్యారని ట్రంప్ చెప్పడం వింతగా కనిపించింది. కానీ బ్రిటన్ వంటి దేశాలు మాత్రం ట్రంప్ ప్రకటన తర్వాత జెలెన్‌స్కీకే మద్దతు ఇచ్చాయి.

రష్యా నుండి తక్షణం 3,00,000 టన్నుల డీజిలు దిగుమతికి ట్రంప్ ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత విడతల వారీగా చమురు దిగుమతికి అంగీకారం కుదిరింది.ఈ పరిస్థితుల్లో రష్యాపై ఉక్రేన్ డ్రోన్ దాడులు చేయడాన్ని ట్రంప్ వ్యతిరేకించడాన్ని జెలెన్‌స్కీ ద్వంద్వ వైఖరిగా పరిగణిస్తున్నారు.మధ్యంతర ఎన్నికలలో తీవ్ర వ్యతిరేకత,సంక్షోభంలో ఉన్న ట్రంప్ ఓటర్లను తనవైపు తిప్పుకోవడానికి రష్యా నుండి డీజిల్ దిగుమతులకు సిద్ధపడ్డారు.మరోవైపు ఆదివారంనాడు రష్యాపై ఉక్రేన్ తన దాడులు తీవ్రతరం చేసింది.వరుసగా నాలుగోరోజు కూడా మూడో డేటా సెంటరు మౌలిక సదుపాయాలను డ్రోన్లతో ధ్వంసం చేసింది.మాస్కోకు తూర్పుగా వ్లాదిమీర్‌లో ఈ డేటా సెంటర్ ఉంది.ఈ డేటా సెంటర్ ద్వారా అనేక డజన్ల రష్యా నగరాలకు సేవలు అందుతూ ఉంటాయి.

# నేపాల్ గోర్ఖా జిల్లాలో మెరుపు వరదలు

- కొట్టుకుపోయిన ఇళ్ళు, వంతెనలుః10 మంది గల్లంతు
- ఎస్ఎంఎస్ సందేశాలతో ప్రజలు అప్రమత్తం
- హెలికాప్టర్ల ద్వారా 47 మంది ప్రాణాలు సేఫ్
- ఐదు మీటర్ల ఎత్తున బురద, రాళ్ళతో నీటి ప్రవాహం



**కాఠ్మండు:** నేపాల్‌లో మరోసారి మెరుపు వరదలు సంభవించాయి. గోర్ఖా ప్రాంతంలోని బుధి గండకి నదికి ఆకస్మికంగా వరదలు రావడంతో తీర ప్రాంతంలో 40 ఇళ్ళు,కీలక వంతెనలు,కాలిబాట వంతెనలతోపాటు బుధి గండకి నదిపై నిర్మిస్తున్న 341 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్యమైన మౌలిక సదుపాయాలు కొట్టుకుపోయాయి.ఈ ఘటనలో ఛుమ్‌ఛెట్‌లోని ఉంగిలంగ్ నదీ తీరాన నివసిస్తున్న నకలుగురు సహా మొత్తంగా 10 మంది గల్లంతైనట్లు సమాచారం.ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఎంత మేరకు నష్టం జరిగిందనే విషయంపై అధికారులు ఆరాతీసి అంచనాలు వేయడం ప్రారంభించారు. ఉదయం ఏడు గంటలకల్లా హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. తుది సమాచారం నాటికి 47 మందిని సహాయ సిబ్బంది కాపాడారు. 450 మంది సహాయబృంద సభ్యులు గాలింపు ప్రారంభించారు.

కొండ ప్రాంతాల్లో చరియలు విరిగిపడటంలో నదీ ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడి నీరు ఊళ్ళమీద పడిందని ప్రాథమికంగా అంచనావేశారు. ఆ ప్రాంతంలో ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్ళి తలదాచుకోవాలని ప్రభుత్వం తక్షణ ఆదేశాలు జారీ చేసింది. బుధి గండకి నదికి భారీ వరదనీటి సమస్యవల్ల గోర్ఖాజిల్లాలోని చుమ్నుబ్రీ,ధర్చే గ్రామీణ మున్సిపల్ ప్రాంతాలకు తీరని నష్టం వాటిల్లింది. నీరు ఈ పౌర నివాస ప్రాంతాల్లోకి వచ్చి పడింది. జగత్‌బాగర్, సల్లేరీ, ఘట్టికోలా, ఛుమ్నుబ్రీ మున్సిపల్ ప్రాంతాలకు తీరని నష్టం వాటిల్లింది. జాతీయ ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ధర్మరాజ్ ఉప్రెటీ చెప్పిన సమాచారం ప్రకారం,ఇప్పటివరకూ ఎవ్వరూ మరణించలేదు. రెండు నెలలక్రితం భోటే కోషి నదికి వచ్చిన భయంకరమైన జలవిలయ అనుభవాల నేపథ్యంలో ప్రజలకు తక్షణ ఎస్ఎంఎస్ సందేశాలు వెళ్ళాయి. ప్రజలు నీటి బీభత్సం బారిన పడకుండా సురక్షిత ప్రాంతాలకు పారిపోయి తప్పించుకున్నారు.పెను ఆకస్మిక ప్రమాదం ముంచుకువస్తున్నట్లు ఆదివారం ఉదయం 6.20 గంటల సమయంలో సందేశం రావడంతో తదుపరి ఇరవై నిమిషాల వ్యవధిలో ప్రజలకు ఎస్ఎంఎస్ సందేశాలు వెళ్ళాయి. సహాయబృందాలను రంగంలోకి దించారు. నష్టాన్ని అంచనావేస్తున్నట్లు ధర్మరాజ్ ఉప్రెటీ చెప్పారు. ఉత్తర హిమాలయన్ ప్రాంతం వెంట ఉన్న సిర్దిబస్, జగత్, యారు, తటోపని, మచ్చికోలా, సోటీ, అరుఖెట్, అరుఘాట్ పల్లపు ప్రాంతాలపైకి భారీ వరదనీరు కట్టుతెంచుకుని మీదపడుతున్నట్లు సమాచారం రావడంతో ప్రజలను అప్రమత్తం చేసి వెళ్ళిపొమ్మని ఆదేశించారు. ఈ ప్రాంతాలలో ఐదు మీటర్ల ఎత్తున మట్టి బురద, రాళ్ళతో వరదనీరు ప్రవహిస్తోంది. భోట్‌కోషి, త్రిశూలీ నదుల్లో భయంకరమైన నీటి ఉధృతిని ఈ జల ప్రవాహం తలపిస్తోంది.

# జిబూటీలో వలస పడవ మునక

## 109 మంది మృతిః116 గల్లంతు



**జిబూటీ నగరం:** ఆఫ్రికాఖండం సోమాలియా ద్వీపకల్పదేశం జిబూటీ తీరంలో అక్టోబరు 8–9 తేదీల్లో ఒక వలస పడవ బోల్తాపడి నీట మునిగిపోవడంతో 109 మంది మరణించారు.మరో 116 మంది గల్లంతయ్యారు.ఐక్యరాజ్యసంస్థ అనుబంధ అంతర్జాతీయ వలస సంస్థ (ఐఓఎం) ప్రధానాధిపతి అలెగ్జాండర్ కోయిసాక్ ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన చేశారు.జిబూటీ నుండి యెమెన్‌కు 305 మంది వలస ప్రయాణికులను తీసుకువెళుతున్న పడవ ఒబాక్ పట్టణానికి ఉత్తర ప్రాంతంలో బోల్తా పడిందని చెప్పారు..కొంతమంది మాత్రం ప్రాణాలతో బయటపడి ఈ సమాచారాన్ని అందజేశారు. ఇప్పటివరకూ 109 మృతదేహాలను గాలించి వెలికితీశారు. వీరిలో 52 మంది పురుషులు,42 మంది మహిళలు,15 మంది పిల్లలు ఉన్నారు. వీరిలో తొమ్మిదిమంది బాలికలు,ఆరుగురు బాలురు ఉన్నారు.ఈ ప్రమాదం నుండి 80 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వీరంతా ఇథియోపియా జాతీయులే. ఆర్థిక అవకాశాలు అందిపుచ్చుకోవడానికి,మెరుగైన జీవితంకోసం బాల్ ఎల్ మందాబ్ జలసంధి దాటుకుని యెమెన్‌కు, ఆ పైన ఉన్న గల్ఫ్ దేశాలకు వెళ్ళేందుకు వీరంతా నిర్ణయించుకున్నారు. కానీ వారి మార్గం ప్రాణాంతకంగా మారింది.ఈ ప్రమాదం నుండి బయటపడిన 64 మందికి ఒబాక్ పట్టణంలో ఆశ్రయం కల్పించినట్లు అలెగ్జాండర్ కోయిసాక్ చెప్పారు.

# ఎరిత్రియా-ఇథియోపియా ఉద్రిక్తతలు

## భద్రతామండలికి ఫిర్యాదు



**న్యూయార్క్:** ఉత్తర ఆఫ్రికాదేశం ఇథియోపియా, దాని సరిహద్దుల్లో ఉన్న చిన్న దేశం ఎరిత్రియా మధ్య సంఘర్షణ తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఎరిత్రియాపై ఇథియోపియా యుద్ధ ప్రకటన చేసింది. ఈ యుద్ధ ప్రకటనను ఎరిత్రియా దేశ ప్రభుత్వం తిరస్కరించింది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలికి ఫిర్యాదు చేసింది. దీంతోపాటే ఇథియోపియా కూడా భద్రతామండలికి ఫిర్యాదు చేసింది. దీంతో రెండు దేశాలమధ్యా ఉద్రిక్తతలు పెరిగాయి. తమ దేశంలోని టైగ్రే ప్రాంతంలోకి ఎరిత్రియా సైన్యాలను పంపిస్తోందని అందుకే దేశ రక్షణకోసం యుద్ధం ప్రకటించామని ఇథియోపియా ప్రకటించగా, దీనిని ఎరిత్రియా ఖండించింది. కానీ ఎరిత్రియా సైన్యాలు ఇథియోపియా భూభాగంలోకి ప్రవేశిస్తున్న దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. యుద్ధాన్ని నివారించాలని ఎరిత్రియా కోరుతుండగా, దేశరక్షణకోసం యుద్ధ ప్రకటన చేశామని ఇథియోపియా పేర్కొంది. ఇథియోపియాలో 2022నుండీ జరిగిన అంతర్యుద్ధంలో ఆరు లక్షలమంది మరణించారు.

# ఎమర్జెన్సీని చూస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

శాంతిభద్రతలకు భంగం కలగకూడదని వారు చెప్పారని, నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ వల్లే శాంతిభద్రతలకు భంగం కలిగిందని మండిపడ్డారు. నిరసనలు కొనసాగుతున్నాయని, అవి కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా జరుగుతాయన్నారు. జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు ఈ నిరసన ఆగదు సిజెపి సహకన్వీనర్ అశుతోష్ ఒకా స్పష్టం చేశారు. ఈ పరిస్థితి నియంతృత్వ పాలనలోని ఎమర్జెన్సీని పోలి ఉందని, నిరసనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులను కూడా ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని దాస్ ఆరోపించారు. '1975లో కూడా రైళ్లను ఆపలేదు' అని రాంకా అన్నారు. షూలు ధరించి, తలలకు కప్పుకోకుండా గురుద్వారా బంగ్లా సాహిబ్‌లోకి ప్రవేశించి, నిరసనకారులను బలవంతంగా తొలగిస్తున్న ఢిల్లీ పోలీసు సిబ్బందిని కూడా ఆయన తీవ్రంగా విమర్శించారు. నిరసనకారులకు అండగా నిలవాలని ఆయన సిక్కు సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఆంక్షలు ఉన్నప్పటికీ ఆందోళన కొనసాగుతుందని ఎస్ఎఫ్ఐ ఐషే ఘోష్ అన్నారు. 'జంతర్ మంతర్ 2.0 కొనసాగుతోంది. మేము వీధుల్లో ఉన్నాము; వీధుల్లోనే ఉంటాము. మేము రాజ్యాంగానికి కట్టుబడి ఉంటాము' అని ఆమె విలేకరుల సమావేశంలో అన్నారు. సిజెపి నిరసనకారులపై దాడి చేయడానికి మితవాద బృందాలను అనుమతించారని ఘోష్ ఆరోపించారు. ఒక మైనర్ బాలిక, బాలుడిపై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ, ఇలాంటి ఘటనలను సహించలేమని అన్నారు. గత 72 గంటల్లో జరిగిన పరిణామాలు ప్రజలకు ఎమర్జెన్సీని గుర్తు చేశాయని రంకా అన్నారు. నిరసనకారులు ఢిల్లీకి చేరుకోకుండా నిరోధించడానికి రైళ్లను రద్దు చేశారని, వారిని వేధించారని ఆమె ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనను ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా తమకు వ్యతిరేకంగా చేసుకుంటున్న పోరాటంగా మార్చుకుంటున్నారని ఆమె ఆరోపించారు. తనను, దాస్‌ను, అభిజీత్ దీప్కేను విమానం నుంచి కిడ్నాప్ చేశారని కూడా ఆయన ఆరోపించారు. పోలీసు సిబ్బంది కార్యకర్తల కుటుంబాలను బెదిరించారని, వారి పిల్లలను నిరసనల్లో చేరకుండా ఆపమని కోరారని సిజెపి న్యాయ బృందం అధిపతి రత్న సింగ్ ఆరోపించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో సిబ్బంది తన కదలికలను గమనించారని, కార్యకర్తలపై ఆంక్షలకు గల ఆధారాన్ని ఆమె ప్రశ్నించారు. 'నేను ఒక పౌరురాలిని. నాకు ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉంది. నన్ను అక్రమ నిర్బంధంలో ఎలా ఉంచగలరు?' అని ఆమె ప్రశ్నించారు.

# సిజెఐని కలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నిరసనల సమయంలో భారీగా పోలీసులను మోహరించడం, అదుపులోకి తీసుకోవడం వంటి చర్యలు, యువత ఆందోళన పట్ల ప్రభుత్వానికి ఉన్న భయాన్ని సూచిస్తున్నాయన్నారు. తాము సాయంత్రం 4 నుండి 5 గంటల మధ్య సిజెఐని సమయం కోరామని, ఆయనకు పరిస్థితిని వివరిస్తామని ఖర్గే చెప్పారు. ఆయన ముందు డిమాండ్ చేయలేమని, కేవలం చేతులు జోడించి మాత్రమే అభ్యర్థించగలమని సిజఐతో జరగబోయే సమావేశం గురించి ఖర్గే పేర్కొన్నారు. హోంమంత్రి, ప్రధానమంత్రి దేశంలో అరాచకాన్ని సృష్టిస్తున్నారని, ప్రతిచోటా అప్రకటిత అత్యవసర పరిస్థితిని విధించారని ఖర్గే మండిపడ్డారు. తాను, రాహుల్ గాంధీ ఇద్దరూ సిజెఐకి లేఖలు రాశామని కాంగ్రెస్ అధినేత తెలిపారు. బెంగళూరులో మీడియాతో మాట్లాడిన తన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఢిల్లీలో శనివారం విధించిన కఠిన భద్రతా ఆంక్షల గురించి ఖర్గే మాట్లాడుతూ రోడ్లను మూసివేశారని, సమాచార వ్యవస్థలకు అంతరాయం కలిగించారని, విమానాశ్రయానికి వెళ్లే మార్గాలను పరిమితం చేశారని, మొబైల్ నెట్‌వర్క్‌లను నిలిపివేశారని పేర్కొన్నారు. దాదాపు 32,000 మంది పోలీసులు, 7,500 మంది సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని మోహరించారని, యువత ఆందోళన పట్ల ప్రభుత్వానికి ఎంత భయం ఉందో ఈ చర్య స్పష్టం చేస్తోందన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రశాంతంగా పనిచేయడం ప్రభుత్వానికి ఇష్టం లేదని ఇది రుజువు చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడటానికి తాము మా పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ సిజెపి పిలుపునిచ్చిన శనివారం నాటి నిరసన, జాతీయ రాజధాని అంతటా విస్తృత అరెస్టులకు దారితీసింది. పలువురు ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలతో సహా 7,000 మందికి పైగా ప్రజలను అదుపులోకి తీసుకున్నారు. నిరసనకారులు జంతర్ మంతర్ వద్దకు చేరుకోకుండా నిరోధించే చర్యల్లో భాగంగా మెట్రో, రైలు సర్వీసులపై ఆంక్షలు విధించారు, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్‌ను నిలిపివేశారు.

# దాడులు

(మొదటి పేజీ తరువాయి)







ఎఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేష్ సీరంగరాజ్‌లను ఢిల్లీ పోలీసులు అమానుషంగా అదుపులోకి తీసుకున్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా, సిపిఐ(ఎం) రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టా, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఆదర్శ్ ఎం సాజీ, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి సూరజ్ ఎలామన్, కేంద్ర కార్యనిర్వహణా కమిటీ సభ్యుడు అభిజిత్ మణిలాల్, పలువురు ఇతర సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు కన్నాట్ ప్లేస్ ఇన్నర్ సర్కిల్, రాజీవ్ చౌక్ సమీపంలో నిరసన ప్రదర్శన చేసిన దృశ్యాలు కనిపించాయి. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో భద్రతా సిబ్బంది నిరసనకారులను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు నిరసనకారుల చేతులు పట్టుకుని, సిద్ధంగా ఉన్న బస్సుల వైపు లాక్కెళ్తుండగా పలువురు నిరసనకారులు ప్రతిఘటించారు. కొందరు నిరసనకారులను రోడ్డుపై ఈడ్చుకెళ్తుండగా కనిపించగా, మరికొందరు అదుపులోకి తీసుకుంటున్నప్పటికీ నినాదాలు చేస్తూనే ఉన్నారు. నిరసనకారులు జంతర్ మంతర్‌కు చేరుకోకుండా నిరోధించడానికి పోలీసులు పలుచోట్ల భారీగా మోహరించడంతో, ఆర్కే ఆశ్రమ్ మార్గ్ మెట్రో స్టేషన్ నుంచి పాదయాత్ర చేస్తున్న వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఆర్కే ఆశ్రమ్ మార్గ్ సమీపంలో 40 మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి. అదుపులోకి తీసుకున్న వారి మొత్తం సంఖ్య సుమారు 100కి చేరవచ్చని కూడా వారు పేర్కొన్నారు. కన్నాట్ ప్లేస్ ఇన్నర్ సర్కిల్ వద్ద ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ విద్యార్థి నేతలను అదుపులోకి తీసుకుని బస్సులో తరలించగా, ఓట్లు దొంగిలించిన జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుకునేందుకు మోదీ, అమిత్ షా పౌరులపై యుద్ధం చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐకి చెందిన వందలాది మంది కార్యకర్తలను అదుపులోకి తీసుకుని నాంగ్లోయ్‌లోని సూరజ్ మల్ స్టేడియానికి తీసుకెళ్లారని, బోనులాంటి పోలీస్ వ్యాన్‌లలో తమ నాయకులపై దాడి జరిగిందని ఎస్ఎఫ్ఐ ఆరోపించింది. అంతేకాకుండా, బ్రిట్టాస్‌పై ఢిల్లీ పోలీసు సిబ్బంది దాడి చేసి, గాయపడిన స్థితిలో రోడ్డు పక్కన వదిలేశారని కూడా అది పేర్కొంది. ఢిల్లీలోని సేక్రేడ్ హార్ట్ చర్చి వికార్ అయిన ఫాదర్ బిజు జేవియర్, పోలీసుల హింసకు సంబంధించిన వీడియోను తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా అరెస్ట్ చేశారని పేర్కొంది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఆర్‌కె ఆశ్రమ్ మార్గ్ వద్ద ప్రదర్శనకు పిలుపునిచ్చిన ఎఐఎస్ఎ అధ్యక్షురాలు నేహ బోరాను, విజయ్ చౌక్ సమీపంలో ఇతర నిరసనకారులతో పాటు అదుపులోకి తీసుకున్నారు. భద్రతా సిబ్బంది వారి వైపు కదులుతుండగా, బోరా తమ సంఘానికి ఇతర సభ్యులతో కలిసి నినాదాలు చేస్తున్నట్లు దృశ్యాలు చూపించాయి. వారిని అదుపులోకి తీసుకునే ముందు పోలీసులు ఆపడానికి ప్రయత్నించగా, ఆమె, ఇతర ప్రదర్శనకారులు పరుగెత్తడం కనిపించింది. కానాట్ ప్లేస్ మెట్రో స్టేషన్, గురుద్వారా బంగ్లా సాహిబ్ సమీపంలో తమకు చెందిన పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారని సిజెపి తెలిపింది. పోలీసు సిబ్బంది వారిని అదుపులోకి తీసుకునేందుకు కదులుతుండగా, నిరసనకారులు మానవ గొలుసులను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఐసా పంచుకున్న వీడియోలలో కనిపించింది. గురుద్వారా బంగ్లా సాహిబ్ సమీపంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైద్యులు, ఇతర ప్రదర్శనకారులను కూడా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించింది. మరో ఘటనలో నిగంబోధ్ ఘాట్ సమీపంలో పడవలపై కెవైఎస్ సభ్యులు నిరసన తెలుపుతున్న వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నాయి. వారు పోస్టర్లు పట్టుకుని, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. కానాట్ ప్లేస్ సమీపంలో కూడా ఆ సంస్థ సభ్యులు నిరసన తెలుపుతూ కనిపించారు. నిరసనకారులు జంతర్ మంతర్ వద్దకు చేరుకోకుండా నిరోధించడానికి రాజధాని అంతటా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేయడంతో, పలు ప్రదేశాలలో పోలీసు సిబ్బందిని మోహరించారు. ఈ అరెస్టుల మధ్య ఈ అరెస్టులు జరిగాయి.

**పోలీస్ పహారా మధ్యే ఢిల్లీ**

ఆదివారం కూడా నిరసనలు కొనసాగుతాయని సిజెపి ప్రకటించిన నేపథ్యంలో అసాధారణ రీతిలో భద్రతా ఏర్పాట్లు కొనసాగనున్నాయి. 30,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ సిబ్బందిని మోహరించారు. అనధికారిక సమావేశాలను నిరోధించడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి పోలీసులు జాతీయ రాజధాని అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. సరిహద్దులు, రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్లు, ఇతర కీలక ప్రదేశాలలో నిఘాను పెంచారు. భద్రతా పరిస్థితిని అదుపు చేయడంలో ఢిల్లీ పోలీసులకు 120కి పైగా కేంద్ర సాయుధ పోలీసు బలగాల కంపెనీలు సహకరిస్తున్నాయి. న్యూఢిల్లీ జిల్లాను 20 జోన్లుగా విభజించారు. జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అదనపు డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పరిణామాలను పర్యవేక్షిస్తున్నారు. వివిధ విభాగాలకు నేతృత్వం వహిస్తున్న ప్రత్యేక కమిషనర్లు కూడా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు జాతీయ రాజధాని సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, లాడ్జీలు, ధర్మశాలల వద్ద తనిఖీలను విస్తృతం చేశారు. నిరసనకారులను సమీకరించే ప్రయత్నాలను గమనించేందుకు సోషల్ మీడియా వేదికలను కూడా పర్యవేక్షిస్తున్నారు.

**20కి పైగా కేసులు**

ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) నిరసనలకు సంబంధించి పోలీసులు ఇప్పటివరకు 20కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, పోలీసులపై దాడులు సహా పలు ఆరోపణలపై ఈ కేసులు నమోదయ్యాయి.

# హౌతీల దాడి

(మొదటి పేజీ తరువాయి)

అత్యధిక చమురు ఎగుమతిదేశమైన సౌదీ అరేబియాపై దాడులు ప్రపంచమార్కెట్లను కుదిపివేశాయి. అమెరికాకు కీలక మిత్రదేశంగా ఉన్న సౌదీఅరేబియాపై దాడుల ద్వారా ట్రంప్‌పై ఒత్తిడి పెంచడానికి హౌతీ తిరుగుబాటు దారులు ఇప్పుడు ఇరాన్‌కు ఒక ప్రధాన ఆయుధంగా మారారు.

గడచిన పది రోజులుగా రియాద్‌లోని జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయం టర్మినల్స్‌పై హౌతీలు వరుస క్షిపణి దాడులు చేస్తున్నారు. శనివారం ఈ దాడులు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. దీంతో కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. ఈ వారంలో కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీలు చేసిన దాడుల్లో ఒక పైలట్ సహా ముగ్గురు మరణించారు.

ప్రపంచంలోనే అత్యంత పేద దేశమైన యెమెన్‌లో అంతర్జాతీయ గుర్తింపుగల ప్రభుత్వదళాలకు,ఇరాన్ పోషిస్తున్న లక్షలమంది హౌతీ తిరుగుబాటు దళాలకు మధ్య నాలుగు సంవత్సరాల తర్వాత మరోసారి అంతర్యుద్ధం చెలరేగింది.సౌదీ అరేబియా సంకీర్ణ దళాలు ఇప్పుడు కూడా యెమెన్ ప్రభుత్వ దళాలకు నిధులు సమకూర్చి హౌతీల తిరుగుబాటును అణచివేసేందుకు ఉధృత దాడులు చేస్తోంది. గడచిన 26 గంటల్లో హౌతీలపై యెమెన్‌లో 2,600 దాడులు చేసినట్లు సంకీర్ణ దళాల ప్రధాన ప్రతినిధి అల్ మలికీ చెప్పారు.అంతర్యుద్ధ భయంతో లక్షలమంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళుతున్నారు.యెమెన్‌లో ప్రస్తుతం సర్వత్రా ఆకలి,అంటువ్యాధులు ప్రబలాయి.

హోర్ముజ్ జలసంధి మూసుకుపోయిన తర్వాత బాబ్ ఎల్ మందాబ్ జలసంధి ఒక్కటే సౌదీ నౌకలకు ప్రధాన రవాణా కేంద్రంగా ఉంది. దీనిని కూడా ఇప్పుడు హౌతీలు చేజిక్కించుకోవడంతో వారిని వెనక్కి తరిమికొట్టేందుకు సౌదీ అరేబియా వైమానిక బలగాలు యెమెన్ దళాలకు అండగా ఉన్నాయి.ఈ దశలో హౌతీలు సౌదీ నగరాలపై తమ దాడులను పెంచారు. మక్కా ఒప్పందానికి అనుగుణంగా తొలుత సైన్యాలను మోహరించేందుకు అంగీకరించిన టర్కీ ఇప్పుడు మాట మార్చింది.ఇక పాకిస్థాన్ తన సైనిక బలగాలను సౌదీకి మద్దతుగా పంపాల్సి ఉంది.

అమెరికా–ఇరాన్‌లు పశ్చిమాసియాలో యుద్ధ విరామం పాటించినప్పటికీ,సెంట్‌కామ్ దళాలకు సౌదీ అరేబియా మద్దతు ఇస్తోంది. యెమెన్ అంతర్యుద్ధంలో జోక్యం చేసుకున్న సౌదీ అరేబియాను అటు హౌతీలూ, ఇటు ఇరాన్ వ్యతిరేకిస్తున్నాయి. ఇరాన్ మౌనంగా ఉన్నప్పటికీ హౌతీలు సౌదీపై యుద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల చిక్కుల్లో ఉన్న ట్రంప్ హౌతీలపై జరిగే యుద్ధంలో జత కలిసి సౌదీ అరేబియాకు అండగా ఉండాలా?వద్దా? అనే సందిగ్ధంలో పడ్డారు. తాము హౌతీలపై దాడి చేసే అవకాశం ఉందని, ఆలోచిస్తున్నామని ట్రంప్ నోటిమాటగా ప్రకటించారు.

**మానవ హక్కులకు వ్యతిరేకం**

సౌదీ అరేబియా అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీ తిరుగుబాటుదారులు దాడిచేసి సాధారణ పౌరులను హత్యచేయడాన్ని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్రంగా వ్యతిరేకించారు.ఈ చర్య ప్రపంచ మానవహక్కులకు వ్యతిరేకమని,అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ దాడి ఘటన గురించి విని తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని అన్నారు.ఈ ఘటనపై భారత ప్రభుత్వం,ఇతర ప్రపంచ నాయకులు స్పందించారు.ఎట్టి పరిస్థితుల్లో ఈ దాడులను సమ్మతించలేమని ఖండించారు.

పౌర విమాన సదుపాయాలపైన,మానవహక్కులను ఉల్లంఘిస్తూ ప్రజలపై చేస్తున్న దాడులను భారత ప్రభుత్వం ఖండించింది.యుద్ధం తక్షణం ఆగిపోవాలని,ప్రాణనష్టాన్ని అడ్డుకోవాలని కోరింది.ఖతార్ ప్రభుత్వం కూడా ఒక ప్రకటన చేస్తూ, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి హౌతీ ఉగ్రవాద సైన్యాలు పౌర సేవల మౌలిక సదుపాయాల దాడులు చేశాయని విమర్శించింది.ఈ దుశ్చర్య సౌదీ అరేబియా దేశ సార్వభౌమాధికారాన్ని బహిరంగంగా ఉల్లంఘించడమేనని మండిపడింది.ప్రాంతీయ స్థిరత్వానికి,పౌరుల భద్రతకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొంది.సౌదీ అరేబియా భద్రత,ఖతార్ భద్రతలో అంతర్భాగమని,ఆరు అరబ్ దేశాల ప్రాంతీయ కూటమి గల్ఫ్ సహకార మండలి (జిసిసి)సమష్టి భద్రతా వ్యవస్థలో కూడా ఇది అంతర్భాగమని ఖతార్ పేర్కొంది.

హౌతీల దాడులపై యూరోపియన్ యూనియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్‌లేయన్ స్పందిస్తూ, ఇది చాలా ప్రమాదకరమైన యుద్ధ విస్తృతి అని ఆందోళన వ్యక్తం చేశారు. సౌదీ అరేబియా ప్రభుత్వానికి, ప్రజలకు పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నట్లు ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. బ్రిటన్ విదేశాంగమంత్రి ఎడ్ మిలిబండ్ కూడా తీవ్రంగా నష్టపోయినవారికి తమ సంఘీభావం ప్రకటించారు. సౌదీ అరేబియాకు పూర్తి మద్దతు,సహకారం ఇస్తామని బ్రిటన్ రక్షణమంత్రి వెస్ స్ట్రీటింగ్ చెప్పారు. ఇప్పటికే సౌదీ విమానాలకు గాలిలో ప్రయాణిస్తున్న సమయంలోనే ఇంధనం నింపే సేవలు అందిస్తున్నామని చెప్పారు. బ్రిటన్ కూడా ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొంటుందా? అని ప్రశ్నించగా, ప్రస్తుతానికి బ్రిటన్‌కు అలాంటి ఆలోచన లేదని అన్నారు.

పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఒక ప్రకటన చేస్తూ,ఇది హేయమైన దాడి అనీ, శాంతి, స్థిరత్వాలకు పెద్ద ముప్పు కలుగుతుందని పేర్కొన్నారు. వారి భూభాగంపై నిరంతరం జరుగుతున్న దాడులను ఈజిప్టు కూడా ఖండిస్తూ, సౌదీ అరేబియాకు పూర్తి బాసటగా ఉంటామని ప్రకటించింది.

**సౌదీవైపు ఎవ్వరూ రాకండి**

**మక్కా–మదీనా కూడా వదలంఃహౌతీ**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న విమానయాన సంస్థలకు హౌతీ తిరుగుబాటు సైన్యం తీవ్ర హెచ్చరిక జారీ చేసింది.ఎట్టి పరిస్థితుల్లోనూ సౌదీ అరేబియాకు చెందిన విమానాశ్రయాలను ఉపయోగించవద్దని, ఆ జోలికిగానీ,అటువైపు గానీ వెళ్ళవద్దని హెచ్చరిక జారీ చేసింది.హౌతీ దళాల ప్రధాన ప్రతినిధి యాహ్యా సరీ ఒక ప్రకటన చేస్తూ,ఇప్పుడు సౌదీ అరేబియాను లక్ష్యంగా చేసుకుని తాము దాడులు చేస్తున్నామని, ఆ దేశం తమ కనుసన్నలలో,తమ తుపాకీగొట్టం పరిధిలో ఉందని,దానిపై గురిపెట్టి ఉన్నామని,ఇతర దేశాల విమాన యాన సంస్థలు సౌదీ గగనతలాన్ని ఉపయోగించవద్దని హెచ్చరించారు.తమ దాడుల లక్ష్యాలకు మక్కా నుండి మదీనా వరకూ ఎక్కడా మినహాయింపు లేదని,పవిత్రస్థలాలకు కూడామినహాయింపు లేదని స్పష్టం చేశారు.తమ హెచ్చరికలను ప్రతి ఒక్కరూ చాలా తీవ్రంగా పరిగణించి అమలు చేయాలని,లేకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతిఘటించే ప్రయత్నం చేస్తే సౌదీ అరేబియా తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటుందని పేర్కొన్నారు.

# మండుతున్న ఎండలు

(మొదటి పేజీ తరువాయి)

రాత్రి వేళల్లో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఖమ్మం, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లో సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా గాలిలో తేమ శాతం 60 నుంచి 70 శాతం మధ్య ఉండాలి. కానీ, హైదరాబాద్‌లో ఇది 49 శాతానికి పడిపోయింది. అలాగే రామగుండంలో 42 శాతం, హనుమకొండలో 49, మహబూబ్ నగర్‌లో 51, నిజామాబాద్, నల్లగొండలలో 45 శాతం చొప్పున తేమ నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మైదాన ప్రాంతాల్లో గాలి కాలుష్యం కారణంగా ఈ వేడి మరింత పెరిగినట్లు చెప్పారు. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఒకటి రెండు రోజుల్లో రాష్ట్రం నుంచి పూర్తిగా నిష్క్రమించనున్నాయి. ఈ తీవ్ర ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ బారిన పడకుండా మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లరాదని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా మంచినీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను విరివిగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

**వర్షాలకు మరో వారం నిరీక్షణ**

తెలంగాణలో ప్రస్తుతం పొడి వాతావరణం కొనసాగుతుండటంతో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోవడంతో పగటిపూట ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం ఎలాంటి వాతావరణ హెచ్చరికలు లేవని అధికారులు చెప్పారు. ఈనెల 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణమే కొనసాగే అవకాశం ఉందన్నారు. ఈనెల 16 నుంచి 18 వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

# బతికేదెలా?

(మొదటి పేజీ తరువాయి)

చేతిలో సామాన్లు అన్న నానుడి ఇప్పుడు నిజమయ్యే పరిస్థితి ఏర్పడింది. గతంలో ధరల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం పలు చర్యలు తీసుకోవడంతో పాటు బ్లాక్ మార్కెటర్లపై కఠిన చర్యలు తీసుకునేది. ప్రతి వస్తువుకు గరిష్ట ధర నిర్ణయించి దానిని అమలయ్యేవిధంగా తగు చర్యలు తీసుకునేది. ప్రధాని మోదీ చేసిన చట్టాల సవరణ ఫలితంగా ఇప్పుడు ధరల నియంత్రణ లేకపోవడంతో పాటు బ్లాక్ మార్కెటర్లపై తగు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారుల ఇష్టారాజ్యానికి వదిలివేయడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డివిరుగుతుంది. ఆదాయం తగ్గి ఖర్చులు పెరిగిన వేళ ప్రజలు అర్థాకలితో జీవించాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. దేశ ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగైందని కొనుగోలు శక్తి పెరిగిందని పాలకులు ఉదరగొడుతున్నారు. పెరిగిన ధరలను నియంత్రించకపోతే పేదల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. ఒక పక్క కరువు ఛాయలు మరో పక్క అదుపులేని ధరలపై ప్రభుత్వం అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో ఎండలు అదరగొడుతున్నాయి. వ్యవసాయంపై ఎండల ప్రభావం తీవ్రంగా చూపుతుంది. ఒక పక్క పత్తి, మిర్చి,వరి పంటలకు ఎర్రతెగుళ్లు రావడంతో పైర్లు ఎర్రబారుతున్నాయి. మరో పక్క భూగర్భ జల నీటి మట్టం రోజు రోజుకు పడిపోయి ఆందోళన కలిగిస్తుంది. పచ్చగా కళకళలాడాల్సిన పైర్లు భూములు నెర్రెలు బారి వాడిపోతున్నాయి. జీవనదుల్లాంటి అనేక ఏర్లు, నదులు వట్టిపోతున్నాయి. భూగర్భ జల నీటిమట్టం పడిపోతుండడంతో ఈ ఏడాది తాగు నీటికి కూడా తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి కనిపిస్తుంది.

అనుకూల వాతావరణంలో వ్యాధులు ప్రభలుతున్నాయి. అక్టోబర్ మాసంలో ఉండాల్సిన వాతావరణం లేకపోవడంతో విపరీతంగా జ్వరాలు వస్తున్నాయి. దానికి తోడు గొంతు నొప్పులు రావడంతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇటీవల కాలంలో డెంగ్యూ ఉధృతి కూడా పెరిగింది. సహజంగా జూన్, జూలై మాసాల్లో సీజన్ వ్యాధులకు గురయ్యే వారు. కానీ ఈ ఏడాది భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. ఎక్కడ చూసినా ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. కరువు కాలంలో అదుపులేని ధరలు అనుకూల వాతావరణం ప్రభలుతున్న వ్యాధుల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం ధరలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించడంతో పాటు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

# థ్రిల్లింగ్ పోరులో వెస్టిండీస్‌పై భారత్ విజయం

ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో ఉత్కంఠభరితంగా జరిగిన మూడో టి–20 మ్యాచ్‌లో భారత జట్టు 14 పరుగుల తేడాతో వెస్టిండీస్ జట్టుపై ఘనవిజయం సాధించింది. ఈ కీలక విజయంతో ఐదు మ్యాచ్‌ల టి–20 సిరీస్‌లో భారత్ 2–1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత్ చేసిన 223 పరుగులకు ప్రతిస్పందనగా వెస్టిండీస్ ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ సిరీస్‌లోని నాలుగో టి20 మ్యాచ్ అక్టోబర్ 14(బుధవారం) హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరగనుంది. భారత్ తరఫున ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లతో అత్యధికంగా పడగొట్టగా, నమన్ ధీర్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అక్షర్ పటేల్, నితీష్‌రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. భారత్ నిర్దేశించిన 224 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వెస్టిండీస్ పేలవమైన ఆరంభాన్ని అందుకుంది. జట్టు స్కోరుకు కేవలం ఏడు పరుగులు మాత్రమే చేరినప్పుడు కెప్టెన్, వికెట్ కీపర్ షాయ్ హోప్‌ను అర్ష్‌దీప్‌సింగ్ క్లీన్ బౌల్ చేశాడు. హోప్ ఐదు బంతుల్లో కేవలం ఐదు పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఆ తర్వాత షిమ్రాన్ హెట్మెయర్ కొన్ని మంచి షాట్లు ఆడి 26 బంతుల్లో 43 పరుగులు చేసి ఔటయ్యాడు. నమన్ ధీర్ బౌలింగ్‌లో హెట్మెయర్ బౌల్ అయ్యాడు. రోవ్మన్ పావెల్ కూడా ప్రభావం చూపలేకపోయాడు, ఏడు బంతుల్లో ఐదు పరుగులు మాత్రమే చేశాడు. శాంప్సన్ 21 పరుగులు చేసి ఔటవ్వగా.. కీమో పాల్ 10 పరుగుల వద్ద అర్ష్‌దీప్‌సింగ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో వెస్టిండీస్ ఆరు వికెట్ల నష్టానికి 169 పరుగులకే పరిమితమైంది. రూథర్‌ఫోర్డ్‌ను క్లీన్ బౌల్ చేయడం ద్వారా అర్ష్‌దీప్ తన మూడో వికెట్టును పడగొట్టాడు. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 20 బంతుల్లో 32 పరుగులు చేసి ఔవుటయ్యాడు. షమర్ స్ప్రింగర్ 11 బంతుల్లో 35 పరుగులతో నాటౌట్గా నిలవగా, రోస్టన్ చేజ్ 5 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.



**అభిషేక్ శర్మ సిక్సర్ల సునామీ...** అభిషేక్ శర్మ వేగంగా అర్ధశతకం సాధించినప్పటికీ.. వెస్టిండీస్ జట్టు భారత్ను 223 పరుగులకే ఆలౌట్ చేసింది. అభిషేక్ 30 బంతుల్లో ఐదు సిక్సర్లు, ఆరు ఫోర్లతో 69 పరుగులు చేయడమే కాకుండా ఇషాన్ కిషన్‌తో (18 బంతుల్లో 37 పరుగులు, ఆరు ఫోర్లు, ఒక సిక్సర్) కలిసి రెండో వికెట్కు 108 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారత్‌కు పటిష్టమైన పునాది వేశాడు. అయితే ఈ భాగస్వామ్యం విచ్ఛిన్నమైన తర్వాత, భారత్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో, జట్టు ఆశించినన్ని పరుగులు చేయలేకపోయి ఇన్నింగ్స్ చివరి బంతికి ఆలౌట్ అయింది. వెస్టిండీస్ తరఫున ఆఫ్‌స్పిన్నర్ రోస్టన్ చేజ్ విజయవంతమైన బౌలర్గా నిలిచి, 38 పరుగులకు రెండు వికెట్లు పడగొట్టాడు. ఫాస్ట్‌బౌలర్లు షమర్ స్ప్రింగర్, షమర్ జోసెఫ్ కూడా చెరోరెండు వికెట్లు తీసినప్పటికీ, వరుసగా 50,54 పరుగులు ఇచ్చారు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ టాస్ గెలిచి మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయించుకోగా, షమర్ జోసెఫ్ వేసిన రెండో ఓవర్లోనే సంజు శాంసన్(03) కమీల్ పూరన్కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. మూడో ఓవర్లో రోస్టన్ చేజ్ వేసిన వరుస బంతుల్లో ఒక ఫోర్, ఒక సిక్స్ కొట్టి అభిషేక్ బ్యాట్తో తన బౌండరీల ఖాతాను తెరిచాడు. అభిషేక్ శర్మ అదే ఓవర్ చివరి బంతికి కూడా ఒక సిక్స్ కొట్టాడు. కీమో పాల్ వేసిన తొలి ఓవర్లోనే ఇషాన్ కిషన్ మూడు ఫోర్లు కొట్టి తన సత్తా చాటగా.. షమర్ స్ప్రింగర్ వేసిన వరుస బంతుల్లో అభిషేక్ రెండు ఫోర్లు, ఒక సిక్సర్ బాదాడు. జోసేఫ్ వేసిన ఓవర్లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్తో అభిషేక్ కేవలం 18 బంతుల్లోనే తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని, పవర్ ప్లేలో జట్టు స్కోరు ను ఒక వికెట్ నష్టానికి 87 పరుగులకు చేర్చాడు. ఎనిమిదో ఓవర్‌లో భారత్ శతకం పూర్తయింది. తర్వాతి ఓవర్‌లో చేజ్ బౌలింగ్‌లో ఇషాన్ ఒక సిక్సర్ కొట్టినప్పటికీ.. అతని తర్వాతి బంతిని ముందుకు ఆడబోయే ప్రయత్నంలో హోప్ చేతిలో స్టంప్ అయ్యాడు. అదే ఓవర్లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (01)ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేశాడు.

# నా వైఫల్యానికి నేనే కారణం : సంజూ శాంసన్

అంతర్జాతీయ క్రికెట్లో తన వైఫల్యానికి పూర్తి బాధ్యత తనదేనని టీమిండియా స్టార్ ఓపెనర్ సంజూ శాంసన్ అన్నాడు. తాను ఎప్పుడూ పరిస్థితులను, ఇతరులను నిందించనని తెలిపాడు. నాలుగు టి–20ల్లో వరుసగా విఫలమైన సంజూ శాంసన్.. ఐదో మ్యాచ్‌లో విధ్వంసకర బ్యాటింగ్ చెలరేగాడు. దూకుడైన బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ బాది విమర్శకుల నోళ్లు మూయించాడు. వెస్టిండీస్‌తో రాంచీ వేదికగా జరిగిన రెండో టి–20లో సంజూ శాంసన్.. 41 బంతుల్లోనే 82 పరుగులు చేశాడు. అయితే ఆసియా గేమ్స్‌తో పాటు వెస్టిండీస్‌తో తొలి టి–20లో సంజూ శాంసన్ ఘోరంగా విఫలమవడంతో అతన్ని పక్కన పెట్టాలనే డిమాండ్ వ్యక్తమైంది. సంజూ శాంసన్‌ను ఎన్ని అవకాశాలు ఇస్తారని, సూపర్ ఫామ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీని ఆడించాలని డిమాండ్ చేశారు.



**జట్టు కోసమే ఆడుతాను..** అయితే ఈ విమర్శలకు సంజూ తనదైన బ్యాటింగ్‌తో బదులిచ్చాడు. రెండో టి–20 అనంతరం తన ఇన్నింగ్స్ గురించి మాట్లాడిన సంజూ.. తాను ఎప్పుడూ జట్టు కోసమే ఆడుతానని స్పష్టం చేశాడు. ఫామ్‌లో లేనని జట్టుకు నష్టం చేసే విధంగా స్లోగా ఆడలేనని చెప్పాడు. 'భారత జట్టు తరఫున ఆడుతున్నప్పుడు మనం చేయగలిగిందల్లా ఒక్కటే కఠినంగా ప్రాక్టీస్ చేసి మ్యాచ్‌కు సిద్ధమవ్వడమే. కానీ వేగవంతమైన టి–20 క్రికెట్లో ఫలితాలు ఎప్పుడూ మన చేతుల్లో ఉండవు. కేవలం గత మూడు మ్యాచ్‌లల్లో సరిగ్గా ఆడలేదనే కారణంతో స్వార్థపూరితంగా మైదానంలో ఎక్కువ సమయం తీసుకొని స్లోగా ఆడలేం. జట్టుకు దూకుడైన ఆరంభం ఇవ్వడం నా బాధ్యత. నా వైఫల్యానికి పూర్తి బాధ్యత నాదే. అందుకు నేను ఇతరులను గానీ, పరిస్థితులను గానీ నిందించను. నేను మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ జట్టు కోసం నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నిస్తాను 'అని సంజూ శాంసన్ పేర్కొన్నాడు. ఈ ఏడాది జరిగిన అంతర్జాతీయ టి–20 మ్యాచ్‌లలో సంజూ శాంసన్ కనీసం 15 బంతులు ఎదుర్కొన్న ప్రతిసారీ హాఫ్ సెంచరీ సాధించాడు.

# ఆరోగ్యం

## ఆర్థరైటిస్... చికిత్స కన్నా.. నివారణే మిన్న

కీళ్ళ వాపులు, మస్క్యులోస్కెలిటల్ రుగ్మతలకు సంబంధించిన వ్యాధులనుఆర్థరైటిస్ అంటాం. కీళ్ళవాపు వ్యాధితో కీళ్ళనొప్పులు, కదలికలు తగ్గడం, కీళ్ళు కదలకుండా గట్టిపడడంత వంటి పలు సమస్యలు ఉత్పన్నం అవుతాయి. సర్వసాధారణ ఆర్థరైటిస్ రోగాలలో ఆస్టియోఆర్థరైటిస్, రిమటాయిడ్ ఆర్థరైటిస్, గౌట్ (వేళ్ళ దగ్గర పుండు), లూపస్(చర్మవృక్క వికార రోగం) ముఖ్యమైనవి. కీళ్ళవాపు వ్యాధితో శరీర కదలికల్లో మార్పు, పనులు సక్రమంగా చేయలేక పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థుల్లో నడక, స్కెలింగ్, ఈత లాంటి భౌతిక క్రియలు కష్టమైనప్పటికీ, వాటితోనే కొంత ఉపశమనం కలుగుతుంది. శరీర బరువు తగ్గడంతో మోకాళ్లపై భారం తగ్గిపోయి కీళ్ళ నొప్పులు తగ్గుతాయి. రుమాటిక్ అండ్ మస్క్యులోస్కెలిటల్ వ్యాధుల(ఆర్థరైటిస్ వ్యాధుల) పట్ల ప్రజల్లో అవగాహన, జీవనశైలిలో మార్పులు, తొలి దశలోనే గుర్తించడం, కీళ్ళనొప్పులతో బాధపడే వారు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆర్థరైటిస్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియచేయటానికి 1996నుంచి ప్రతియేటా అక్టోబర్ 12న 'ప్రపంచ కీళ్ళవాపు లేదా ఆర్థరైటిస్ దినం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. కాగా, తొలి దశలో (12 వారాల లోపు) గుర్తించిన వారికి సులభంగా నివారించగల ఆర్థరైటిస్, ఆలస్యంగా గమనించిన వారిలో తీవ్ర వ్యాధిగా మారుతుంది శరీరక శ్రమ చేయలేకపోవడం, దినచర్యలో క్రియాశీలత క్షీణించడంలాంటి పరిణామాలకు దారితీస్తుంది. అనువంశికంగా కూడా సంక్రమించగల ఆర్థరైటిస్ వ్యాధి పొగతాగడం, స్థూలకాయం, నిష్క్రియాత్మక జీవనశైలి, కీళ్ళ/కండరాలపై పని ఒత్తిడి, ప్రమాదాలు లాంటి కారణాలతో కీళ్ళ



వాపు వ్యాధి తీవ్రత (ఆర్థరైటిస్) పెరుగుతుంది. అంతర్జాతీయ నివేదికలను అనుసరించి, ప్రపంచ వ్యాప్తంగా సుమారు 350 మిలియన్ల ప్రజలు ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. దాదాపు విశ్వ జనాభాలో ఒకశాతం ప్రజలు రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో సతమతం అవుతున్నారు. వయస్సు60 ఏళ్ళు దాటిన మహిళల్లో 18శాతం, పురుషుల్లో 10 శాతం ప్రజలు ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధ పడుతున్నారు. ఇండియాలో 15 శాతం ప్రజలకు (180 మిలియన్లు) కీళ్ళవాపు సమస్యలు ఉన్నాయి. ఆరోగ్యకర జీవనశైలి, ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు, వైద్యులు లేదా ఫిజియోథెరపిస్టు సూచనల మేరకు శారీరకశ్రమ (స్కెలింగ్, వాకింగ్, గార్డెనింగ్, స్విమ్మింగ్, యోగా వంటివి) పాటించడం ద్వారా ఆర్థరైటిస్ అదుపు చేయపడుతుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వయసుతో ప్రమేయం లేకుండా రావచ్చేమో కాని వయస్సుతో పాటు వచ్చే అవకాశం ఆస్టియో ఆర్థరైటిస్‌కు ఉంటుంది. ఆస్టియో ఆర్థరైటిస్ అదుపు చేయడానికి నీటిని ఎక్కువగా తాగడం (2 లీటర్ల కన్న ఎక్కువ), నూనెలు/కొవ్వులను తగ్గించడం, స్వీట్స్ మరియు సాఫ్ట్ డ్రింక్స్ తగ్గించడం, పోషకాహారం తీసుకోవడం, నిపుణుల సూచనలతో శారీరక వ్యాయామం చేయడం లాంటివి పాటించాలి.

### రుమటాయిడ్ ఆర్థరైటిస్

రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనబడే దీర్ఘకాలిక రుగ్మత కారణంగా చర్మం, కళ్ళు, ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలతో పాటు రోగనిరోధకశక్తిని ప్రభావితం చేస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ తీవ్రతతో ఎముకల క్షయం, కీళ్ళ వైకల్యంతో పాటు వాపుతో తీవ్రమైన నొప్పి వస్తుంది. వయసు, లింగం, అనువంశికత, పొగతాగడం, పర్యావరణ కాలుష్యం, అధిక బరువు కారణాలతో రుమటాయిడ్ ఆర్థరైటిస్ రావచ్చు. ఈ వ్యాధి ఫలితంగా పొడి కళ్ళు/నోరు, అసాధారణ శరీర కూర్పు, కీళ్ళవాపు, కీళ్ళదృఢత్వం తగ్గడం, మూత్రపిండాలు, లాలాజల గ్రంథులు, నరాల కణజాలం, ఎముకన మజ్జ, నోడ్యూల్స్, గుండె సమస్యలు, ఊపిరితిత్తుల జబ్బులు, కార్పాల్ టన్నెల్ సిండ్రోమ్ రుగ్మతలు కలుగుతాయి. దీనిని తగ్గించడానికి వేడి లేదా చల్లనిప్యాక్స్, తగినంత విశ్రాంతి, వ్యాయామం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థులు ఒమెగా3 ఫ్యాటీ ఆమ్లాలు, చేపలు, సోయా గింజలు, అవిసెలు, ఆక్రోట్లు, విటమిన్ ఎ,సి,ఇ కలిగిన ఆహారం, బెర్రీస్, చాక్లెట్స్, పాలకూర, బీన్స్, తాజా పండ్లు, అల్లం, ఫిష్ ఆయిల్, తాజా కూరగాయలు, ఫైబర్ ఫుడ్, బ్రోకోలీ, గ్రీన్‌టీ, ద్రాక్ష లాంటి పోషకాహారం తీసుకోవాలి. కీళ్ళ వాపు సమస్యలు రాకుండా ఉండేలా జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ, వైద్యుల సూచన మేరకు పోషకాహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థులు వైద్య నిపుణుల సూచనలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాధిని నియంత్రించాలి. చికిత్స కన్న నివారణే మిన్న అని ముందు జగ్రత్త పడుతూ, సంతోషదాయక జీవన యానం చేద్దాం.

## అంటువ్యాధులపై డబ్ల్యుహెచ్ఓ తాజా నివేదిక

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ప్రపంచవ్యాప్తంగా పరిస్థితిపై తాజా సమాచారాన్ని విడుదల చేసింది. ఇందులో కలరా, మెనింజైటిస్, ప్లేగు వంటి తీవ్రమైన అంటువ్యాధుల వ్యాప్తి, కేసుల ధోరణులు, ప్రజారోగ్యంపై వాటి ప్రభావం వంటి అంశాలను పరిశీలించింది. కలరా ప్రధానంగా కలుషితమైన నీరు, ఆహారం ద్వారా వ్యాపిస్తుంది. పరిశుభ్రమైన తాగునీరు, పారిశుధ్యం, వేగవంతమైన చికిత్స ద్వారా దీని ప్రభావాన్ని తగ్గించవచ్చు. ముఖ్యంగా నీటి కొరత, వరదలు, పారిశుధ్య సదుపాయాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కలరా వ్యాప్తి ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాగా, మెనింజైటిస్ అనేది మెదడు, వెన్నుపామును కప్పి ఉంచే పొరలకు వచ్చే తీవ్రమైన ఇన్ఫెక్షన్. కొన్ని రకాల మెనింజైటిస్ వేగంగా ప్రాణాపాయ పరిస్థితులకు దారితీయవచ్చు. టీకాలు, ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్స ఇందులో కీలకం. ఇక ప్లేగు ప్రస్తుతం అరుదైన వ్యాధి అయినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ కేసులు నమోదవుతున్నాయి. డబ్ల్యుహెచ్ఓ తాజా సమాచారం ద్వారా ఈ వ్యాధులపై నిఘా, ముందస్తు హెచ్చరికలు, వేగవంతమైన ప్రజారోగ్య చర్యల ప్రాధాన్యతను మరోసారి వెల్లడించింది.




# మున్సిపల్ కార్మికుల శ్రమ గుర్తించాలి

## వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి

### మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధానకార్యదర్శి జైపాల్‌రెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం/హనుమకొండ :** మున్సిపాలిటీలలో, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల శ్రమను గుర్తించి, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని బాలసముద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం అధ్యక్షతన నిర్వహించగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ ద్వారానే కార్మికులకు వేతనాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందించే విధంగా ప్రభుత్వం తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు న్యాయబద్ధమైన కనీస వేతనాలు, డిఎ, పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, సెలవులు, ఇతరచట్టబద్ధమైన ప్రయోజనాలు కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాలతో మరణించిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు రూ.1కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు తక్షణ ఆర్థికసహాయంగా అంత్యక్రియల ఖర్చుల కింద రూ.30వేలు అందించాలని, 60 సంవత్సరాలు నిండిన కార్మికులు, మరణించిన కార్మికుల కుటుంబసభ్యులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందే కార్మికులకు గ్రాట్యుటీ, పెన్షన్‌కు సంబంధించిన వర్తించే ప్రయోజనాలు, బకాయిలు అందించేలా చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో ప్రమాదాలకు గురయ్యే కార్మికులకు తగిన ప్రమాద బీమా, మెరుగైన వైద్య సదుపాయాలు, ఆరోగ్య బీమా కల్పించాలని, విధి నిర్వహణకు అవసరమైన రక్షణ పరికరాలు, యూనిఫారాలు, నాణ్యమైన పనిసామగ్రిని ఉచితంగా అందించాలని, మహిళా కార్మికులకు చట్టబద్ధమైన ప్రసూతి సెలవులు, భద్రత, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలి. పనిప్రదేశాల్లో వేధింపులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు కె.రవిచంద్ర, సారంగపాణి యాదవ్, మేకల దేవేందర్ యాదవ్, ఎం.మద్దిలేటి, వి.హరినాథ్‌రావు, ఉస్మాన్, ఎఐటియుసి జిల్లాకార్యదర్శి జక్కురాజుగౌడ్, అజయ్, లక్ష్మణ్, సతీష్, రామచందర్, రాజేందర్, బొక్క ఏలియా, దామేర రాజు, నాగుల శ్రీకాంత్, మేకల శంకర్, ఆర్.పూర్ణచందర్ ,భైరబోయిన గట్టయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత, విద్యార్థులపై దాడి అమానుషం

## ఓట్ల దొంగకు బుద్ధి చెప్పాల్సిందే

### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా




**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజాస్వామ్యంలో అత్యంత కీలక భూమిక పోషించాల్సిన ఎన్నికల కమిషన్ బిజెపికి తొత్తుగా మారడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన విద్యార్థులు, యువతపై ఢిల్లీ ప్రభుత్వం దాడి అమానుషమని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తెలిపారు. ప్రజా పోరాటాలు, ఆందోళనలు జరుగుతున్నప్పుడు డిమాండ్‌పై ప్రభుత్వం ఆలోచన చేయాలని, వీలైనంత మేర ప్రజల డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రయత్నించాలి తప్ప అరెస్టులు, లాఠీచార్జీలతో అణిచివేయడం సరికాదన్నారు. ఇన్సాఫ్ ఖమ్మం నగర కమిటీ సమావేశం ఆదివారం జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. ఎస్‌కె సైదా అధ్యక్షతన జరిగిన సమావేశంలో మౌలానా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం గతంలో ఎన్నోఆశలు చూపి అధికారంలోకి వచ్చిందని ఆ తర్వాత మతాన్ని బూసిగా చూపి లబ్ధి పొందిందని ఇప్పుడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి చివరకు ఓట్లను చోరీ చేస్తూ రాజకీయ పార్టీలను చీలుస్తూ అధికారంలో కొనసాగుతుందన్నారు. ప్రజలను మరిచి పాలన సాగిస్తున్న బిజెపి పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని ఇక బిజెపి తల వంచక తప్పదన్నారు. గతంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని ఇప్పుడు ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కూడా రాజీనామా చేయక తప్పదని మౌలానా హెచ్చరించారు. ఢిల్లీలో పోలీసులతో పాటు ఆర్‌ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌కు చెందిన గుండాలు సైతం యువత, విద్యార్థులపై దాడి చేస్తున్నారని ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

**పోరాటాలకు సిద్ధం కండి :** ముస్లిం మైనార్టీలు తమ హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచారకార్యదర్శి మహ్మద్ సలాం కోరారు. పోరాడకుండా ఏ హక్కులు రావని ఆయన స్పష్టంచేశారు. ఇన్సాఫ్ నగర మహాసభలో మాట్లాడుతూ పాలకులు ఎవరైనా ముస్లిం మైనార్టీలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వివక్ష చూపుతున్నారని ఆయన ఆరోపించారు. వక్ఫ్ భూములకు రక్షణ లేకుండా పోయిందని, మైనార్టీ మెజార్టీ ప్రాతిపదికన పాలకులు వ్యవహరించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని హామీల అమలుకు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఇన్సాఫ్ మహాసభలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, ప్రజాసంఘాల నాయకులు యానాలి సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, ఎండి జాకీర్, యాకూబ్ మహ్మద్, మాసివుద్దీన్, చానా, యుసూఫ్, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ అడ్డాలో కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు డిమాండ్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** లేబర్ అడ్డాపై కార్మికులకు విశ్రాంతి గదులతో పాటు మరుగుదొడ్లు నిర్మించాలని ఎఐటియుసి సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్ల లేబర్ అడ్డా కార్మికులతో కలిసి మీడియాతో మాట్లాడారు. లేబర్ అడ్డాపై కనీస, మౌలిక వసతులు లేక స్థానికంగా పనిచేస్తున్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దూర ప్రాంతాల నుంచి పనికోసం వచ్చే కార్మికులకు లేబర్ అడ్డాపై మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కోరారు. వలస కార్మికులు రావడం వల్ల వారు అతి తక్కువ కూలీతో పనులు చేయడం చేత స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని గతంలో లేబర్ ఆఫీసర్, కలెక్టర్, ఎంఆర్‌ఒలకు వినతి పత్రం అందజేసినప్పటికీ ఏలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. స్థానిక కార్మికుల ఉపాధికోసం ప్రతిరోజు ఇసుక, మొరంకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ నిర్మాణాలు, కాంట్రాక్టులతో కలిసి స్థానిక కార్మికులతోనే పని చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిలివేరి లింగం, ప్రవీణ్, అనిల్ , రాజు, మల్లయ్య, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంప్లాయీస్ యూనియన్ విజయం

# ప్రభుత్వానికి హెచ్చరిక

### సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఫయాజ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఆర్‌టిసి ఎన్నికల్లో ఎఐటియుసి అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ సాధించిన విజయం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక లాంటిదని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ అన్నారు. ఆర్‌టిసి ఎన్నికల్లో యూనియన్ సాధించిన విజయాన్ని పురస్కరించుకుని కొల్లాపూర్ ఆర్‌టిసి డిపో ఎదుట నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులను ప్రలోభాలకు గురిచేసినా, ఫోన్లు, సందేశాల ద్వారా ఒత్తిళ్లు తీసుకొచ్చినా వెనుకడుగు వేయకుండా ఎంప్లాయీస్ యూనియన్‌కు మద్దతుగా నిలిచిన కార్మికులందరికీ విప్లవ అభినందనలు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పాటు పిసిసి అధ్యక్షుడు సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొనప్పటికీ కార్మికులు ఎర్రజెండాకు పట్టం కట్టారన్నారు. కొల్లాపూర్ డిపోతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సిపిఐ తరపున చట్టసభల్లోనూ ఇతర వేదికలపైనా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. యూనియన్‌కు అండగా నిలిచి చారిత్రాత్మక విజయాన్ని అందించిన ఆర్‌టిసి కార్మికులందరికీ లాల్ సలాం తెలిపారు.అనంతరం కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేసి, బాణసంచా కాల్చి, విప్లవ గేయాలకు నృత్యాలు చేస్తూ విజయోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి డిపో అధ్యక్షుడు కృష్ణ అధ్యక్షత వహించగా, డిపో ప్రధాన కార్యదర్శి సీహెచ్ మద్దిలేటి, యూనియన్ నాయకులు రామయ్య యాదవ్, మురళి, నిషార్‌పాషా, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్, నెల్లికుదురు శేఖర్, కాజా, వెంకటస్వామి, ఎస్.నిరంజన్, కె.లక్ష్మ య్య, తదితరులు పాల్గొన్నారు.




# నిరసనకారుల అరెస్ట్ సిగ్గుచేటు




### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కేంద్ర ప్రభుత్వం యువతపై అమానుషంగా పోలీసులతో దాడులు చేసి అరెస్టులు చేయడం సిగ్గుచేటని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసనలు చేపట్టిన యువతపై దాడులకు వ్యతిరేకంగా, నిరసనకారులకు మద్దతుగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ సర్‌ను రద్దు చేయాలని, సిఇసి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్యయుతంగా జంతర్ మంతర్‌లో నిరసన తెలియజేటానికి వెళుతున్నా వివిధ రాజకీయ పార్టీల నాయకులపై, యువతపై అమానుషంగా కేంద్ర ప్రభుత్వం పోలీసులతో దాడులు చేసి అరెస్టులు చేయటం సిగ్గుచేటన్నారు. వారందరిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరిని ఓటు హక్కు కల్పించాల్సిన కేంద్ర ఎన్నికల కమిషన్ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి కీలుబొమ్మగా మారిందన్నారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఓటు హక్కును తీయడమంటే రాజ్యాంబద్ధమైన వారి హక్కులను కాలరాయడమన్నారు. ఢిల్లీలో జరుగుతున్న శాంతియుతమైన నిరసన కార్యక్రమంపై పోలీసులు దాడి చేయటమంటే ప్రశ్నించే గొంతుకుని నొక్కడమేనన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓట్లను తొలగించి తిరిగి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి చివరకు ఓట్లను చోరీ చేస్తూ రాజకీయ పార్టీలను చీలుస్తూ అధికారంలో కొనసాగుతుందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఓమయ్య, రాజిరెడ్డి, రఘురాం, రంజిత్, అలీ ఇమ్రాన్, కుశాల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

● గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు కేవలం పొదుపు చేయడం, రుణాలు పొందేందుకే పరిమితం కాకుండా ఉత్పత్తిదారులుగా, వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గ్రామీణ మహిళల ప్రతిభకు, సృజనాత్మకతకు, స్వయం ఉపాధి అవకాశాలకు వేదికగా నిలుస్తున్న సారస్ గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళాను హైదరాబాద్‌లోని హెచ్ఎండిఏ గ్రౌండ్‌లో మంత్రి సీతక్క ఆదివారం ప్రారంభించారు.

తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె సందర్శించారు. మహిళలు స్వయంగా తయారుచేసిన హస్తకళా వస్తువులు, చేనేత ఉత్పత్తులు, సంప్రదాయ కళారూపాలు, గృహోపకరణాలు, ఆహార పదార్థాలు, పచ్చళ్లు, చిరుతిళ్లు, చిరుధాన్యాల ఉత్పత్తులను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళల్లో అపారమైన ప్రతిభ, నైపుణ్యం, సృజనాత్మకత ఉన్నాయని, వారికి తగిన శిక్షణ, ఆర్థిక సహకారం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే విజయవంతమైన వ్యాపారాలను నిర్వహించగలరన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు పట్టణ ప్రాంతాల్లోనూ, జాతీయ స్థాయిలోనూ మార్కెట్ కల్పించేందుకు సారస్ వంటి మేళాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా పరస్పర అనుభవాలను పంచుకునే అవకాశం కలుగుతుందని, కొత్త వ్యాపార ఆలోచనలు, మార్కెటింగ్ పద్ధతులను తెలుసుకునేందుకు వీలవుతుందని సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, సెర్ప్ డైరెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దక్షిణ మధ్య రైల్వేకు ఇంధన పొదుపులో అరుదైన గుర్తింపు

● ఏడు భవనాలు, రైల్వే స్టేషన్లకు ఐఎస్ఓ ధ్రువీకరణలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంధన పొదుపు, విద్యుత్ వినియోగ సామర్థ్యం పెంపులో దక్షిణ మధ్య రైల్వే మరో మైలురాయిని అధిగమించింది. ఇంధన నిర్వహణలో అత్యుత్తమ విధానాలను అమలు చేస్తున్నందుకు జోన్ పరిధిలోని ఏడు రైల్వే భవనాలు, స్టేషన్లకు ప్రతిష్ఠాత్మక ఐఎస్ఓ ధ్రువీకరణలు లభించాయి. విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడం, నిర్దిష్ట ఇంధన వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపట్టినందుకు ఈ గుర్తింపు దక్కింది. కాచిగూడ రైల్వే స్టేషన్, సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయ భవనం రైల్ నిలయం, లాలాగూడలోని కేంద్ర ఆసుపత్రి, సికింద్రాబాద్‌లోని లేఖా భవన్ (రైల్వే ఖాతాల కార్యాలయం), పిఆర్ఎస్ కాంప్లెక్స్‌లోని చీఫ్ కమర్షియల్ మేనేజర్ (ప్యాసింజర్ మార్కెటింగ్) కార్యాలయం, సికింద్రాబాద్ రన్నింగ్ రూమ్‌లోని చీఫ్ క్రూ కంట్రోలర్ కార్యాలయం, రామగుండంలోని రొటీన్ ఓవర్‌హాలింగ్ షెడ్ ఈ ధ్రువీకరణలను పొందాయి.ఈ భవనాలు, కార్యాలయాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థల నిర్వహణ, విద్యుత్ వనరుల సమర్థ వినియోగం, ఇంధన పొదుపు చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పిఆర్ఎస్ కాంప్లెక్స్‌లోని ప్యాసింజర్ రిజర్వేషన్ వ్యవస్థ, అన్‌రిజర్వ్‌డ్ టికెట్ కౌంటర్లకు విద్యుత్ బ్యాకప్ అందించడం, డీఆర్ డేటా సెంటర్ నిర్వహణ, విద్యుత్ బ్యాకప్, శీతలీకరణ వ్యవస్థల పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అలాగే రన్నింగ్ రూమ్‌లో రైలు సిబ్బంది నిర్వహణ, విశ్రాంతి గదులు, ఆహార సదుపాయాలకు సంబంధించిన కార్యకలాపాల్లో విద్యుత్ వినియోగాన్ని సమర్థంగా నిర్వహిస్తున్నారు. రామగుండం రొటీన్ ఓవర్‌హాలింగ్ షెడ్‌లో వ్యాగన్ల మరమ్మతులు, యార్డు తనిఖీలు, లోపాలున్న వ్యాగన్ల నిర్వహణలోనూ ఇంధన పొదుపు పద్ధతులను అమలు చేస్తున్నారు.

ఏడు విభాగాలకు ఐఎస్ఓ ధ్రువీకరణలు లభించడంపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (పిసిఇఇ), సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు, సంబంధిత అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఇంధన సంరక్షణలో అత్యుత్తమ విధానాలను అమలు చేయడంలో దక్షిణ మధ్య రైల్వే ముందంజలో ఉందని, నిరంతరంగా ఇంధన పొదుపు చర్యలు చేపడుతూ గుర్తింపు పొందడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.



## అథ్లెటిక్స్‌లో యంగ్ ఇండియా పోలీసు స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైప్స్) విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో వివిధ విభాగాల్లో పోటీపడి మొత్తం తొమ్మిది పతకాలు సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. ఇందులో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, మూడు కాంస్య పతకాలు ఉన్నాయి. అండర్ 10 బాలికల విభాగంలో సీహెచ్ లాస్యశ్రీ అసాధారణ ప్రతిభ కనబరిచింది. 60 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందాల్లో ప్రథమ స్థానంలో నిలిచి రెండు స్వర్ణ పతకాలు కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో లంక పార్వతి రెండు పరుగు పందాల్లోనూ ద్వితీయ స్థానంలో నిలిచి రెండు రజత పతకాలు సాధించింది. అండర్ 10 బాలికల లాంగ్‌జంప్‌లో సాన్విక గౌడ్ కాంస్య పతకాన్ని గెలుచుకోగా, అండర్ 12 బాలికల లాంగ్‌జంప్‌లో ఎం.అశ్విని రజత పతకాన్ని దక్కించుకుంది. అండర్ 14 బాలికల 60 మీటర్ల పరుగు పందెంలో సింధం వజ్ర వరుణవి కాంస్య పతకంతో మెరిసింది. బాలుర విభాగంలోనూ వైప్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్ 12 బాలుర 300 మీటర్ల పరుగు పందెంలో సీహెచ్ రితేష్ రజత పతకాన్ని, సీహెచ్ జీవన్ కాంస్య పతకాన్ని సాధించారు. వివిధ క్రీడా విభాగాల్లో విద్యార్థులు సాధించిన విజయాల పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ యువ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల నిరంతరం కృషి చేస్తోందని తెలిపింది. తొమ్మిది పతకాల విజయంతో వైప్స్ విద్యార్థులు పాఠశాలకు మరోసారి గర్వకారణంగా నిలిచారు.



## కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణకు విశేష ప్రయోజనం

● బిజెపి ప్రజాప్రతినిధుల సమావేశంలో నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా తెలంగాణకు విశేష ప్రయోజనం చేకూరిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాంచందర్ రావు అధ్యక్షతన పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ప్రజాప్రతినిధిగా, ముఖ్యమంత్రిగా, అనంతరం ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సమావేశంలో నేతలు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మోదీ అనుసరిస్తున్న 'నాగరిక్ దేవో భవ' అనే మార్గదర్శక సూత్రాన్ని నేతలు ప్రశంసించారు. 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా తెలంగాణవ్యాప్తంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలను సమావేశం అభినందించింది. రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల కోసం కేంద్రం రూ.13 లక్షల కోట్లకు పైగా నిధులు అందించిందని రాంచందర్ రావు అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, ఎంపిలు డాక్టర్ కె.లక్ష్మణ్, డి.కె.అరుణ, ఈటల రాజేందర్, బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్ష నేత ఏవిఎన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర కోఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యలు సరికావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో మూకుమ్మడి ఓట్ల తొలగింపు జరగలేదంటూ ఎన్నికల సంఘాన్ని సమర్థించడం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తన స్థాయిని తనే దిగజార్చుకోవడమేనని టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు.ఆదివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో సుమారు 91 లక్షల ఓట్లు తొలగించడం మూకుమ్మడి తొలగింపు కాదా అని ప్రశ్నించారు. తెలంగాణలోని ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్లు, వారి కుటుంబ సభ్యులైన 31 మంది ఓటర్ల పేర్ల తొలగింపునకు బిజెపి బిఎల్ఎ ఫారం7 దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. ఎస్ఐఆర్‌లో వెంకయ్య నాయుడికే 2002 నాటి ఓటరు వివరాలు సమర్పించాలని నోటీసు వచ్చిందని, అధికారుల సహాయంతో వాటిని సేకరించారని గుర్తుచేశారు. సామాన్య ఓటర్లు ఇలాంటి వివరాలను సేకరించగలరా అని ప్రశ్నించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు.

## కీలక పరీక్షలు జరిగే రోజుల్లో ర్యాలీలు, ఊరేగింపులు, సభలకు... జిల్లా యంత్రాంగాలు అనుమతులు నిలిపివేయాలి

● 'ఎన్‌టిఎ' సంస్కరణలపై పార్లమెంటరీ కమిటీ

**న్యూఢిల్లీ :** కీలకమైన పోటీ పరీక్షలు జరిగే రోజుల్లో ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు లేదా బహిరంగ సభలకు జిల్లా యంత్రాంగాలు అనుమతులు నిలిపివేయాలని, తద్వారా, పరీక్షలకు ముందుగానే సురక్షితమైన ట్రాఫిక్, శాంతిభద్రతల ఏర్పాట్లు జరిగేలా చూడాలని, అలాగే బాహ్య అవాంతరాల వల్ల ఏ ఒక్క అభ్యర్థి ప్రభావితం కాకుండా చూసుకోవాలని ఒక పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. రాజ్యసభ ఎంపి ముకుల్ వాస్నిక్ నేతృత్వంలోని విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడల పార్లమెంటరీ స్థాయీ సంఘం శుక్రవారం రాజ్యసభ చైర్మన్‌కు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) సంస్కరణలు, బలోపేతం'పై నివేదికను సమర్పిస్తున్నప్పుడు ఈ సిఫార్సు చేసింది. 'నీట్' పేపర్ లీక్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో జరిగినట్లు ఆరోపించబడిన పరిపాలనా పరమైన లోపాల చుట్టూ నెలకొన్న వివాదం నేపథ్యంలో ఈ నివేదిక వెలువడింది. ఈ వివాదం దేశవ్యాప్త విద్యార్థి నిరసనలకు దారితీసి, చివరికి అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారణమైంది. 'పరీక్ష రోజున బహిరంగ ర్యాలీలు, ఊరేగింపులు లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడటం వల్ల అభ్యర్థులకు ఆలస్యం కావచ్చు. వారు రిపోర్టింగ్ సమయాన్ని కోల్పోయే అవకాశం ఉంది. పరీక్షల రోజున ఎలాంటి ర్యాలీ, ఊరేగింపు, ఇతర బహిరంగ సమావేశాలకు అనుమతిని నిలిపివేయాలని, నివారించగల బాహ్య ఆటంకాల వల్ల ఏ ఒక్క అభ్యర్థి కూడా ప్రభావితం కాకుండా ఉండేలా, ముందుగానే సురక్షితమైన ట్రాఫిక్, శాంతిభద్రతల ఏర్పాట్లు కూడా ఉండేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించేలా పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్–2024ను సవరించాలని కమిటీ సిఫార్సు చేస్తోంది' అని ఆ నివేదిక పేర్కొంది. ఇప్పటివరకు పరీక్షల రోజున అటువంటి కార్యక్రమాలు జరిగితే, విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకుని తదనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని కోరుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సలహాలు జారీచేసింది. తమ ముందు లేవనెత్తిన విధానపరమైన ఆందోళనలను గమనించిన పార్లమెంటరీ ప్యానెల్, పరీక్షా కేంద్రాలకు కొన్ని నిమిషాలు ఆలస్యంగా వచ్చే అభ్యర్థులను చాలావరకు పూర్తిగా లోపలకు అనుమతించడం లేదని, దీని ఫలితంగా ఒక చిన్న ఆలస్యం కారణంగా వారు ఏడాది పొడవు చేసిన కష్టం అంతా వృథా అవుతోందని పేర్కొంది.'కొన్ని నిజమైన కారణాలు ఉన్నాయని కమిటీ గమనిస్తోంది. దీని కారణంగా అభ్యర్థి పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా చేరుకోవచ్చు. విద్యార్థులు ఆలస్యంగా వస్తున్నట్లు ధృవీకరిస్తూ ఒక అండర్ సంతకం చేసిన తర్వాతే పరీక్షా హాలులోకి ప్రవేశించేందుకు అనుమతించాలి. అలాగే, మిగిలిన సమయానికి మాత్రమే పరీక్ష రాసేందుకు అనుమతించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు సమయం ఇవ్వకూడదు అనే విధంగా ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని కమిటీ అభిప్రాయపడుతోంది' అని అది పేర్కొంది. పరీక్ష జరుగుతున్న సమయంలో పర్యవేక్షకులు సంతకాలు, తనిఖీ వంటి లాంఛనాలను పూర్తి చేయడం వల్ల, అప్పటికే సమయంతో పోటీపడుతున్న విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలుగుతోందని కూడా పార్లమెంటరీ ప్యానెల్ తెలిపింది.'పరీక్షకు ముందు లేదా తర్వాత 15నిమిషాల ప్రత్యేక సమయాన్ని కేవలం అటువంటి లాంఛనాల కోసమే కేటాయించాలి. పరీక్షా వ్యవధి మధ్యలో కాదు అని కమిటీ అభిప్రాయపడుతోంది' అని అది వివరించింది.

## ఫుట్‌బాల్ క్రీడాకారులకు సువర్ణావకాశం

● తెలంగాణలో ఫుట్‌బాల్ టాలెంట్ హంట్.. 7 కేంద్రాల్లో ట్రయల్స్

● ఖేలో తెలంగాణలో భాగంగా యువ క్రీడాకారులకు ప్రతిభ నిరూపించుకునే అవకాశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో ఫుట్‌బాల్ క్రీడను ప్రోత్సహించి, యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) ఇండియా ఖేలో ఫుట్‌బాల్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభాన్వేషణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఖేలో తెలంగాణలో భాగంగా అక్టోబర్ 11 నుంచి నవంబర్ 6 వరకు ఏడు కేంద్రాల్లో ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఎంపికైన వారికి క్రమబద్ధమైన శిక్షణ, క్రీడాభివృద్ధికి అవకాశాలు కల్పించనున్నారు. ట్రయల్స్ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 11న హకీంపేట్ (టిజిఎస్ఎస్), 14న మహబూబ్‌నగర్ (డిఎస్ఎ స్టేడి యం), 16న సిద్దిపేట (మినీ స్టేడియం), 18న నిజామాబాద్ (కలెక్టర్ గ్రౌండ్), 22న మెదక్ (ఇందిరాగాంధీ అవుట్‌డోర్ స్టేడి యం), 25న హైదరాబాద్ (గచ్చిబౌలి స్టేడియం), నవంబర్ 6న సరూర్‌నగర్ స్టేడియంలో ట్రయల్స్ నిర్వహిస్తారు. ప్రతి కేంద్రంలో ఉదయం 8 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయి. వయస్సు అర్హతలు ఇలా ఉన్నాయి. 2009 నుంచి 2016 మధ్య జన్మించిన బాలురు, 2001 నుంచి 2015 మధ్య జన్మించిన బాలికలు పాల్గొనవచ్చు. అర్హులైన క్రీడాకారులు[ఈ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు] (https://forms.gle/NWgucogbJWGEpBCm8). ట్రయల్స్‌పై విస్తృత ప్రచా రం నిర్వహించి, అర్హులైన క్రీడాకారులు పాల్గొనేలా పాఠశాలలు, కళాశాలలు, ఫుట్‌బాల్ అకాడమీలు, క్లబ్‌లను సంప్రదించాలని జిల్లా యువజన, క్రీడల అధికారులకు సాట్ సూచించింది. యువ క్రీడాకారులు, తల్లిదండ్రులు, కోచ్‌లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

● ప్రయాణికుడి పవర్ బ్యాంక్ నుంచి మంటలు.. అప్రమత్తమైన సిబ్బంది



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గగనతలంలో ప్రయాణిస్తున్న విమానంలో పవర్ బ్యాంక్ నుంచి మంటలు చెలరేగడంతో కలకలం రేగింది. ఢిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న ఇండిగో విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దారి మళ్లించి అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. విమానంలో ఓ ప్రయాణికుడికి చెందిన పవర్ బ్యాంక్ నుంచి మంటలు రావడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా దించారు. ఈ ఘటనలో ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. విమానంలో చోటుచేసుకున్న ఘటనతో ప్రయాణికులు కొంత ఆందోళనకు గురయ్యారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఓటు హక్కు సద్వినియోగం చేసుకోండి : దాసోజు శ్రవణ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు శక్తివంతమైన ఆయుధమని, దీనిని అర్హత కలిగిన ప్రతీ పట్టభద్రుడు ఉపయోగించుకునేందుకు ఓటరుగా నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ సూచించారు. సమాజంలో మార్పు అనేది రాత్రికి రాత్రే సాధ్యపడబోదని, ఇందుకు విద్యావంతులుగా నిరంతరం శ్రమించడం ప్రాథమిక బాధ్యత అని అన్నారు. రాబోయే 'హైదరాబాద్–మహబూబ్‌నగర్–రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటు నమోదు, గెలుపు వ్యూహాలపైన హైదరాబాద్‌లోని సోమాజిగూడలో పట్టభద్రులతో ఆదివారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ విద్యావంతులైన యువతలో రాజకీయాలు, ఓటింగ్ పట్ల నిర్లిప్తత ఆందోళన కలిగిస్తోందన్నారు.ని రక్షరాస్యులు బాధ్యతగా ఓటు వేస్తుంటే, చదువుకున్న విద్యావంతులు మాత్రం ఎన్నికల రోజును కేవలం ఒక సెలవు దినంగా భావించి ఇతర పనుల్లో గడపడం సరికాదని సూచించారు. చరిత్రలో ఏ గొప్ప ఉద్యమమైనా, ఏ విప్లవాత్మక మార్పు అయినా యువత భాగస్వామ్యంతోనే సాధ్యపడిందని, సమాజంలో ప్రతి మార్పునకు యువకులే అసలైన పునాది అని అన్నారు. రాజ్యాంగ సూత్రాలను, హక్కులను మర్చిపోవడమే నేటి అన్ని సమస్యలకు మూలకారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం ఒక స్పష్టమైన ఉపాధి విధానం కూడా లేదని, ఎన్నికల హామీ ప్రకారం 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఊసే లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపైన, నిరుద్యోగ సమస్యలపైన మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, బిఆర్ఎస్‌వి నాయకుడు మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు పట్టభద్రులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతలంతా డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలి

● చరణ్ కౌశిక్ యాదవ్, నాగరి ప్రీతమ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విసిరిన వైట్ ఛాలెంజ్‌ను స్వీకరించి బిఆర్ఎస్ నేతలంతా డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని కార్పొరేషన్ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, మాజీ చైర్మన్ నాగరి ప్రీతమ్ డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ డ్రగ్స్ పరీక్షల కోసం తాము రక్త నమూనాలు ఇచ్చామని, బిఆర్ఎస్ నేతలు కూడా ఇవ్వాలని సవాల్ విసిరారు. కేటీఆర్ స్వీకరించలేదని విమర్శించారు. 50 ఏళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ఖాతాలో రూ.900 కోట్లు ఉంటే, పదేళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,500 కోట్లు ఎలా వచ్చాయని చరణ్ కౌశిక్ యాదవ్ ప్రశ్నించారు. బిఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల కాంట్రాక్టుల్లో 30 శాతం కమీషన్లు తీసుకున్నారని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌కు వెళ్లిన దళితులను పసుపు నీళ్లతో శుద్ధి చేశారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ దళిత నేతలు సమాధానం చెప్పాలని నాగరి ప్రీతమ్ డిమాండ్ చేశారు. బల్మూరి వెంకట్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని, బిఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు. మహిళా జర్నలిస్టును పోలీసులు ఇబ్బంది పెట్టినట్లు తేలితే చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

# గోవా, ముంబయిలలో సిజెపి నిరసనపై ఉక్కుపాదం

● పోలీసుల అదుపులో అనేకమంది నాయకులు, కార్యకర్తలు

● అజాద్ మైదాన్‌లో ప్రవేశాన్ని అడ్డుకున్న పోలీసులు

● పోలీసు బాధితుల్లో హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రెబెల్లో

**పనాజీ:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గోవా, ముంబైలలో కాక్రోచ్ జనతాపార్టీ(సిజెపి) నిరసన ప్రదర్శనపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ రెండు చోట్లా సిజెపి నాయకులను, కార్యకర్తలను చట్టవిరుద్ధంగా అదుపులోకి తీసుకున్నారు. గోవా ప్రధాన నగరం పనాజీలో సిజెపి నాయకుడు అమీన్ షేక్ సహా ఏడుగురు నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అజాద్ మైదానంలోకి వారిని ప్రవేశించకుండా అడ్డుకున్నారు. అలహాబాద్ హైకోర్టులో పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తి ఫెర్డిన్ రెబెల్లో నాయకత్వాన ''ఇక చాలు'' అనే పేరుతో ఎన్నికల సంఘం అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు.మైదానంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నం చేసిన ప్రతిఒక్కరినీ పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. దీంతో రెబెల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ప్రదర్శకులను అజాద్ మైదానంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడానికి ఏ సెక్షన్ కింద, ఏ నిబంధనల కింద అధికారాలను ఉపయోగించారో చెప్పాలని పోలీస్ సూపరింటెండెంట్ హరీశ్ మద్వైర్‌ను ఆయన నిలదీశారు. ప్రదర్శకులు ర్యాలీ ప్రారంభించకముందే పోలీసులు వారిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. భారీసంఖ్యలో కాక్రోచ్ జనతాపార్టీ ప్రదర్శకులు అజాద్ మైదానంలోకి వెళ్ళేందుకు ఆ ప్రాంతానికి చేరుకోగానే పోలీసులు, పోలీసు అధికారులు వారిని చుట్టుముట్టారు. అనేకమంది సీనియర్ నాయకులు, ప్రముఖులు పాల్గొన్న ఈ నిరసన ప్రదర్శనలో పోలీసులు ఎవ్వరినీ లెక్కచేయలేదు. ఫెర్డిన్ రెబెల్లోను కూడా పోలీసులు నిర్దాక్షిణ్యంగా అడ్డుకున్నారు. వారందరినీ మైదానంలోకి ప్రవేశించకుండా రహదారికి కొద్దిదూరంలోనే కదలకుండా నిలిపివేసి దిగ్బంధనం చేశారు. దీంతో అనేకమంది నిరసన ప్రదర్శకులు వీధుల్లో బృందాలు బృందాలుగా విడిపోయారు. గోవా పోలీస్ ప్రధాన కార్యాలయం వెలుపల వీధుల్లో బృందాలుగా సిజెపి కార్యకర్తలు గుమిగూడారు. ''ఎంతమందిని పోలీసులు అరెస్టు చేశారో, నిర్బంధించారో మాకు తెలియడంలేదు, ఎందుకంటే అజాద్ మైదానం వైపు వెళుతున్న ప్రతిఒక్కరిపైనా పోలీసులు నిఘా వేసి అడ్డుకున్నారు, ప్రతి ఒక్కరినీ ఆపేశారు, ఇదంతా పనజీ ఉత్తర విభాగం పోలీస్ సూపరింటెండెంట్ హరీశ్ మద్వైకర్ కనుసన్నలలోనే జరిగింది'' అని ప్రదర్శకులు చెప్పారు. ఆయన సమక్షంలోనే ప్రముఖ న్యాయవాదులు క్లైడ్, నోర్మా అల్వారెస్, మాజీ ప్రధాన న్యాయమూర్తి రెబెల్లో, కార్యకర్తలు స్వపనేశ్ షెర్లేకర్, గోవింద్ షెర్లేకర్ లను పోలీసులు అడ్డగించారు. కదలకుండా నిర్బంధించారు.''వా విముక్తికోసం స్వాతంత్ర్య సమరయోధులు గొప్ప పోరాటాలు చేశారు, ఈనాడు మేం కూడా ఎన్నికల సంఘం తన అధికారాలను దుర్వినియోగం చేయడాన్ని వ్యతిరేకిస్తూ, దాని నుండి విముక్తి కోరుతూ నిరసన ప్రదర్శన చేపట్టాం, అజాద్ మైదానంలోకి ప్రవేశించేందుకు మమ్మల్ని వెళ్ళనివ్వకుండా అడ్డుకున్నారు, ఇది పెద్ద నేరం'' అని రెబెల్లో హెచ్చరించారు.



అదేవిధంగా ముంబయి నగరంలో కూడా సిజెపి కార్యకర్తలు, నాయకులను పోలీసులు శివాజీపార్కు వద్ద అదుపులోకి తీసుకున్నారు. కార్యకర్త అంజలీ దమనియా సహా అనేక డజన్ల మంది కార్యకర్తలను, నాయకులను ఆదివారంనాడు అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు అధికారులు చెప్పారు. వారంతా సెంట్రల్ ముంబై దాదర్ ప్రాంతంలోని శివాజీ పార్కుకు చేరుకోగానే పోలీసులు అరెస్టు చేశారు. దమనియాను పోలీసులు శివాజీపార్కు వద్ద అరెస్టు చేసి ఒక ప్రైవేటు వాహనంలో గుర్తు తెలియని ప్రదేశానికి తరలించారు. ''సిజెపి ఉద్యమానికి మద్దతుగా నిరసన తెలియజేయడానికి నేను శివాజీ పార్కు వద్దకు చేరుకోగానే సాధారణ దుస్తులలో వచ్చిన వ్యక్తులు నన్ను ఎటూ కదలకుండా నిర్బంధంలోకి తీసుకున్నారు. పోలీసులు అందరూ సాధారణ దుస్తుల్లోనే ఉన్నారు, నన్ను ఎక్కడకు తీసుకువెళుతున్నారో నాకు తెలియదు'' అని దమనియా పిటిఐ వార్తాసంస్థకు చెప్పారు. అరెస్టు చేసినవారిని శివాజీ పార్క్ పోలీస్ స్టేషన్‌కు, సమీపంలోని ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు అధికారులు చెప్పారు.

శివసేన(యుబిటి) నాయకుడు, వర్లీ ఎంఎల్ఎ ఆదిత్య థాక్రే మాట్లాడుతూ, బిజెపి యువకులు, విద్యార్థుల ఉద్యమాన్ని చూసి తీవ్ర భయాందోళనకు గురవుతోందని విమర్శించారు. ముంబైలో కూడా విద్యార్థులను చూసి బిజెపి భయపడుతోందని, శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్న ఎంతో మందిని అరెస్టులు చేసిందని అన్నారు. మేం శాంతియుతంగా, నిర్భయంగా ప్రదర్శన చేస్తున్నాం, ఐనాగానీ బిజెపి ప్రభుత్వం భయపడుతోంది అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్టింగ్ పెడుతూ, పోలీసుల వైఖరిని ఖండించారు. పోలీసు నిర్బంధంలో ఉన్నవారికి తన పూర్తి సంఘీభావం ప్రకటించారు. మమ్మల్ని ఎక్కడికి తీసుకువెళుతున్నారో చెప్పండి,మేం అక్కడికే వచ్చి నిరసన తెలియజేస్తాం,బహుశా బారికేడ్ల వెనుక దాక్కుని ఉన్న బడా నాయకుల ఆదేశాలను పోలీసులు పాటిస్తున్నారు అని విమర్శించారు.

ప్రదర్శకులను పోలీసులు నిర్బంధించడానికి వెనుకగల కారణం ఏమిటో చెప్పాలని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు అమిత్ థాక్రే నిలదీశారు. రేపటి నుండి ఎంఎన్ఎస్ కార్యకర్తలు కూడా నిరసన ప్రదర్శనల్లో పాల్గొంటారని చెప్పారు. శివాజీ పార్క్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఒక పోలీసు అధికారి, బిజెపి కార్యకర్తలు కలిసి, సిజెపి కార్యకర్తలపై దాడులు చేయాల్సిందిగా నవరాత్రి మండల్ నిర్వాహకులను రెచ్చగొడుతున్నారని, వారికి చట్టపరమైన మద్దతు ఇస్తామని చెబుతున్నారని ఎంఎన్ఎస్ నాయకుడు సందీప్ దేశ్‌పాండే విమర్శించారు. అసలు ఇదేం ప్రజాస్వామ్యం? మీరు ప్రజలకు న్యాయబద్ధంగా నిరసన తెలియజేయడానికి అవకాశం ఇవ్వడం లేదు, ప్రజలు నిరసన చేయడానికి వచ్చినప్పుడు వారిని అరెస్టు చేస్తున్నారు, అల్లర్లను రెచ్చగొట్టడం పోలీసుల పనా? లేక వారిని అడ్డుకోవడం పోలీసుల పనా? అని దేశ్‌పాండే ప్రశ్నించారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



ప్రజాపక్షం/నవాబుపేట్ : బోరు మోటారు స్టార్టర్‌ను ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన విషాద ఘటన నవాబుపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముబారక్‌పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. నవాబుపేట్ ఎస్సై గిరి తెలిపిన వివరాల ప్రకారం ముబారక్‌పూర్ గ్రామానికి చెందిన జుకమొళ్ల శ్రీనివాసరెడ్డి (50) ఆదివారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో వరి పంటకు నీరు పెట్టేందుకు తన పొలానికి వె ళ్లాడు. ఈ క్రమంలో బోరు మోటారు స్టార్టర్ డబ్బాను ఆన్ చేస్తుండగా సమీపంలోని విద్యుత్ తీగలు చేతులకు, గొంతుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై గిరి వెల్లడించారు. రైతు మృతితో ముబారక్‌పూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తాం

ఎంపి ఈటల, ఎమ్మెల్యే బండారి



ప్రజాపక్షం/ఉప్పల్ : రామంతాపూర్‌లోని హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి పక్కన ఉన్న భక్త మార్కండేయ శివాలయానికి వెళ్లే మార్గంలో ఆనంద్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గుండ్ల రవీందర్ ఏర్పాటు చేసిన నూతన ముఖద్వారాన్ని ఆదివారం మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు ప్రారంభించారు. ఆలయాలు ఆధ్యాత్మిక చింతన కేంద్రాలుగా నిలుస్తాయని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ మన దేశ సంస్కృతికి మరింత వన్నె తేవాలని, ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఎంపి, ఎమ్మెల్యేలు అన్నారు. ఆలయాల అభివృద్ధికి స్థానికులు ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి, రామంతాపూర్ పద్మశాలి సంఘ అధ్యక్షుడు కొండ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సిరిసాల విజయ ప్రకాశ్, కోశాధికారి కొంగరి బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కెపి వివేకానంద



ప్రజాపక్షం/ నిజాంపేట్ : పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని బిఆర్‌ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కౌసర్ ఆసుపత్రిని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుతో కలిసి ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్, రాజులు మాట్లాడుతూ ఆధునాతన వైద్య సేవలను ప్రజలకు అందించాలని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా కార్మికులు, పేద ప్రజలు నివసిస్తారని వారికి అనుగుణంగా ఆసుపత్రిని నడపాలని సూచించారు. లాభాపేక్ష కాకుండా పేదలకు అనుగుణంగా వైద్య సేవలను అందిస్తూ ఆసుపత్రి దినదినాభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సత్యనారాయణ, సురేశ్ రెడ్డి, జగన్, ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ వాహిద్, షాకిర్ కాసర్, నాయకులు బాస్కర్ పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు



ప్రజాపక్షం/ నిజాంపేట్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, కుత్బుల్లాపూర్, గాజులరామారం, చింతల్, దుండిగల్ సర్కిల్‌లలోని అన్ని డివిజన్‌లు, బస్తీలు, కాలనీలలో దుర్గమ్మ మండపాల్లో అమ్మవారిని నెలకొల్పారు. కాలనీలు, బస్తీలలోని శ్రీ కనక దుర్గమ్మ ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆదివారం బాలా త్రిపుర సుందరీ దేవీ అలంకరణతో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. నిజాంపేట్‌లోని శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో మంగల తోరణాలతో, దివ్య మంగళ వాయిద్యాలతో ప్రత్యేక పూజలు జరిగాయి. కొలను శ్రీనివాస్ రెడ్డితో పాటు ఆలయ కమిటీ సభ్యులు కొలను నర్సింహా రెడ్డిలు బాల పాశుపత చండీ హోమంలో పాల్గొన్నారు. అనంతరం నిజాంపేట్ వాసులు నరేంద్ర, సుప్రియ, రాఘవేంద్ర, మేఘన, సరిత, రాందేవ్ రెడ్డి, బిక్షితల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కనక దుర్గమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని, అమ్మవారి అనుగ్రహంతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని వేడుకున్నారు.

## నాసిరకం రోడ్లు వేస్తున్న కాంట్రాక్టర్లు

పట్టించుకోని అధికారులు



ప్రజాపక్షం/దౌల్తాబాద్: కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల పరిధిలోని గోకఫసల్ వాద్ బలంపేట్ వరకు 6కిలోమీటర్ల తారు రోడ్ వేస్తున్న సందర్భంలో వేసిన నెల రోజులకే గుంతల మయంగా మారిందని , వాహనదారులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో గ్రామాలలో రవాణా వ్యవస్థ బాగుంటే గ్రామాలు బాగుపడుతాయనే ఉద్దేశంతో కోట్లు వెచ్చించి రోడ్లు మంజురు చేస్తున్నరు కాని కంట్రాక్టర్లు మాత్రం తమ జేబులు నింపుకోవడానికి నాసిరకం రోడ్లు వేస్తు పబ్బం గుడుపుతున్నారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నాణ్యతను పరిశీలించకుండా రోడ్లు వేస్తున్న సమయంలో అధికారులు పర్యటించకపోవడం ,నాణ్యతను పరిశీలించకపోవడం నాణ్యతను పరిశీలించకపోవడం కారణమని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

# ఆడబిడ్డలు జరుపుకునే ఏకైక పండగ బతుకమ్మ

పూల పండగలో ఆడిపాడిన మంత్రి సీతక్క



ప్రజాపక్షం/శామీర్‌పేట : బతుకమ్మ పండగ అంటనే అమ్మగారిల్లు గుర్తుకోస్తుందని ఆడబిడ్డలు ఆనందంగా సంతోషంగా జరుపుకునే ఏకైక పండగ బతుకమ్మ పండగా అని పంచాయతిరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్‌లో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ పండగ సంబరాల్లో బాగంగా బతుకమ్మ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి సీతక్కకు టిపిసిసి ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి ఆయన కుటుంబీకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పెద్ద బతుకమ్మ వద్ద జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. మంత్రి సీతక్క మహిళలతో, చిన్నారులతో కలిసి బతుకమ్మ పాటలు పాడుకుంటు బతుకమ్మ ఆడారు.అనంతరం సీతక్క మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింభం బతుకమ్మ పండగ అని అన్నారు. మన భవిష్యత్తు తరాలకు మనం అందించే గొప్ప వారసత్వం, ఆస్తి, అంతస్తు ఎద్దైన ఉందంటే తెలంగాణ రాష్ట్ర పండగ బతుకమ్మ పండగ అని కొనియాడారు. మన సంస్కృతి, మన పాట, మన ఆట, జీవన విధానం మన పూర్వికులు తరతరాల నుంచి వస్తున్న ఆచారాలను ప్రతి ఒక్కరు పాటించాలని పేర్కోన్నారు. బతుకమ్మ పండగను పురస్కరించుకుని ఒక వేదిక ఏర్పాటు చేసి ఆడపడుచులందరిని ఒక వేదికపైకి తీసుకవచ్చి భారీ ఏర్పాట్లను చేసిన టిపిసిసి మహిపాల్‌రెడ్డికి ఆయన కుటుంబ సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి డిసిసి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి కళాశాలల చైర్మన్ డాక్టర్ ప్రీతిరెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు మహేష్‌గౌడ్, పెండెం లక్ష్మినారాయణ, శ్రీనివాస్ రెడ్డి, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా బతుకమ్మ సంబురాలు

శిల్పారామంలో కళాకారుల ప్రదర్శనలు




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/ఉప్పల్ : తెలంగాణా సంప్రదాయ బతుకమ్మ వేడుకలు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వాడవాడలా భక్తిభావాలతో నిర్వహిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, కమ్యూనిటీ హాళ్లు, కూడళ్లలో మహిళలు, యువతులు సంప్రదాయకంగా రంగు రంగు పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆటలు ఆడుతుండటం వాడవాడలా పండుగ వాతావరణం నెలకొంది. రెండో రోజు సందర్భంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి సాయంత్రం సందర్శకులతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో పూల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మినీ శిల్పారామం యాంఫీ థియేటర్లో శ్రీమతి రేణుక ప్రభాకర్ శిష్య బృందం నవరాత్రుల పూజలందుకొనే తొమ్మిది రూపాల అమ్మవార్ల కథలను కూచిపూడి నృత్యరూపకంలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవార్ల వేషధారణ, హావభావాలు, నృత్యాభినయం ప్రేక్షకులను ఆనందడోలికల్లో ముంచెత్తాయి. దేవిక, రీతిగ, లోహిత, మాధురి, ప్రణతి, ప్రవల్లిక, భవజ్ఞ తదితరులు ప్రదర్శనలనలతో అలరించారు. నాచారంలోని డక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థినులు, చిన్నారులు బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా జరుపుకొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి రంగు రంగు పూలతో పేర్చిన బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. దాండియా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. పాఠశాల చైర్మన్ నవనీతరావు, ఎండి నవీన్‌కుమార్,డైరెక్టర్ డా.మనోహర్‌రావు, ప్రిన్సిపాల్ ఫణిమాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు కృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భారతదేశ సంప్రదాయాలను గౌరవిస్తూనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవటంతో పాటు నైతిక విలువను అలవరచుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. మేడ్చల్‌లో మేడ్చల్ 297వ డివిజన్‌లో దేవరయాంజల్ గ్రామంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి మహిపాలరెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ పోటీలు నిర్వహించారు. పెద్దల విభాగంలో, చిన్నారుల విభాగంలో పాల్గొన్న వారికి మొదటి 10 స్థానాల్లో నిలిచిన వారిని ఎంపిక చేసి బహుమతులను అందచేసారు. ఈ పోటీల్లో మాజీ కౌన్సిలర్లు, బిఎల్‌ఏలు, కాంగ్రెస్ పార్టీ మహిళలు తదితరులు పాల్గొన్నారు. వెంకటసాయి నగర్ కాలనీలో...కాలనీతలో తెలంగాణా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు ఘ నంగా జరిగాయి. కాలనీ వెల్ఫేర్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకల్లో కమిటి సభ్యులు, కాలనీ మహిళలు, యువతులు ఆనందంగా, ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సంబరాలు జరుపుకొన్నారు.

## అనురాగ్‌లో 'ఎఐ' హంగామా

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : కృత్రిమ మేధస్సు రంగంలో విద్యార్థుల నైపుణ్యాలు,ఆవిష్కరణలను ప్రోత్సహించే,లక్ష్యంతో అనురాగ్ విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 8న నిర్వహించిన ఏఐ ఐక్యం కార్యక్రమం విజయవంతమైంది. కృత్రిమ మేధస్సు విభాగం, ఎఐ స్క్వేర్డ్, ఐఇఇఇ సిఐఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 130 మంది పాల్గొన్నారు. ఏఐ మహాయుద్ధంలో విద్యార్థులు కృత్రిమ మేధస్సు సమునాలతో సమస్యలను పరిష్కరించగా ఎఐ ప్రదర్శనలో వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. పరిశ్రమ నిపుణులు బొత్తుల పవన్ కల్యాణ్,ధీరజ్ కుమార్ రెడ్డి,యెర్రబాపు,రీనే (రష్మి) ఆధునిక సాంకేతికతలు,పరిశ్రమ అవకాశాలపై సూచనలు అందించారు. డిన్ డాక్టర్ వి.విజయకుమార్, విభాగాధిపతి డాక్టర్ ఎం.తృప్తి పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేవారు.నిపుణుల చర్చలో ప్రదీప్ బన్సాల్,నీకేలు గుండా, వినయ్ కుమార్ పి.పాల్గొనగా రుచితా రెడ్డి సమన్వయం చేశారు.అధ్యాపక సమన్వయ కర్తలు స్వాతి,విక్టర్ డేనియల్,విద్యార్థి సమన్వకర్తలు శ్రియా సుశీల్, వి.జైత్ర కార్యక్రమం విద్యార్థులకు ఆచరణాత్మక అభ్యాసం, పరిశ్రమ నిపుణులతో అనుసంధానానికి వేదికగా నిలిచింది.

## జవహర్‌నగర్ ఆదర్శనగర్‌లో సిపిఐ శాఖ పునర్నిర్మాణ మహాసభ



ప్రజాపక్షం/జవహర్ నగర్ : జవహర్ నగర్ పరిధిలోని ఆదర్శనగర్‌లో సిపిఐ శాఖ పునర్నిర్మాణ మహాసభ అట్టహాసంగా నిర్వహించబడింది. కామ్రేడ్ మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన ఈ సమావేశం ఘనంగా జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్. దశరథ్ హాజరయ్యారు. స్థానిక సమస్యలపై చర్చ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్.దశరథ్, కామ్రేడ్ మండల కార్యదర్శి దర్శనం యాదగిరి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో సంఘంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని, స్థానిక అభివృద్ధిలో యువత ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. బస్తీ సమస్యలు ఆదర్శనగర్ బస్తీలోని ప్రాథమిక సౌకర్యాలు, స్థానికంగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ప్రజల అవసరాలపై కూలంకషంగా చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదర్శనగర్ నూతన కమిటీ ఎన్ని ఈ మహాసభ సందర్భంగా ఆదర్శనగర్ శాఖ పునర్నిర్మాణంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కామ్రేడ్ మండల కార్యదర్శి ఆధ్వర్యంలో నూతన బాధ్యులను ప్రకటించారు. శాఖ కార్యదర్శి పోలోజ్ కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శి: గట్టు చిరంజీవి, కార్యవర్గ సభ్యులు పోలోజ్ బాలాచారి, వడ్ల పాండుఎం అశోక్ చారి, కృష్ణ, చెన్న న్యూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు బస్తీ సమస్యలపై నిరంతరం శ్రమిస్తూ, ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులో ఉంటారని నాయకులు ఆకాంక్షించారు.

## చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడిగా రాహుల్ నియామకం

ప్రజాపక్షం/జవహర్ నగర్ : కాంగ్రెస్ పార్టీ చంద్రపురి కాలనీ డివిజన్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడిగా కదం రాహుల్ నియామకమయ్యారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ తన చేతుల మీదుగా రాహుల్ కు అందజేశారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చేశారు. తన నియామకంపై నూతన అధ్యక్షుడు కదం రాహుల్ స్పందిస్తూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోనని, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించేందుకు సహకరించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నయ్య, డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తో పాటు తోటి నాయకులకు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గడ్డం శ్రీనివాస్, ఏ బ్లాక్ అధ్యక్షులు మాట్లా శ్రీనివాస్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దుర్గామాత ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

ఉత్సవ నిర్వాహకులకు ఎస్‌ఐ గిరి సూచనలు



ప్రజాపక్షం/నవాబుపేట్ : దుర్గామాత ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నవాబుపేట్ ఎస్సై గిరి సూచించారు. ఈ మేరకు ఆదివారం నవాబుపేట్ పోలీస్ స్టేషన్‌లో ఉత్సవాల నిర్వహణపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గిరి మాట్లాడుతూ, ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దుర్గామాత మండపాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలని, విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలని తెలిపారు. ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే ఇతర మతాల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ, సోదరభావాన్ని కాపాడాలని సూచించారు. ఎవరూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని, వివాదాలకు తావిచ్చే చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, విద్వేషపూరిత పోస్టులు పెట్టకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దుర్గామాత ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఎస్సై గిరి కోరారు.

## సుమిత్ర నగర్ కనకదుర్గ ఆలయ నూతన ఉత్సవ కమిటీకి ఆరికెపూడి శుభాకాంక్షలు



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సుమిత్ర నగర్ కాలనీలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయ నూతన ఉత్సవ కమిటీ సభ్యులకు పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ఇఒ శ్రీనివాస్ శర్మతో కలిసి నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేసి, శాలువాతో సత్కరించి అభినందించారు. నూతన ఉత్సవ కమిటీ సభ్యులుగా నాయినేని శ్రీలత చంద్రకాంత్‌రావు, మన్నె వేణు, కాసర్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఆకుల రమాదేవి, జానకి, సాయి, శ్యామ్ రాజు, అనురాధ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## అలియాబాద్ మున్సిపల్ అభివృద్ధే లక్ష్యం



ప్రజాపక్షం/శామీర్‌పేట : అలియాబాద్ మున్సిపాలిటీని అభివృద్ధి పరుచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అలియాబాద్‌లోని 20వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందున వార్డు ప్రజలు చైర్మన్ శిరీషా కృష్ణారెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ దశల వారిగా మున్సిపల్‌లోని అన్ని వార్డులను అభివృద్ధి పరుచుటకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోడూరి మౌనిక దినేష్, మాజి సర్పంచ్ కమతం కృష్ణారెడ్డి, వార్డు ప్రజలు పాల్గోన్నారు.

## చర్లపల్లి గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/చర్లపల్లి : చర్లపల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా రుద్రగోని రాంచందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాగీరు నర్సింహ గౌడ్, కోశాధికారిగా కాసులు శశికాంత్, ఉపాధ్యక్షులుగా బొడిగె రాములుగౌడ్, బిజ్జ ఆనంద్‌రాజ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా బొడిగె శ్రీరాములుగౌడ్, జీడి శ్రీరాములు గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా రాగీరు నాధంగౌడ్, బొడిగె క్రాంతిగౌడ్‌లు ఎన్నికయ్యారు.గౌడ సంఘం సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో బి.శ్రావణ్‌కుమార్‌గౌడ్, నిమ్మల అశోక్‌గౌడ్, కె.ఆనంద్‌గౌడ్, బొడిగె రాజుగౌడ్, ఆర్ వెంకటేష్‌గౌడ్,ఆర్ బాబుగౌడ్,బి ప్రభాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/చర్లపల్లి : కుషాయిగూడ పరిధిలోని పద్మావతి కాలనీలో నూతనంగా నిర్మించనున్న ఆర్చ్ నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.కాలనీలకు ప్రత్యేక గుర్తింపునిచ్చే విధంగా ఆర్చ్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డినాయకులు సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి,సారా అనిల్,జైకృష్ణ,కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 'రైతు నేస్తం' కార్యక్రమానికి రైతులకు ఆహ్వానం

ప్రజాపక్షం/నవాబుపేట్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్న రైతు నేస్తం కార్యక్రమం సోమవారం మండలంలోని నవాబుపేట్, ఎల్లకొండ రైతు వేదికలు, చించల్‌పేట్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుందని మండల వ్యవసాయ అధికారి జ్యోతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానుంది. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రబీ సీజన్‌కు సంబంధించి పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనువైన పంటల ఎంపిక, సాగు, పంటల యాజమాన్య పద్ధతుల పై రైతులకు అవగాహన కల్పించనున్నారు. తద్వారా రైతులు సరైన పంటలను ఎంచుకొని మెరుగైన దిగుబడులు సాధించేందుకు మార్గదర్శనం చేయనున్నారు. రైతులు సోమవారం ఉదయం 10:30 గంటలకల్లా తమకు సమీపంలోని రైతు వేదికకు చేరుకోవాలని వ్యవసాయ అధికారి జ్యోతి సూచించారు.

## సుప్రీం తీర్పు స్వాగతిస్తున్నాం

సాధన ఎన్‌జిఒ సంస్థ

ప్రజాపక్షం /వికారాబాద్ : జిల్లాలో పిల్లల రక్షణ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సాధన ఎన్‌జిఒ ,సోషల్ మీడియా ప్లాట్ పారమ్ ,ఇతర డిజిటల్ మాధ్యమాలు మైనర్లకు సంబంధించిన భారతీయ చట్టాలను పాటించాలనే , నిబంధనను చట్టబద్ధమైన చట్టంలో చేర్చే అవకాశాన్ని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించింది. 18సంత్సరాలు వయోపరిమితి ఉండానే నిబంధన కూడా ఇందులో భాగంగా ఉంది. పిల్లల సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడుపుతూ ఆన్‌లైన్‌లో పిల్లలపై తల్లిదండ్రులు ఓకన్నేసి ఉంచాలని సూచించారు. సాధన ఎన్‌జిఒ డైరెక్టర్ ఆలూరి కామేశ్వరి మాట్లాడుతూ భారత చట్టం ప్రకా రం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ,జవాబుదారీగా మార్చే దిశగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య ఒక ముందడు అని అన్నారు.

## శాస్త్రీయ ఆలోచనతోనే సామాజిక మార్పు

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ శాస్త్రీయ ఆలోచన పెంపొందించు కోవాలని స్ఫూర్తి ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కుంటోళ్ళ యాదయ్య అన్నారు. గురువారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్ సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న శాస్త్రీయ ఆలోచనతో సామాజిక మార్పు కోసం మనం చేస్తున్న కార్యక్రమాల పట్ల విద్యార్థులకు ఇంటరాక్టివ్ కార్యక్రమం జరిగాయి.ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ప్రజలు తన స్వార్థంతో సామాజిక బాధ్యతను విస్మరిస్తున్నారని నేడు యువతలో శాస్త్రీయ ఆలోచన విధానం కొరవడిందని తెలిపారు.స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శాస్త్రీయ ఆలోచనతో చేపడుతున్న 10 అంశాలను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో సంస్కృతి కళశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ హరి ప్రసాద్,ఆర్గనైజేషన్ సభ్యులు పరుశురాం,ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుల్లగూడ గ్రామ అభివృద్ధే లక్ష్యం!

ప్రజాపక్షం/నవాబుపేట్ : మండలంలోని గుల్లగూడ గ్రామంలో ఆదివా రం సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ కవిత శేఖర్, ఉప సర్పంచ్ మహేందర్ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడంతో పాటు, తాగు నీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి ప్రాథమిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టే దిశగా ముందుకు సాగుతున్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
సోమవారం
12-10-2026
www.prajapaksham.in

‘ విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ ‘రణబాలి’. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోంది. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై ‘రణబాలి‘ సినిమా హ్యూజ్. ’

రీల్

# గౌహవాటిలో భారీగా డ్రగ్స్ పట్టివేత

**అసోం:** గౌహవాటిలో పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడింది. మయన్మార్ నుంచి డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరిని అరెస్టుచేసిన నార్కోటిక్స్ అధికారులు అరెస్టు చేసినవారి వద్ద రూ.43 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 6న గౌహతిలో నిర్వహించిన ఆపరేషన్‌లో మణిపూర్‌లోని బిష్ణుపూర్‌కు చెందిన ఇద్దరిని అరెస్టుచేసి, వారి నుంచి 53.94 కిలోల మెథాంఫెటమిన్ టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు నార్కోటిక్స్ అధికారులు తెలిపారు. వారు మయన్మార్ నుంచి భారత్‌లోకి సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. నిందితులు రెండు ట్రక్కులకు ప్రత్యేకంగా ట్యాంకులు ఏర్పాటు చేసి వాటిలో డ్రగ్స్ తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేసి పట్టుకున్నామని అన్నారు. ప్రాథమిక దర్యాప్తులో ఈ డ్రగ్స్ మయన్మార్ నుంచి వచ్చినట్లు తెలుస్తోందని, దీని వెనుక ఎవరెవరు ఉన్నారనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని నార్కోటిక్స్ అధికారులు పేర్కొన్నారు.

## డ్రగ్స్ అడ్డా గోవా

(మొదటి పేజీ తరువాయి)

అని అన్నారు. గోవా యువత డ్రగ్స్‌కు బానిసలు కావొద్దని, గోవా పేరు చెడిపోవద్దన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. గోవాలో కాంగ్రెస్ పార్టీకి కాకుండా ఏ రాజకీయ పార్టీకి ఓటు వేసినా అది బిజెపికే చేరుతుందన్నారు. డ్రగ్స్ లార్డ్స్, ల్యాండ్ మాఫియా గోవాలో రాజ్యమేలాలా? ‘మీరే’ ఆలోచించాలని సూచించారు. దేశాన్ని ఏకం చేసేందుకే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని పునరుద్ఘాటించారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలను ఏకం చేయడానికి ప్రయత్నిస్తుంటే, ప్రధాని మోదీ మాత్రం విభజించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నైస్, ఐస్ బిజెపి ఫ్రంటల్ ఆర్గనైజేషన్‌గా పనిచేస్తాయన్నారు. ఇప్పుడు వాటితో కూడా బిజెపికి ప్రయోజనం లేకుండా పోయిందని, అందుకే ఇప్పుడు భారత ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ పేరుతో ఓట్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగిస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ గోవాకు రావాల్సి ఉన్నప్పటికీ ఢిల్లీలో నిరసన కార్యక్రమాల నేపథ్యంలో ఆయన రాలేకపోయారని, అందుకే రాహుల్ గాంధీ ప్రతినిధిగా ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనను ఇక్కడికి పంపించారని వివరించారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఉన్నది..

గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఉన్నదని, ఇది కాంగ్రెస్ పార్టీ కోసం కాదని, గోవా ప్రజల కోసమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశంలో రుతుపవనాలు ముందుగా కేరళలో ప్రవేశిస్తుందని, ఆ తరువాత గోవాలో ప్రవేశిస్తుందని, అందుకే 2026 కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, ఇప్పుడు 2027 గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. గోవా నుంచి నేరుగా ఢిల్లీ ఎర్ర కోటపై మూడు రంగుల జెండా ఎగరడం ఖాయమన్నారు. గోవా ప్రజలు బిజెపితో విసిగిపోయారని, మళ్లీ మూడోసారి బిజెపి అధికారంలోకి వస్తే గోవా ప్రజలు పరాయి వారిగా మారిపోయే పరిస్థితి ఏర్పడుతుందని, ఇక్కడి భూములు అన్యాక్రాంతమవుతాయని అన్నారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్ కాదని, ఆయన ప్రాపర్టీ సావంత్ అని ఇక్కడి ప్రజలు చెబుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గోవా సీఎం గోవాను అభివృద్ధి చేసే పనిలో కాకుండా, ఇక్కడి ఆస్తులను ఇతరులకు అప్పగించే పనిలో ఉన్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

## బాధితులను తీసుకొస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అని రాంచందర్‌రావు ప్రశ్నించడం సరికాదన్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు, హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల ఓట్లు తొలగించినట్లు ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ గణాంకాలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన ఓట్లు తొలగించబడ్డాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలన్నారు. పేదలు, వృద్ధులు, నిరక్షరాస్యులు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమన్నారు. ఆధార్ వంటి గుర్తింపు పత్రాలు ఉన్నప్పటికీ అదనపు ఆధారాలు కోరితే సామాన్యులు తమ హక్కును ఎలా కాపాడుకోవాలో ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. తన ఓటు విషయంలోనూ తండ్రి పేరు సత్తయ్య, సత్యనారాయణ గౌడ్ వంటి పేర్లలో వ్యత్యాసాలను సాకుగా చూపి ఓటు తొలగించే ప్రయత్నం జరిగిందని పొన్నం ఆరోపించారు. ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న వారందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఓటరు నమోదు, ఆధారాల సమర్పణ అంశంపై చేసిన వ్యాఖ్యలను కూడా పరిశీలించాలని పేర్కొన్నారు. ‘ఓటు బచావో.. దేశ్ బచావో.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం’ అనే నినాదంతో ఓటు హక్కుల పరిరక్షణకు ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# రవితేజ ‘తులాభారం’ షురూ



రవితేజ, దర్శకుడు వివేక్ ఆత్రేయ క్రేజీ కాంబినేషన్‌లో మోస్ట్ ఎవైటెడ్ ఆర్‌టి 78 తెరపైకి వస్తోంది. క్రైమ్, డ్రామా, ఎంటర్‌టైన్‌మెంట్‌తో సరికొత్త అనుభూతిని అందించనున్నాయి. బ్లాక్‌బస్టర్ ‘ఇరుముడి’ విజయంతో జోరు మీదున్న రవితేజ.. ఈ ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై లక్ష్మణ్, శ్రీనిరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తునారు. చిత్ర బృందం సినిమా పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించింది. ముహూర్తం సందర్భంగా వీవీ వినాయక్ చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. చందు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, శ్రీ విష్ణు క్లాప్ కొట్టారు. శివ నిర్వాణ, బాబీ కలిసి తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, వై. రవి శంకర్‌తో పాటు పలువురు అతిథులు పాల్గొన్నారు. ఈ సినిమా టైటిల్‌ను రివీల్‌ను మేకర్స్ వినూత్నంగా రూపొందించిన ‘ది టైటిల్ డాక్యుమెంటరీ’ వీడియోను విడుదల చేశారు. వివేక్ ఆత్రేయ తన దైన స్టయిల్ లో రూపొందించిన ఈ వీడియోను మై హో రామ్ విడుదల చేశారు. ‘తులాభారం’ టైటిల్‌ను ఎంపిక చేసే ప్రక్రియ వెనుక జరిగిన సరదా, వినోదభరితమైన సంభాషణలను ఈ వీడియో ద్వారా చూపించారు. జడేజాగా అనిల్ కరెల్ల, రాబిన్‌గా రవి ఆంటోనీ, సౌండ్‌గా అనస్వర రాజన్, దేవరాజ్‌గా తరుణ్ భాస్కర్, శివాజీ రావుగా జేడీ చక్రవర్తి, కృష్ణవేణిగా ప్రియాంక మోహన్ కనిపించనున్నారు. వివేక్ సాగర్ సంగీతాన్ని అందిస్తున్నారు. తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రవి తేజ గిరిజాల ఎడిటర్‌గా, జీఎం శేఖర్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

# ‘బ్లడీ రోమియో’లో గ్యాంగ్‌స్టర్‌గా నాని



నేచురల్ స్టార్ నాని తన నెక్స్ట్ భారీ ఎంటర్‌టైనర్ ‘బ్లడీ రోమియో’తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ‘ఓజీ’ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నాని, సుజీత్ కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రం. డార్క్ హ్యూమర్, యాక్షన్, విలక్షణమైన పాత్రలతో ఈ సినిమా ప్రేక్షకులను అలరించనుంది. వెంకట్ బోయనపల్లి నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్, యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ‘బ్లడీ రోమియో’ కోసం నాని తన సరికొత్త లుక్‌ను పరిచయం చేశారు. మేకోవర్‌కు సంబంధించిన వీడియోను విడుదల చేస్తూ, తన ప్రత్యేకమైన స్క్రీన్ పర్సనాలిటీని తీర్చిదిద్దడం వెనుక జరిగిన కృషిని ప్రజెంట్ చేశారు. సినిమా కథకు, పాత్ర స్వభావానికి తగ్గట్టుగా ఈ లుక్‌ను రూపొందించారు.ప్రముఖ సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఆలీమ్ హకీమ్ నాని మేకోవర్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. డిఫరెంట్ హెయిర్‌స్టైల్ నానికి రెబల్ లుక్‌ను తీసుకొచ్చింది. సినిమాలోని పాత్రకు అనుగుణంగా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా రూపొందించారు. ఈ ఈ సినిమాలో ఆయన చెఫ్‌గా, గ్యాంగ్‌స్టర్‌గా రెండు విభిన్న కోణాల్లో కనిపించనున్నారు.

# ‘కరికాల’లో కేథరిన్ థ్రెసా



శంబాల’ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు దర్శకుడు యుగంధర్ ముని కలిసి మళ్లీ ఓ విజువల్ వండర్‌ను క్రియేట్ చేయబోతోన్నారు. సందీప్ కిషన్ హీరోగా షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మాణంలో యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న చిత్రం ‘కరికాల’. ఈ మూవీని రెండు చాప్టర్‌లుగా తెరకెక్కిస్తున్నారు. మొదటి చాప్టర్ 2027 జులై 2న , రెండో చాప్టర్ 2027 అక్టోబర్ 28న విడుదల కాబోతోన్నట్టుగా మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సోషియో ఫాంటసీ, విజువల్ వండర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం సందీప్ కిషన్‌కి జోడీగా కేథరిన్ థ్రెసా నటించనున్నారు. ఈ మేరకు హీరోయిన్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. సందీప్ కిషన్, కేథరిన్ థ్రెసా అలెగ్జాండర్ తెరపై మొదటి సారిగా కలిసి కనిపించబోతోన్నారు. కేథరిన్ థ్రెసా అలెగ్జాండర్ ఓ డిఫరెంట్ రోల్‌ను పోషించబోతోన్నట్టుగా తెలుస్తోంది. వెల్కమ్ ఆన్ బోర్డ్ అంటూ ‘కరికాల’ టీం స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. సోషియోఫాంటసీ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా ‘కరికాల’ టీం పని చేస్తోంది. ఈ సినిమాకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు.

# నవంబర్ 6న ‘నాన్న కుట్టి’



ఫాదర్ అండ్ డాటర్ సెంటిమెంట్‌తో ము.మారన్ దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ హీరోగా చేస్తున్న చిత్రం ‘నాన్న కుట్టి’. యాక్షన్, కుటుంబ భావోద్వేగాలు, ఇంటెన్స్ డ్రామాగా ఈ మూవీని రూపొందిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్ మీద మీరా విజయ్ ఆంటోని నిర్మాతగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ మూవీకి సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ అధినేత రామంజనేయులు జవ్వాజీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దీపావళి సందర్భంగా ఈ మూవీని నవంబర్ 6న విడుదల చేయబోతోన్నారు. దీపావళి సెలవులు కలిసి వచ్చేలా ఈ మూవీ రిలీజ్‌ని ప్లాన్ చేసినట్టు కనిపిస్తోంది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లను గమనిస్తే.. ఈ సినిమాలో తండ్రీకూతుళ్ల సెంటిమెంట్‌ని ప్రధానంగా చూపించబోతోన్నారని అర్థం అవుతోంది.ఈ చిత్రంలో ప్రీతి అస్రాని, లిథన్య, భగవతి పెరుమాళ్, హరిప్రియ ఇసై, అరువి మధన్, చిత్ర లక్ష్మణన్, శ్రీజ రవి, వెట్టై ముత్తుకుమార్, జెన్సన్ దివాకర్, మురుగానందం, మున్నార్ రమేష్, లిస్సీ ఆంటోని, కుమార్ నటరాజన్, విజయన్, ప్రవీణ, హరిత, హరిప్రియ తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు.










Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com